విశాలాంధ్ర చందా వివరాలు

	ఏజెంటుద్వారా	పోస్టుద్వారా
నెలకు	రు. 7-50	రు. 8-10
3 నెలలకు	22-50	24-30
6 నెలలకు	44-00	47-60
సంవత్సరమునకు	88-00	95-20

ఆదివారంతోసహా దినపత్రిక 25 పైసలు

VISALAANDHRA Phone No. 75301 ఉదయం *** Regd. No. H/VJ/47

విశాలాంధ్ర

704681

సంపుటి 25 సంచిక 193

విజయవాడ 30—10—75 గురువారం

6 పేజీలు 25 పైసలు

చదవండి!

కమ్యూనిజం

సిద్ధాంత, రాజకీయ వ్యాసాలతో ప్రజా ఉద్యమాల అనుభవాల సమీక్షలతో పార్టీ నిర్మాణ సమస్యలు ప్రశ్నలు - సమాధానాలతో ప్రతినెల 1 వ తేదీన వెలువడుతోంది.

సంవత్సర చదా రూ 6 లు విడి ప్రతి 60 పైసలు

బంగారం, వజ్రాల వ్యాపారుల ఇండ్లపై ఆదాయపు పన్ను అధికారుల దాడులు

హైద్రాబాద్‌తోసహా పలు ముఖ్య నగరాలలో; కోటి రూపాయలకుపైగా విలువచేసే ఆభరణాల స్వాధీనం

న్యూఢిల్లీ, అక్టోబరు 29

ముఖ్య నగరాలలోని వజ్రాలు, బంగారం వ్యాపారస్తుల ఇండ్లపైనా, షాపులపైనా ఆదాయపు పన్ను శాఖాధికారులు దాడిచేసి దాదాపు ఒక కోటి ఇరవై లక్షల రూపాయల విలువచేసే వజ్రాలను, ఆభరణాలను, నగదును పట్టుకున్నారు.

ఈ విషయాన్ని ప్రత్యక్ష పన్నుల బోర్డు అధ్యక్షులు శ్రీ యస్ ఆర్. మెహతా ఇక్కడ తెలియచేశారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో దాదాపు ఒకేసారి జరిగిన యీ దాడులవల్ల లెక్కలు పూర్తయితే దాదాపు రెండు కోట్ల రూపాయల సంపద వెలుగులోకి వస్తుందని శ్రీ మెహతా అన్నారు.

నిన్న ఒకే రోజున యీ దాడులు జరిగాయి. అనేక అభ్యంతరకరమైన డాక్యుమెంట్లతోపాటు అక్కౌంటు పుస్తకాలను కూడా ఆదాయపుపన్ను శాఖాధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ వ్యాపారులకు చెందిన 40 బ్యాంకు లాకర్లకు అధికారులు సీళ్ళు వేశారు

ఢిల్లీ, బొంబాయి ఆగ్రా జైపూర్, హైదరాబాద్, కలకత్తాలలో పెద్దయెత్తున యీ దాడులను ఆదాయపు పన్నుశాఖ పరిశోధక డైరెక్టరేట్ నిర్వహించిందని శ్రీ మెహతా అన్నారు

బంగారం వ్యాపారులు, మరికొంతమంది ఆదాయపుపన్ను చెల్లింపుదార్లకు సంబంధించిన 67 వ్యాపార నివాస భవనాలపై యీ దాడులు జరిగాయి. ఈ భవనాల సోదా వారంరోజులపాటు కొనసాగుతుంది

ప్రముఖ నగరాల, వజ్రాల వ్యాపారులు బంగారం, బంగారం ఆభరణాల, బ్లాక్ మార్కెట్ ఒప్పందాలలో వున్నారని, స్మగ్లింగ్ కార్యకలాపాలలో భాగస్వామ్యం వున్నదని సమాచారం అందినమీదట యీ దాడులు జరిగాయి.

ఆదాయపు పన్ను శాఖ అధికారుల దాడులకు గురైనవారిలో ఒకరు దక్షిణాది రాష్ట్రం మాజీపాలకుని అల్లుడుగా వున్నారని శ్రీ మెహతా అన్నారు ఈ వ్యక్తి పేరు చెప్పేందుకు శ్రీ మెహతా నిరాకరించారు మాజీ రాజా నుండి పొందిన విలువైన ఆభరణాలను యీ వ్యక్తి బొంబాయిలోని తన సహచరుల ద్వారా అమ్ముతూ వచ్చాడని ఆయన అన్నారు.

ఈ దాడులలో స్వాధీనం చేసుకున్న వాటిలో విదేశీ గుర్తులుగల 600 క్యారట్ల విడి వజ్రాలు, అనేక వజ్రాలు పొదిగిన ఆభరణాలు, ఒక బొంబాయి వ్యాపారి ఇంటి ఆవరణలో విగ్రహం క్రింద దాచి పెట్టబడి వున్నాయి

ఆగ్రాలోని మరో ప్రముఖ బంగారు వ్యాపారివద్ద విలువైన పురాతన పెయింటింగ్‌లు, భారతీయ, విదేశీ కళాఖండాలు వజ్రాలతో పొదిగిన నెమలి లభించాయి. వీటి విలువను అతి తక్కువగా చేసి లెక్కలలో చూపటం జరిగింది.

ఒక ఢిల్లీ వ్యాపారివద్ద లెక్కలలో చూపని రెండు పెట్టెల బంగారం నగలు, ఒక పెట్టె నిండా రత్నాలు లభించాయి ఢిల్లీలోనే మరో వ్యాపారివద్ద 3182 అమెరికా డాలర్లు దొరికాయి.

ఒక ఢిల్లీ బంగారు వ్యాపారి ఉద్యోగి ఇంట్లో జరిపిన సోదాలో ఒక పెట్టె నిండా రత్నాలు, వైడూర్యాలు లభించాయి యజమాని సంతకం చేసిన ఖాళీ బ్యాంకు చెక్కు, పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకున్న వస్తువులు దొరికాయి.

ఇదీలోకం

ఈ భారీ వర్షాలు మరో రెండు రోజులు దంచితే బాగుంటుంది. పండగ దండగ వుండదు.

వనస్పతి ధర తగ్గుదల

న్యూఢిల్లీ అక్టోబరు 29

వనస్పతిధర దేశవ్యాపితంగా ప్రత్యేకంగా గత వారం రోజులుగా తగ్గుముఖం పట్టింది

పౌరసరఫరా, సహకార శాఖలు జరిపిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ప్రధాన వినియోగ కేంద్రాలలో 6¼ కిలోల వనస్పతి టిన్ను ఖరీదు రు. 142 నుండి రు. 144 ల వరకు వున్నది గతంలో ఈ టిన్ ధర రు 150 ల నుండి రు. 155 ల వరకు వుండేది

వేరుశనగ పంట బాగా పండటం, దిగుమతి చేసుకున్న ఆయిల్‌ను యస్. టి. సి మార్కెట్‌లోకి విడుదల చేయటమే వనస్పతి ధరల తగ్గుదలకు ప్రధాన కారణం. యస్. టి. సి ధరల విధానం వల్ల వనస్పతి ధర పెరిగిందని కొన్ని పత్రికలలో వచ్చిన వార్తలు నిరాధారమైనవని ఈ సర్వేలో తెలిసింది.



భారత ప్రధాని శ్రీమతి గాంధీతో చర్చిస్తున్న కామన్‌వెల్తు ప్రధాన కార్యదర్శి రాంఫాల్

పేదరికం నిర్మూలనలో సంపన్న దేశాల పాత్ర

కామన్వెల్తు దేశాల సమావేశంలో రాంఫాల్ ఉద్ఘాటన

న్యూఢిల్లీ, అక్టోబరు 29

ప్రపంచంలో నూరుకోట్లమంది ప్రజలు పేదరికంతో బాధలుపడుతున్నారనీ, అందుచేత వారిలో పేదరికంనిర్మూలనకు సంపన్న దేశాలు తీవ్రంగా కృషిచెయ్యాలనీ కామన్వెల్తు సెక్రటేరియట్ ప్రధాన కార్యదర్శి యస్. యస్. రామ్‌ఫాల్ నేడు విజ్ఞప్తి చేశారు

తమ దేశాలలోనే కాకుండా, తమకు దూరంగవున్న దేశాలలో, ప్రత్యేకించి తృతీయ ప్రపంచానికి సంబంధించిన క్రొత్త దేశాలలో కూడా ప్రజాతంత్ర వ్యవస్థలు నెలకొనాలని చిత్తశుద్ధితో కోరుతున్నట్లయితే, మానవాళి అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా వున్న అంతర్జాతీయ దారిద్ర్య నిర్మూలనకు సంపన్నదేశాలు కృషిచెయ్యాలని యిక్కడ జరుగుతున్న 21 వ కామన్వెల్తు సభ్యదేశాల సర్వసభ్య సమావేశంలో నేడు రెండవరోజున రామ్ ఫాల్ ప్రసంగిస్తూ చెప్పారు.

సంపన్న దేశాలు తృతీయ ప్రపంచ దేశాల సమస్యలను గురించి అంతగా పట్టించుకోకపోతే, ఆ దేశాలలో పేదరికం నిర్మూలనకు నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను స్థాపించి మనగ్రహంలోని ప్రజలనుఇప్పుడు వేరుచేసివుంచిన సహింపశక్యంగాని పేదరికపు అసమానతలను వాస్తవంగానే తొలగిస్తుందన్న అంశాన్ని ఆ దేశాలు గుర్తించాయనీ చెప్పారు.

చిట్టచివరకు ప్రపంచంలోని వివిధదేశాల పరస్పర సమన్వయ సంబంధాలు సంతృప్తికరంగానే జరుగుతాయనీ, కాని భవిష్యత్తులో కామన్వెల్తుముందు ఒకవైపున సంపద, మరోవైపున పేదరికం అనే ప్రధాన సమస్య మాత్రం నిలిచివుంటుందనీ, అందుచేత మానవ సమాజాన్ని వేరుపరచివుంచే అగాధాన్ని ప్రత్యేక వనరులతో పూడ్చడంద్వారా ఆర్థిక అసమానతలను పోగొట్టాలనీ చెప్పారు

ఆసియాలో సుస్థిరశాంతికి పునాదులునెలకొనేఅవకాశం

వియత్నాం యుద్ధ పరిసమాప్తివల్ల ఏర్పడిందని బ్రెజ్నేవ్ అభిభాషణ

మాస్కో అక్టోబరు 27

వియత్నాం, లావోస్, కాంబోడియాలలో యుద్ధం పరిసమాప్తి అయిన దృష్ట్యా- ఆసియాలో రాజకీయ వాతావరణం అభివృద్ధి చెందేందుకు, ఆసియా ఖండంలో సుస్థిర శాంతి స్థాపనకు పునాదులు నెలకొనేందుకు సహాయపడుతుందనీ సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి లియోనిద్ బ్రెజ్నేవ్ నేడు ఆశాభావం వ్యక్తం చేశారు.

సోవియట్ యూనియన్‌లో పర్యటిస్తున్న ఉత్తరవియత్నాం వర్కర్స్‌పార్టీ ప్రథమ కార్యదర్శి లీడువాన్ గౌరవార్థం ఏర్పాటు చేసిన విందులో బ్రెజ్నేవ్ ప్రసంగిస్తూ, ఆసియాలో సుస్థిర శాంతిస్థాపనకు సోవియట్ యూనియన్ అగ్రతర ప్రాధాన్యత యిస్తోందని చెప్పినట్లు టాస్ వార్తాసంస్థ తెలియజేసింది.

ఉమ్మడి లక్ష్యమైన సామ్రాజ్యవాద వ్యతిరేక విముక్తిపోరాటానికి దక్షిణవియత్నాంలో జాతీయవిముక్తి సంపూర్ణ సాధించిన విజయం మహత్తర సహాయం చేసిందని బ్రెజ్నేవ్ ఉద్ఘాటించారు

ప్రస్తుత ప్రపంచంలో సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధ విధానానికి ఏకపక్ష నిర్ణయాలకు స్వస్తి చెప్పడం సాధ్యమేనని అన్నారు

వియత్నాం ప్రజలు శక్తివంతంగా పోరాడి చారిత్రక ప్రాధాన్యతకల విజయాన్ని సాధించినందుకు బ్రెజ్నేవ్ వారిని ప్రశంసించారు.

వారి ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణానికి సోషలిజం పంథాలో మరింతగా ప్రగతి సాధించేందుకు సోవియట్ యూనియన్ భారీ యెత్తున సహాయం చేస్తుందని వాగ్దానం చేశారు.

దువాన్ సమాధానం చెబుతూ సోవియట్ యూనియన్ అందచేస్తున్న ప్రత్యేకించి యుద్ధ సమయంలో అందచేసిన మహత్తర సహాయానికి కృతజ్ఞతలు తెలియ చేశారు.

ఉత్తర వియత్నాం ప్రజలు జరిపిన తీవ్ర పోరాటం వల్ల సోవియట్ యూనియన్ ఇతర సోషలిస్టు దేశాలు అందచేసిన మహత్తర సహాయంవల్ల యుద్ధంలో విజయం సాధ్యమైందనీ ఆయన చెప్పారు.

తాము సాధించిన మహత్తర విజయం ద్వారా కలిగిన ఆనందాన్ని, సోవియట్ ప్రజలందరితోనూ, ఆ చారిత్రాత్మక విజయ సాధనలో తమకు పెద్దయెత్తున తోడ్పాటు అందచేసిన తమ సోదరులతోను, కామ్రేడ్సుతోను కలిసి పంచుకోడానికే తాము యిచ్చటకు వచ్చామనీ ఆయన తెలియ జేశారు.

ప్రతిపక్షశక్తుల కుట్రలు బగ్నంచేసేందుకు ప్రగతిశీలశక్తుల సమైక్య పోరాటం

నందిగామ సభలో మంత్రి శ్రీ చనుమోలు, కమ్యూనిస్టు నాయకులు శ్రీ వంకా, శ్రీ దాసరి పిలుపు

(విశాలాంధ్ర ప్రత్యేక విలేకరి)

నందిగామ, అక్టోబరు 29

దేశ ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా పరిణమించిన ఆంతరంగిక, విదేశీ శక్తుల కుట్రలను ప్రతిఘటించి పీడిత ప్రజల హక్కుల సాధించేందుకు ప్రగతిశీలపార్టీలు, శక్తులూ, వ్యక్తులూ సమైక్యంగా పోరాడాలని రోడ్లభవనాల శాఖా మంత్రి శ్రీ చనుమోలు వెంకట్రావు పలువురు కాంగ్రెస్, కమ్యూనిస్టు నాయకులు గత రాత్రి ఇక్కడ జరిగిన బహిరంగ సభలో ఉద్బోధించారు.

అంతకుముందు జల్లులు పడుతున్నప్పటికీ 2 వేలమంది ప్రజానీకం ఎర్రజెండాలు త్రివర్ణ పతాకాలు చేబూని పురవీధులగుండా ప్రదర్శన జరిపారు. 20 అంశాల ఆర్థిక కార్యక్రమం అమలుకై సాగిన ఈ ప్రదర్శన అగ్రభాగాన శాసనసభ ప్రతిపక్ష ఉపనాయకులు శ్రీ వంకా సత్యనారాయణ, శాసన సభ్యులు శ్రీ వసంత నాగేశ్వరరావు తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఎస్ నాగేశ్వరరావు నందిగామ సమితి అధ్యక్షులు శ్రీ మొక్కపాటి వెంకటేశ్వర్లు కంచికచర్ల బ్లాకు కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ వేమానరసింహారావు, కంచికచర్ల సమితి అధ్యక్షులు శ్రీ చింతా వెంకటేశ్వర్లు, జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ జె ఎన్. ఆర్ ఆంజనేయశాస్త్రి, భూమి తనఖాబ్యాంకు డైరెక్టర్ శ్రీ దాసరి అంకమ్మరావు మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షులు అడుసుమల్లి సూర్యనారాయణరావు జిల్లా ట్రేడ్ యూనియన్ నాయకులు శ్రీ కొటారి పేరయ్య, తాలూకా కమ్యూనిస్టు నాయకులు శ్రీ పన్నా రాధాకృష్ణమూర్తి నడిచారు. ప్రధానంగా వ్యవసాయ కార్మికులు పాల్గొన్న ఈ ప్రదర్శనలో పేదలకు బంజర్లు పంచాలి, ఇళ్ళ స్థలాల పట్టాలివ్వాలి. భూ సంస్కరణలు అమలు చేయాలి అని ప్రదర్శకులు నినాదాలిచ్చారు.

అనంతరం జోరున వర్షం కురుస్తుండగా భారత్‌టాకీస్‌లో కిక్కిరిసిన ప్రజానీకంతో జరిగిన బహిరంగసభకు జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీమతి సూర్యదేవర అన్నపూర్ణమ్మ అధ్యక్షత వహించారు. శ్రీ ఎస్. నాగేశ్వరరావు సభ ఉద్దేశాలను వివరిస్తూ స్వాగతం పలికారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు శ్రీ పొన్నా సత్యనారాయణ మృతికిసంతాప సూచకంగా సభ మౌనం పాటించింది.

మంత్రి శ్రీ చనుమోలు వెంకట్రావు ప్రసంగిస్తూ ప్రభుత్వ ప్రగతిశీల కార్యక్రమాలకు ప్రతిబంధకాలు నానాటికీ పెరగడంవల్ల అత్యవసరపరిస్థితి అవసరమయింది. మన దేశంలో ప్రజాస్వామ్యం లేదని కొన్ని దేశాలు చెప్పుతున్నప్పటికీ ప్రధాని కార్యక్రమాలను 90 శాతం ప్రజలు బలపరుస్తున్నారు.

ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రగతిశీల దేశభక్తియుత శక్తులు పార్టీలూ, సంస్థలూ విభేదాలను విస్మరించి ఐక్యంగా పోరాడాలి. విజయవాడలో నవంబరు 7 న జరిగే సభలో భారతకమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ చండ్రరాజేశ్వరరావు కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీబారువా ప్రసంగించనున్నారు. ఇది ఎంతో సంతోషదాయకమైన విషయం,

ఆర్థిక కార్యక్రమం ప్రజలకొక ఆయుధం

కమ్యూనిస్టు శాసనసభ్యులు శ్రీ వంకా సత్యనారాయణ ప్రసంగిస్తూపాతికేళ్ల స్వాతంత్ర భారతంలో దున్నేవాడికి భూమి, తిండి, బట్ట లేకపోవడం వల్ల ప్రజలలో ప్రబలిన అశాంతిని అభివృద్ధి నిరోధకులు అనువుగా తీసుకున్నారు రక్తపాతంతో ప్రజాస్వామ్యాన్ని కాలరాయడానికి కుట్ర పన్నారు. ఈ కుట్రలను పతిఘటించి కనీస సంస్కరణలు సాధించి ఐక్యంగా పురోగమించేం

(మిగతా 3 వ పేజీలో)

4 నెలలుగా టీచర్లు లేని హరిజన పాఠశాల

ఒంగోలు, అక్టోబరు 29

ప్రకాశంజిల్లా మద్దిపాడు సమితిలోని తెల్లపాడు హరిజన వాడలో ఒక సంవత్సరం క్రితం ప్రభుత్వ ఆదేశం మేరకు పంచాయతీ సమితివారు ఒక పాఠశాలను ఏర్పాటు చేశారు

ఈ హరిజనవాడ పాఠశాలలో 100 మంది విద్యార్థులున్నారు.

హరిజనులు కొంత డబ్బు ఖర్చుపెట్టి పాఠశాలకు కావలసిన ఫర్నిచరు, యింటిని ఏర్పాటు చేసుకున్నారు.

కాని యీ సంవత్సరం సమితి అధ్యక్షులు శ్రీ మోపర్తి పున్నయ్యచౌదరి హరిజనవాడలో ఉన్న ఉపాధ్యాయులు యిద్దరిని గ్రామంలో ఉన్న మరొక పాఠశాలకు బదిలీ చేశారు.

గత నాలుగుమాసాలనుండి హరిజనవాడ పాఠశాలలో ఉపాధ్యాయులు లేరు

ఈ విషయం డి ఇ ఓకు, విద్యాశాఖ డైరెక్టరుకు తెలియజేసుకొనగా హరిజనవాడలోని పాఠశాల హరిజనవాడలోనే ఉండాలని ఆర్డరు యిచ్చియున్నారు.

కాని సమితి అధ్యక్షులు ఆ ఆర్డరును లెక్కచేయలేదు. విద్యార్థులు, ఉపాధ్యాయులు లేక నానా అవస్థపడుతున్నారు.

30 మంది విద్యార్థులు హాజరవుతున్న గ్రామంలోని పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులున్నారు.

కాని 100 మంది హాజరవుతున్న హరిజనవాడ పాఠశాలలో ఉపాధ్యాయులు లేరు.

(వి వి)

అగ్రికల్చరల్ అసిస్టెంట్లకు గజిటెడ్ ఆఫీసర్ హోదా

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వు

హైదరాబాదు, అక్టోబరు 29

వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లకు నిర్ణయించిన నిబంధనల ప్రకారం వ్యవసాయ శాఖలో అసిస్టెంట్ అగ్రికల్చరల్ అఫీసర్లను గజిటెడ్ ఉద్యోగులుగా పరిగణించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది

ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వును నిన్న జారీచేయటం జరిగింది నాన్‌గజిటెడ్ అఫీసర్లకు వర్తించే కన్సెషనులు, అలవెన్సులను అసిస్టెంట్ అగ్రికల్చరల్ అఫీసర్లకు కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది అఫీసు లేక ఇంటి వద్ద అటెండర్ సౌకర్యం లేకుండా వుండే షరతుగా వారిని గజిటెడ్ అఫీసర్లుగా పరిగణిస్తారు.

అసోసియేషన్ హర్షం

ప్రభుత్వ నిర్ణయం పై ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ అగ్రికల్చరల్ అఫీసర్స్ అసోసియేషన్ హర్షం ప్రకటించింది

దీర్ఘకాలంగా అసోసియేషన్ చేస్తున్న డిమాండును అంగీకరించినందుకు ముఖ్యమంత్రికి, వ్యవసాయశాఖ మంత్రికి అసోసియేషన్ కార్యదర్శి శ్రీ ఎ. అప్పారావు కృతజ్ఞతలు తెలియ చేశారు.

ఇటీవల వేతనాల నిర్ణయించటంలో జరిగిన అన్యాయాన్ని ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి పరిశీలించి తొలగించగలరనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

సాంకేతిక శాఖలలో ఇతర ఉద్యోగులతో వేతనాలను సమం చేసి న్యాయాన్ని కలుగ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వినోబాభావే మౌనవ్రతం విరమణ

నాగపూర్ అక్టోబరు 29

భూదానోద్యమ నాయకులు ఆచార్య వినోబాభావే తన ఒక సంవత్సర మౌన వ్రతాన్ని డిసెంబర్ 25 వ తేదీన విరమిస్తారు.

పౌనార్ ఆశ్రమంవద్ద భూదాన్ కార్యకర్తల రజితోత్సవ సభలను ప్రారంభించే సందర్భంగా ఆయన మౌన వ్రతం విరమించబడుతుంది

గుంటూరుజిల్లాలో వరిపైరుకు దోమకాటు, ఆకుముడత తెగులు

అతివృష్టివల్ల రు. 2కోట్ల నష్టంజరిగిందనిఅధికారి వివరణ

(విశాలాంధ్ర విలేకరి)

గుంటూరు, అక్టోబరు 29

గుంటూరుజిల్లాలో వరిపైరుకు దోమకాటు, ఆకుముడత తెగుళ్ళ ప్రమాదం వ్యాపిస్తున్నదని ఇంకా 1 రోజులు వరిపంటకు గడ్డు దినాలని వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టరు శ్రీ జి పార్థసారథి ఈనెల 27 వ తేదీన విశాలాంధ్ర విలేకరితో అన్నారు

కృష్ణా, పశ్చిమ డెల్టా ప్రాంతమునకు చెందిన తెనాలి తాలూకా అమృతలూరు పంచాయతీ సమితి, రేపల్లె తాలూకా పిల్లలట పంచాయతీ సమితి బాపట్లతాలూకాలోని బాపట్ల పొన్నూరు పంచాయతీ సమితులు గుంటూరు తాలూకా ప్రత్తిపాడు పంచాయతీ సమితులకు చెందిన గ్రామాలలోని పొలాలలో వరిపైరుకు దోమకాటు సుడులు సుడులుగా వ్యాపించినదని జిల్లా వ్యవసాయశాఖాధికారి తెలియచేశారు.

నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రాంతంలో, వరిపంటకు నాములేక ఆకుముడతతెగులు అక్కడక్కడా సోకుతున్నది

వ్యవసాయ శాఖాధికారులు సస్యరక్షణకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు

విలేజి డెవలప్‌మెంట్ అఫీసరు కార్యదర్శి ప్రతి గ్రామంలోను రైతు పెద్దలతో కమిటీలు ఏర్పరచి మందులు వరిపైరుకు ఏ విధంగా చల్లాలో తెలియచేస్తున్నామని, అవసరమైన క్రిమిసంహారక మందులు స్ప్రేయర్లు డస్టర్లు, విరివిగా ప్రతి బ్లాకుకు పంపిస్తున్నామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వరిపంటను తెగుళ్ళనుంచి కాపాడుటకు తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ అన్నారు. రెండేసి బ్లాకులను ఒక అసిస్టెంట్ డైరెక్టరును పొలాలను పరిశీలించమని ఆదేశాలిచ్చినట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి తెలియ చేశారు

ఈ దశలో వరిపైరును దోమకాటునుంచి సంరక్షించుటకు సీబా కంపెనీవారి నువక్రాన్‌ను కొట్టవలెనని దోమ తెగుళ్ళను సమూలంగా పోగొట్టుటకు ఈ మందు కొట్టిన తర్వాత 1 గంటల వ్యవధి దాటిన వరి మొక్కలు ఈ మందును పీల్చుకొనగలవని దోమకాటు సమూలంగా నిర్మూలించుటకు ప్రస్తుతం ఈ మందే మంచిదని జిల్లా వ్యవసాయశాఖాధికారి అన్నారు

దోమకాటు మొక్కలు వత్తుగా నాటిన ప్రాంతాలలో త్వరగా సోకుతుందని పొలాలలో నైట్రోజన్ ఎరువులు ఎక్కువగా చల్లి తర్వాత అమ్మోనియం నైట్రోజన్‌గా మారుతున్న దశలో దోమకాటు సోకుతుందని జిల్లా

(మిగతా 3 వ పేజీలో)

సంయుక్త ప్రాజెక్టుల ఏర్పాటుకు పరిశీలన

భారత్, హంగరీలచే

న్యూఢిల్లీ, అక్టోబరు 28

భారత్ - హంగరీలు అటు భారత్‌లో గాని లేదా హంగరీలో గాని సంయుక్తంగా ప్రాజెక్టులు నెలకొల్పే అంశాన్ని పరిశీలిస్తున్నాయి ఈ ప్రాజెక్టులలో ఉత్పత్తి చేయబడిన వస్తువులు విదేశాలకు ఎగుమతి చేయబడతాయి

ఎలక్ట్రానిక్స్ రంగంలో ఉభయ దేశాలు సహకరించుకునేందుకు మంచి అవకాశాలున్నాయనీ రాష్ట్రపతి శ్రీ ఫకృద్దీన్ అలీ అహమ్మద్ తెలియజేసినట్లు భారత్ - హంగరీ వాణిజ్య, ఆర్థిక సహకార అధ్యయన బృందం (ఐ.హెచ్ జి టి సి ఓ) ఒక ప్రకటనలో తెలియచేసింది

ఇటీవల హంగేరీలో తన పర్యటనగురించి తనను కలుసుకున్న ఐ హెచ్ జి టి,సి ఓ ప్రతినిధివర్గానికి శ్రీ ఫక్రుద్దీన్ వివరించారు కోటిమంది జనాభాగల హంగేరీ చిన్నదేశమయినప్పటికీ హంగేరీ ఇటీవల కాలంలో గణనీయమయిన అభివృద్ధిని సాధించిందని ఆయన తెలిపారు

ఉభయదేశాలమధ్య మంచి స్నేహ సంబంధాలు వున్నాయి. రెండుదేశాలమధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను సులభంగా మెరుగుపరచుకునేందుకు యీ సంబంధాలు దోహదం చేస్తాయి అని ఆయనన్నారు

రుణవిముక్తి చట్టంపై సుప్రీంకోర్టు స్టే

న్యూఢిల్లీ, అక్టోబరు 29

మహారాష్ట్ర రుణ విముక్తి చట్టం అమలును నిలుపుచేస్తూ సుప్రీంకోర్టు నేడు ఇంజంక్షన్ జారీ చేసింది.

బొంబాయికి చెందిన 31 మంది వడ్డీ వ్యాపారుల రిట్ పిటీషన్‌పై సుప్రీంకోర్టు యీ ఇంజంక్షన్ జారీచేసింది.

తాకట్టు పెట్టుకున్న వస్తువుల వివరాలను తెలియచేస్తామని పిటీషనర్లు యిచ్చిన హామీపై ముగ్గురు న్యాయమూర్తుల బెంచి ఇంజంక్షన్ జారీ చేసింది

ట్రేడ్‌యూనియన్ల రిజిస్ట్రేషన్‌కు 25 శాతం కార్మికుల తోడ్పాటు

అంక్షలు విధించనున్నామని కార్మికమంత్రి వెల్లడి

హైదరాబాద్, అక్టోబరు 29

ట్రేడ్ యూనియన్‌ల రిజిస్ట్రేషన్‌కు కార్మికులు 25 శాతం మంది తోడ్పాటు వుండాలని ఆంక్ష విధిస్తూ ట్రేడ్‌యూనియన్ చట్టాన్ని సవరించాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది

ట్రేడ్‌యూనియన్‌ల గుర్తింపు రహస్య బ్యాలెట్ పద్ధతిలోనే జరగాలని, మధ్యవర్తిత్వ చర్చలకు యాజమాన్యం తప్పనిసరిగా హాజరు కావాలని నిర్బంధంవిధిస్తూ కూడా చట్టాన్ని సవరించాలని ఆలోచిస్తున్నది

ఈ విషయంలో రాష్ట్ర మంత్రివర్గం సమ్మతించింది. కేంద్రాన్ని కూడా అనుమతించాల్సిందిగా కోరామని కేంద్రం అనుమతి రాగానే ఆర్డినెన్స్‌ల రూపంలో సవరణలు తెస్తామని రాష్ట్ర కార్మిక మంత్రి శ్రీ అంజయ్య నేడిక్కడ పత్రికా విలేకరులకు చెప్పారు.

రాష్ట్ర కార్మికశాఖ అధికారుల సమావేశం అనంతరం శ్రీ అంజయ్య పై విషయం చెప్పారు

యూనియన్‌ల గుర్తింపు తప్పనిసరిగా రహస్యబాలెట్ పద్ధతిద్వారా జరగాలని ప్రభుత్వం భావిస్తున్నది. మధ్యవర్తిత్వ సంప్రదింపులకు హాజరుకాని యాజమాన్యానికి చట్టబద్ధంగా శిక్షలు విధించే నిబంధనలు ప్రవేశపెట దలచామని ఆయన తెలిపారు

అలా గైరుహాజరయ్యేవారికి జరిమానా జైలుశిక్ష లేదా రెండూ విధించే ఆలోచన వుందని మంత్రి చెప్పారు.

కేంద్రం లో మాదిరిగానే రాష్ట్రం లో ఎపెక్స్ బాడీని ఏర్పాటుచెయ్యాలని నిర్ణయించినట్లు చెప్పారు.

లోగడ కొన్ని సంవత్సరాల క్రితం పరిశీలించబడిన కార్మికులపట్ల అనుసరించే తప్పుడు పద్ధతులను నిరోధించే బిల్లు తిరిగి తీసుకురావడానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు ప్రస్తుతం యీ బిల్లు లా కమిషన్ పరిశీలనలో వుందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు

వార్నర్ హిందుస్తాన్ పారిశ్రామిక వివాదం విషయంలో మేనేజిమెంటు తరపు శ్రీ పార్థసారథి, కార్మికుల తరపున శ్రీ రామానుజం వున్న ద్విసభ్య కమిటీ యీ నెల 28 వ తేదీన హైదరాబాదువచ్చి చర్చలు జరిపారనీ అయితే పరిష్కారం కుదరలేదని చెప్పారు

ఇప్పుడు యూనియన్ మేనేజిమెంటు అంగీకారంపై నియమించబడే జుడీషియల్ ఆర్బిట్రేషన్ నిర్ణయానికి ఉభయవర్గాలు కట్టుబడి వుండాల్సి వుంటుందని తెలిపారు

"తీర్పు"

'సమాజానికి ఉరిశిక్షవిధిస్తున్నాను'- అని న్యాయమూర్తి యిచ్చిన తీర్పును అమలుపర్చే విధానంలో సమాజం నిర్వహించవలసిన పాత్ర ఏమిటి ?

తనలో కలిగే మార్పులతో ఆ మరణ శిక్షనుండి రక్షణ కోరుకుంటుందా ? లేక అమలుపర్చలేని ఆ తీర్పును పరిహరిస్తూ మరింత విశృంఖలంగా ప్రవర్తిస్తుందా ?

దానికి సమాధానం కోరుతూ విశ్వేశ్వరరావు చేసిన ప్రయోగమే

'తీర్పు'

Goteti

విశాలాంధ్ర

1975 అక్టోబరు 30 గురువారం

ఏడురోజుల పనివారం

న్యూఢిల్లీలో యిటీవల ప్రయివేటురంగ వ్యవహారాల జాతీయ అపెక్స్ సంస్థ సమావేశంలో టాటాలాంటి యజమానులు ఐ.యన్.టి.యు.సి: హెచ్.యం.యస్. ప్రతినిధులు ఏడు రోజుల పనివారం ప్రతిపాదనను అంగీకరించారు. ఎ.ఐ.టి.యు.సి. మాత్రం యీ ప్రతిపాదనను వ్యతిరేకించింది. తీవ్ర అభ్యంతరాలు తెలిపింది.

ఈ ప్రతిపాదన కొత్తదేమీ కాదు. 1973 సంవత్సరంలో ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ యీ పథకానికి ప్రారంభోత్సవం చేశారు. ఎ ఐ.టి యు.సి: సి.ఐ.టి.యు లాల్ నిషాన్ గ్రూపు ట్రేడ్ యూనియన్లు యీ చర్యపై నిరసన తెలియచేస్తూ బొంబాయిలో సమ్మె జరిపాయి. జౌళిమిల్లుల్లోని అత్యధిక సంఖ్యాక కార్మికులు యీ పోరాటంలో పాల్గొన్నారు.

"ఈ పథకం విషయంలో ఆశించినట్లుగా పురోగతి సాధించబడలేదు. బొంబాయిలోని 65 జౌళి మిల్లుల్లో 15 మాత్రమే వాస్తవంగా దీనిని అమలుపరిచాయి. అని యీ ఏడురోజుల పనివారం పథకాన్ని నెత్తినవేసుక పూరేగుతున్న పెట్టుబడిదారుడు, పారిశ్రామికవేత్త నావల్ టాటా జాతీయ అపెక్స్ సంస్థ సమావేశానికి అందచేసిన నివేదికలో తెలియ జేశారు. దీనినిబట్టి యీ ప్రతిపాదన సామంజస్యాన్ని కార్మికుల నిరసనను అర్థం చేసుకోవచ్చు.

ఈ ఏడు రోజుల పనివారం మూలాన, దీర్ఘకాలంగా పోరాడిసాధించుకున్న వారాంతపు శెలవు-అంటే అందరికీ ఆదివారం-వుండదు. కార్మికులు తమ కుటుంబ సభ్యులతో పాటు కలిసిమెలసి వుండే అవకాశం మృగ్యమౌతుంది. కాగా తమ కష్టసుఖాలను తెలుసుకొని తమకు సంభవించే ఆటూ పోటులను ఎదుర్కొనడానికి, సమిష్టిగా నిర్ణయాలు తీసుకొని ఒకచోట సమీకృతం అయ్యే అవకాశం కలగదు.

మరొక్క విషయం. ప్రస్తుత అత్యవసర పరిస్థితిలో, ఉత్పత్తి అధికం చేయాల్సిన బాధ్యత వుందనీ అందువల్ల యీ పథకాన్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం వుందని చెప్పే "విజ్ఞులు" ఫ్యాక్టరీలు పూర్తిగా తమ ఉత్పత్తి శక్తి వినియోగించేటట్లు చేయలేరా? సాధ్యమైన చోట్ల మూడు షిఫ్టులను ప్రవేశపెట్టి అటు ఉత్పత్తి పెంపుదలకు యిటు ఉద్యోగ అవకాశాల పెంపుదలకు కృషి చేయలేరా? ఇది సాధ్యమైతే యీ పథకం అవసరం లేదుకదా! నిల్వల మూలంగా లాకౌట్లు, లే ఆఫ్‌లు నిత్యం జరుగుతున్న యీ రోజుల్లో వాటిని నివారించాల్సిందిబదులు అధికోత్పత్తి పేరుతో యీ అరకొరచర్యలవల్ల ఫలితంఎలావుంటుంది.

ఉత్పత్తి పెరిగినా పారిశ్రామిక యజమానులు తమ అధిక లాభాలను వదులుకోడానికి సిద్ధం గావటంలేదు. ప్రజలకు అందుబాటైన విధంగా ధరలు తగ్గించడం లేదన్న విషయం విదితమే.

వినిమయ వస్తువుల ఉత్పత్తి, పంపిణీలపై గుత్తపెట్టుబడిదారుల పట్టువున్నప్పుడు ధరలు తగ్గవు సామాన్యమానవునికి అందుబాటులో వుండవు.

ఏడురోజుల పని జరుగుతున్నప్పుడు పైగా ఫ్యాక్టరీలలో యంత్రాల రిపేర్లకు అవకాశం యివ్వాలిగదా! 24 గంటలు అవి తిరుగుతుంటే దానివల్ల కలిగే అవాంఛనీయ ఘటనలకు గురికావల్సింది కార్మికవర్గమే కదా!

ఆయా ఫ్యాక్టరీలకు, మిల్లులకు ముడివస్తువుల కొరత అయినప్పుడు, లేదా విద్యుత్ కోతలాంటి అవాంతరాలు సంభవించినపుడు పరిస్థితి ఏమిటి?

కాబట్టి ఫ్యాక్టరీల, మిల్లులపూర్తిఉత్పత్తి శక్తినివినియోగంలోనికి తెచ్చి, అధికాధికంగా భద్రతతో గూడిన ఉపాధికల్పించి ప్రజల నిత్యజీవితావసరవస్తువుల ఉత్పత్తిని, పంపిణీని ప్రైవేటు యాజమాన్యంనుండి విడదీసి ప్రభుత్వరంగంలోనికి తెచ్చి, ఇంకా కార్మికుల పనిభారాన్ని తగ్గించాల్సివుండగా పాతబడిన యీ కొత్త ప్రయోగాలవల్ల ఫలితం శూన్యం. దీనిని కార్మికవర్గం సహించదు.

మార్కాపురంలో బాలికల జూనియర్ కళాశాల: ఆర్థికమంత్రి హామీ

మార్కాపురం అక్టోబరు 27

అంతర్జాతీయ మహిళా సంవత్సరంలో మార్కాపురంలో బాలికల జూనియర్ కాలేజీని ప్రారంభిస్తామని అందుకవసరమైన డిపాజిట్ చెల్లిస్తే వెంటనే కాలేజీ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిస్తుందని ఆర్థిక మంత్రి శ్రీ రంగారెడ్డి ఇటీవల ఇక్కడ హామీ ఇచ్చారు

ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించడానికి ధనికులు ముందుకురావాలని కోరారు

సూపర్‌బజారుకు ప్రారంభం

అంతకుముందు మంత్రి శ్రీ రంగారెడ్డి విజయ కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్సు లిమిటెడ్ సూపర్‌బజారుకు ప్రారంభోత్సవం జరిపారు

హైస్కూలులో సభ

ఇటీవల మార్కాపురం జిల్లా పరిషత్ హైస్కూలులో జరిగిన సభకు శాసనసభ్యులు శ్రీ కందుల ఓబులరెడ్డి అధ్యక్షత వహించారు

ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు మాట్లాడుతూ 20 అంశాల కార్యక్రమం అమలు ఆవశ్యకతను వివరించారు

రాష్ట్ర అవతరణోత్సవం సందర్భంగా నవంబరు 1 నుంచి 9 వరకు జరిగే అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులంతా చురుకుగా పాల్గొనాలన్నారు

మార్కాపురం పౌరులు అందచేసిన వినతి పత్రానికి సమాధానమిస్తూ పట్టణంలోని ఆసుపత్రిలో పడకలసంఖ్యను పెంచుతామని హామీ యిచ్చారు (వి వి)

అధికార్లకు నగదు బహుమతులు

గుంటూరు, అక్టోబరు 28

ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ ప్రకటించిన ఆర్థికకార్యక్రమానికి సమాజంలోని వివిధవర్గాల ప్రజల సహకారాన్ని సమీకరించే అధికారులకు నగదు బహుమతులు అందచేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి శ్రీ చనుమోలు వెంకటరావు ఇక్కడ తెలియచేశారు.

పంచాయతీరాజ్ రజతోత్సవాల సందర్భంగా జిల్లాలోని బలహీన వర్గాలకు చెందిన కళాశాల విద్యార్థులకు షెడ్యూలు బ్యాంకుల నుండి రుణాలు లభిస్తాయని గుంటూరు జిల్లా కలెక్టర్ శ్రీ కె.యస్. శర్మ తెలిపారు.

భారత-జి.డి.ఆర్. మైత్రి-నేటి ఆవశ్యకత

శ్రీ జి. కాట్రగడ్డ,

ప్రధాన కార్యదర్శి, అఖిల భారత ఇండో జి డి ఆర్ మిత్రమండలి

ఈ నెల 7వ తేదీన ప్రపంచమంతటా ప్రగతిశీల శక్తులు, శాంతి కాముకులు సంతోషంతో జి డి ఆర్. 26 వ జన్మదినోత్సవం జరిపారు. ఆ దేశ ప్రజలకు ప్రభుత్వానికి తమ శుభాకాంక్షలను, సౌహార్ద్రతను తెలిపారు మన దేశంలో చాలా చోట్ల ఆ సందర్భాన్ని పురస్కరించుకొని (భారత జి. డి ఆర్ మిత్ర మండలి) జాతీయసమితి ప్రకటన ననుసరించి భారత జి. డి ఆర్ మైత్రి వారం (2 నుంచి 8 వరకు) జరిగింది

నేటి ప్రపంచంలో జి డి ఆర్. స్థానం ఏమిటి? మనకూ వారికీ గల సంబంధాల స్వభావ స్వరూపాలు ఎటువంటివి? ఇలాంటి ప్రశ్నలు సహజమే

ఆకర్షవంతమైన ప్రగతి

జి డి ఆర్. చాల చిన్న దేశం జనాభా కోటిడెబ్భై లక్షలమాత్రమే మనరాష్ట్రంలో 3 వ వంతు అన్నమాట!

అయినా యీనాడు ప్రపంచ స్థాయిలో అత్యధిక పారిశ్రామిక ప్రగతిని సాధించిన మొదటి పది దేశాలలో ఒకటిగా పరిగణింపబడుతున్నది తలసరి పారిశ్రామికోత్పత్తిలో ప్రపంచపు సగటుకు 4 రెట్లు జి డి ఆర్. పౌరుడు సాధించాడు ప్రపంచంలోదాదాపు 3 వ వంతు లిగ్నైట్ యీ దేశంలో ఉత్పత్తి ఔతున్నది. పొటాష్ ఎరువుల ఉత్పత్తిలో ప్రపంచంలో 3 వ స్థానాన్ని సంపాదించుకున్నది జి. డి. ఆర్.

వ్యవసాయరంగంలోకూడా యీ దేశానిది ముందంజే! తలసరి సగటు ఉత్పత్తిని పరిశీలించినచో ప్రపంచం మొత్తం సగటు కన్నా ఎంతో ఎక్కువ ఉదాహరణకు...

	ప్రపంచం	జి డి ఆర్
వెన్న	1 6 కె. జి	14 6 కె జి
పాలు	64 0 ,,	441 0 ,,
మాంసం	29 0 ,,	83 2 ,,

ధాన్యం పంట దిగుబడికూడా ప్రపంచపు సగటుకు దాదాపు సగానికి సగం ఎక్కువే. గోధుమ దిగుబడి ముప్పాతిక ఎక్కువ.

పెరిగిన సంపద ఫలితాలు ప్రజలందరికీ

గత 4/5 సంవత్సరాలలో (జనవరి 1971 నుండి ఆగస్టు 75 వరకు) 6300 కోట్ల రూపాయలు వినియోగంతో నూతన వసతి సౌకర్యాలు లభించాయి అంటే జనాభాలో పదవవంతుకు అదనపు ఆధునిక వసతి సౌకర్యాలు అందాయన్నమాట) (రానున్న 15 సంవత్సరాలలో అంటే, 1990 నాటికి జనాభా అంతటికీ అట్టి అదనపు సౌకర్యాలు లభించగలవని అంచనా). ఈ సౌకర్యాలను ఏర్పరచటానికి ప్రభుత్వానికి ఖర్చయింది సగటున చదరపు మీటరుకు నెలకు 3 మార్కులు, ప్రజలనుంచి వారు అద్దెగా తీసికునేది, పరిసరాలనుబట్టి 0.80 నుంచి 1.25 మార్కులు మాత్రమే.

నిరుద్యోగమనేది అసలేకూడా లేదు. అంతే కాదు నిత్యావసర వస్తువుల ధరలు స్థిరంగా నిలచిపోయాయి అదే మాదిరిగా పట్టణాలలో, పల్లెల్లో రవాణా రాకపోకల) సౌకర్యాల కయ్యే ఖర్చులుకూడా (బస్సు, ట్రాం, ఎలెక్ట్రిక్ (మెయిన్ మొ॥ చార్జీలు). గత నాలుగేళ్ళలో వీటికోసం, ప్రజల ఖర్చులు ఎక్కువ లేకుండా ఉండడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్సిడీలు 15000 కోట్ల రూపాయలు వీటన్నిటి కారణంగా తలసరి నగదు ఆదాయం ఏటా 5% పెరుగుతూ వచ్చింది

యూరప్ చరిత్రకే మలుపు

1949 అక్టోబరులో, అంతకు ఒక నెల క్రితం అమెరికా, ఆంగ్ల ఫ్రాన్సు సామ్రాజ్యవాదాల సమిష్టి కుట్రల ఫలితంగా, యూరపు ప్రజలకు మరోమారు యుద్ధ ప్రమాదం జర్మన్ గడ్డపై రాకుండా ఫాసిస్టు వ్యతిరేక, ప్రజాస్వామ్య పునాదులపై జర్మన్ భూభాగంపై మౌలికమైన మార్పులను తీసికొని రావాలని పోట్స్‌డాం నిర్ణయాలను తిరస్కరిస్తూ, పశ్చిమ జర్మనీ ప్రభుత్వం ఏర్పడినపుడు, యీ సవాలును ఎదిరించి జర్మన్ ప్రజలను అదే విధంగా యూరపు ప్రజలను రక్షించే మహత్కృషిలో అంతర్భాగంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య, శాంతిశక్తులు జర్మనీ తూర్పు భాగంలో జి డి. ఆర్ ఏర్పాటు చేశారు

ఆనాడు జి డి. ఆర్. కున్న సహజ వనరులు చాల తక్కువ. పారిశ్రామికంగా చాలా వెనుకబడిన స్థితి యిది కొత్తగా ఏర్పడిన యీ సోషలిస్టు దేశాన్ని అంకురంలోనే అణచివేయాలని సామ్రాజ్యవాదులు ఆర్థిక, రాజకీయ దిగ్బంధనం చేశారు. దాదాపు 12 సంవత్సరాలపాటు ఓపెన్‌గా ఉన్న సరిహద్దులను దుర్వినియోగం చేసి జి డి ఆర్. ఆర్థిక వ్యవస్థను సెబొటేజ్‌ద్వారా ఛిన్నాభిన్నం చేయాలని ఎంతో ఎన్ని విధాలుగానో ప్రయత్నించారు.

కాని కార్మిక-కర్షక సహకారం, సౌహార్ద్రత అనే పునాదిపై దేశంలోని ముఖ్య ప్రజాస్వామ్య, ఫాసిస్టు వ్యతిరేక శక్తులతో కలసి జాతీయ ఐక్యసంఘటన ప్రాతిపదికగా, సోవియట్ యూనియన్ నాయకత్వాన ఏర్పడిన సోషలిస్టుశిబిరంలో ముఖ్యభాగంగా జి డి ఆర్ పౌరులు అనుక్షణం అన్నివిధాలా శత్రుశక్తులతో పోరాటం జరిపి వారి ఆటలను కట్టించారు.

సామ్రాజ్యవాదుల, వారి తాబేదార్ల కుట్రలన్నీ భగ్నమయ్యాయి. వారు తలపెట్టిన బ్లాకేడ్ బద్దలయ్యింది దాదాపు 120 దేశాలు జి డి. ఆర్. తో దౌత్య సంబంధాలు ఏర్పరచుకున్నాయి సంయుక్త రాజ్యసమితిలోను, ఇతర అంతర్జాతీయ సంస్థలలోను సమానహోదాతో జి.డి.ఆర్.కు ప్రవేశం లభించింది

ప్రపంచ శాంతిని సుస్థిరం చేయడం, యుద్ధాన్ని నివారించడం, యిది తన లక్ష్యాలలో ముఖ్యమని జి. డి ఆర్ నిరంతరం మాటలలోనేగాక, చేతల ద్వారా నిరూపించింది యూరప్ సమిష్టి భద్రతకై జరిగిన కృషిలో కీలకమైన పాత్రను వహించింది అమెరికా కెనడలతోపాటు 33 యూరప్ దేశాల అధినేతలు పాల్గొన్న హెల్సింకీ సమావేశంలో (30 జులై - ఆగస్టు 1, 75) యీ వాస్తవం మరింత తేటతెల్లమయింది

జి. డి ఆర్. స్థాపన యూరప్ చరిత్రకు ఒక ముఖ్యమైన మలుపు అని ఈ పరిణామాలు అన్నీ నిరూపిస్తున్నాయి

మరపురాని విషాదగాథ

తానుద్భవించి 2 సంవత్సరాలన్నా పూర్తికాకముందే 1951 ఆగస్టులో ప్రపంచ యువజనోత్సవాలను రాజధాని బెర్లిన్‌కు ఆహ్వానించింది జి డి ఆర్ నాటి నుండి నేటి వరకూ, సామ్రాజ్యవాద వ్యతిరేకత, విమోచన ఉద్యమాలకు సహకారం ఫాసిస్టు వ్యతిరేక సంగ్రామం. ప్రపంచ శాంతి సాధన యీ మహదాశయాలకు అంకితమైన అంతర్జాతీయ మహాసభలెన్నో జి డి ఆర్. ప్రజల ఆహ్వానాన్ని, ఆతిథ్యాన్ని స్వీకరించాయి వచ్చే వారం బెర్లిన్‌లో ప్రారంభమయ్యే అంతర్జాతీయ మహిళా సమావేశాలు (20 నుంచి 24 అక్టోబర్ వరకు) యీ దేశంలో వచ్చిన, తిరుగులేని తీవ్రమైన మార్పులకు ప్రత్యక్ష నిదర్శనం,

ఫాసిజం జర్మనీలో స్వైరవిహారం చేసిన రోజుల్లో, వారి దుష్కర కృత్యాలకు బలియైనవారిలో స్త్రీలు ముఖ్యభాగమని ఎవరు మరచిపోగలరు? ఫాసిస్టు యుద్ధ యంత్రాంగాన్ని పరిపుష్టంగా నిర్మించడానికిగాను హెచ్చుగా పిల్లలను కనటము వారిని ఇతర జాతులపై కత్తి దూసేవారిగా పెంచడం, వంటయింటి కుందేళ్ళయి తమ భర్తలకు సర్వపరిచర్యలు చేస్తూ యుద్ధరంగానికి ఆయత్తంజేయడం ప్రజాస్వామ్య శక్తులకు చాలా దూరంగావుంటూ, దరిద్రుష్టిన మత క్రౌర్యాన్ని ప్రోత్సహించడతో చర్చిలకు అంకితంకావడం యివే తమ ధ్యేయమని మహిళలు భావించాలని నూరిపోసింది. శపించింది ఫాసిజం ఆనాడు కించిత్తయినా కాదంటే ఆ స్త్రీలను జైళ్ళకు పదుపరి కాన్సెంట్రేషన్ కేంద్రాలకుకూడా పంపి చిత్రహింసలకు, అమానుష ఘాతుకాలకు గురిచేయడం యిది వారికి ఫాసిజం మిచ్చిన ప్రత్యేకకానుక. అంతేకాదు స్త్రీలకై ప్రత్యేక కాన్సెంట్రేషన్ కాంప్‌ను బెర్లిన్‌కుఅనతి దూరంలోవున్న రేవెన్స్‌బ్రుకులో కాల్పులుచేసి అక్కడ 92 వేలమందిని దారుణ హత్యాకాండకు గురిచేసింది ఫాసిజం

నేడు, అదే గడ్డపై, ఫాసిజానికి గోరీ కట్టిన స్త్రీలు పురుషులు సమానహోదాలో సమానంగా కృషి చేసి నిర్మించిన సోషలిస్టు జి డి ఆర్. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే వీరవనితలకు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలలో కాకలు తీరిన మహిళలకు ఎంతో ఉత్సాహంతో స్వాగతమిస్తున్నది.

ప్రపంచ విప్లవ శక్తులలో జి డి ఆర్ కు గల ముఖ్యస్థానానికిది ప్రత్యక్ష నిదర్శనం

మానవులను దానవులుగా మార్చేసింది మారణ హోమాన్ని జరిపింది ఫాసిజం ఆ దానవుల సంతానాన్ని సంస్కరించి మానవతా వాదానికి పునర్జన్మ కల్పించింది జి డి ఆర్. ఇది యూరప్ చరిత్ర గమనాన్ని నిర్దేశించే ముఖ్యమైన మార్పులలో ఒకటిగా ప్రపంచ ప్రజలు వర్ణిస్తున్నారు. జి. డి. ఆర్ ను ఎంతో శ్లాఘిస్తున్నారు మానవ నైజాన్ని మార్చగలం' ఆర్థిక వ్యవస్థలు మౌలికమైన మార్పులద్వారా అని జి డి ఆర్. నిస్సందేహంగా నిరూపించింది.

ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న పెట్టుబడిదారీ వ్యవస్థ

సోషలిస్టు జి డి. ఆర్. కు, పొరుగున వున్న పశ్చిమ జర్మనీని ఒకసారి పరిశీలిద్దాము నిత్య కళ్యాణం పచ్చతోరణం యీ పశ్చిమ జర్మనీలోని భద్రతా పొగడ్తలతో పెట్టుబడిదారీ పత్రికలు, రేడియోలు, టెలివిజనలు, నిండిపోయాయి. ఒకప్పుడు పాపం, నేడు వారికి పచ్చి వెలగకాయలు గొంతుకలో పడ్డాయి కక్కలేరు, మింగలేరు పదిహేను లక్షల మందికి నిరుద్యోగం, మరో 6 లక్షల మందికి కొన్ని గంటలు మాత్రమే పని బ్యాంకులు దివాళా తీస్తున్నాయి. దాదాపు ప్రతి పరిశ్రమలోను ఉత్పత్తిని తగ్గించాల్సి వస్తున్నది. ధరలు అద్దెలు, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు ఒకటితో మరొకటి పోటీపడి ఆకాశాన్నందుకుంటున్నాయి ఉన్న ఉద్యోగం ఎప్పుడు ఊడిపోతు దోనని అనుక్షణంతల్లడిల్లిపోతున్నారు. శ్రామికులు, చిన్న పరిశ్రమలు, మధ్య తరగతి పరిశ్రమలు గుత్త సంస్థల పోటీకి తట్టుకోలేక దివాళాతీస్తున్నాయి, ఇలాంటి దివాళాలు ఏటా పదివేలను మించుతున్నాయని ప్రభుత్వంవారే అంచనావేస్తున్నారు. ఇదీ నేటి పశ్చిమజర్మనీ నేటి కేపిటలిస్టు జర్మనీ

సోషలిస్టు జర్మనీ (జి డి.ఆర్.)- దీనికి ఎంత తేడా!

ఈ తేడాను తమ నిత్యజీవితంలో అనుభవిస్తున్న పశ్చిమ జర్మన్ శ్రమజీవుల మనస్తత్వాలలో ఎంతటి తీవ్రమైన పరిణామాలు రాగలవోనని పెట్టుబడిదారీవ్యవస్థ అధి

(మిగతా 3 వ పేజీలో)

మధిర సమితిలో ఉత్తమ పంచాయతీలకు బహుమతులు

ఖమ్మం, అక్టోబరు 26

ఖమ్మంజిల్లా మధిర సమితిలో రెబ్బవరం గ్రామ పంచాయతీ ఉత్తమ పంచాయతీగా ఎన్నిక చేయబడి, బహుమతిక్రింద రు 500 యివ్వబడింది.

తనికెళ్ళ, రాజేశ్వరపురం, మీనవోలు వాగుపల్లి దుమ్ముగూడెం వెంకటాపురం, గౌరివేపేట, రాజుపేటలకు రు. 100 బహుమతి లభించింది

నర్సింగ్ హోం

స్వయంఉపాధిపథకం క్రింద పట్టణంలో డాక్టర్ (శ్రీమతి) ఆంధ్రజ్యోతిచే నిర్వహించబడే "రవిచంద్ర నర్సింగ్‌హోం" కు ఈ నెల 14 వ తేదీన కాకతీయ మెడికల్ కాలేజి ప్రొఫెసర్ డాక్టర్ (శ్రీమతి) పద్మ ప్రారంభోత్సవం జరిపారు.

ఈ నర్సింగ్ హోంకు పరిశ్రమల శాఖ ఆధ్వర్యాన ఆంధ్రా బ్యాంకు రు. 26 వేల ఆర్థిక సహాయాన్ని యిస్తుంది

ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంటు డా॥ యం ఖానోద్దీన్, శ్రీ జలగం కొండలరావు శ్రీ సామినేని ఉపేంద్రయ్య, పరిశ్రమలశాఖ అసిస్టెంటు డైరెక్టర్ శ్రీ బాలరాజ్, జిల్లా కేంద్ర గ్రంథాలయ అధ్యక్షులు శ్రీ ఖాదర్ అలీ డా॥ జయచంద్రారెడ్డి ఆసుపత్రి అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రసంగించారు

డా॥ వై వి రామారావు అతిథులకు ఆహ్వానం చెప్పారు శ్రీమతి ఆంధ్రజ్యోతి కృతజ్ఞతలు తెల్పారు (వి. వి)

శ్రీ రాజగోపాల్‌కు సన్మానం

విజయవాడ, అక్టోబరు 27

జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా నియమితులైన శ్రీ యం. ఎ. రాజగోపాల్‌ను నేడిక్కడ సన్మానించారు.

రోడ్లు, భవనాల శాఖమంత్రి శ్రీ చనుమోలు వెంకట్రావు సభకు అధ్యక్షత వహించారు. మాజీమంత్రి శ్రీ అనగాని భగవంతరావు వేదిక నలంకరించారు.

ఆంధ్రప్రదేశ్ పట్లగల ఆప్యాయతతో తాను ఐ ఏ ఎస్ సర్వీసెసను ఎన్నుకొనే సమయంలో యీ రాష్ట్రాన్ని ఎన్నుకొన్నానని శ్రీ రాజగోపాల్ తమకు జరిగిన సన్మానానికి జవాబుగా చెప్పారు.

డాక్టర్ షరీఫ్, శ్రీ నూకల పూర్ణచంద్రరావు ప్రసంగించారు శ్రీ షరీఫ్ అహ్మద్ స్వాగతం చెప్పారు.

ఆంధ్ర నేషనల్ ముస్లిమ్ ఫోరం, ఇంటర్నేషనల్ కల్చరల్ అసోసియేషన్ భారత్, అరబ్ స్నేహ సంఘాలు యీసభను ఏర్పాటు చేశాయి (వి వి.)

పమిడిపాడు పంచాయతీ తీర్మానం

పమిడిపాడు అక్టోబరు 2౦

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన 20 అంశాల ఆర్థిక కార్యక్రమాన్ని అమలు జరుపుటకు పమిడిపాడు పంచాయతీ హృదయపూర్వకంగా ఆమోదిస్తూ యిటీవల తీర్మానించటమైనది

సంక్షిప్త వార్తలు

సబ్ రిజిస్ట్రార్, సెక్షన్‌రైటర్ అరెస్ట్

హైదరాబాద్, అక్టోబరు 28

నూరు రూపాయలు లంచం తీసుకున్నందుకు ఒక సబ్ రిజిస్ట్రారును, తాత్కాలిక సెక్షన్ రైటర్‌ను హైదరాబాద్‌నగర అవినీతి నిరోధకశాఖ అధికారులు 25 వ తేదీన అరెస్టు చేశారు.

ఈ వంద రూపాయలుగాక వారినుండి రు. 1077 రొక్కాన్ని వారు స్వాధీనం చేసుకున్నారు వారిద్దరినీ బెయిలుపై విడుదల చేశారు విచారణ కొనసాగుతున్నది

డిప్యూటీకమిషనర్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ అరెస్టు

విశాఖపట్టణంలోని ఒక సినిమాహాలుకు విధించిన పన్నును తగ్గించేందుకు రు. 2 వేలు లంచం తీసుకున్న డిప్యూటీ కమిషనర్ (రివిజన్) రు 1000 లంచం తీసుకున్న రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ (మున్సిపల్)ను అవినీతి నిరోధక శాఖాధికారులు ఈ నెల 25 న అరెస్టు చేశారు

ఈ మొత్తాలుకాక డిప్యూటీ కమిషనర్ ఇంటినుండి రు 7648 లను, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ ఇంటినుండి రు. 3190 లను స్వాధీనం చేసుకున్నారు

వీరిని బెయిలుపై విడుదల చేశారు దర్యాప్తు కొనసాగుతోంది.

సమాచార కేంద్రం

హైదరాబాదులోని సమాచార కేంద్రాన్ని గత సెప్టెంబరులో 3415 మంది సందర్శించారు

డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్, మహాకవి గురజాడ అప్పారావు జన్మదినోత్సవాలను ఈ కేంద్రం నిర్వహించింది.

ఉపసంఘం ఏర్పాటు

కాందిశీకుల పునరావాసం కొరకు అనువైన పరిశ్రమలను ప్రారంభించేందుకు గల అవకాశాలను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక ఉప సంఘాన్ని నియమించింది.

పునరావాసశాఖ కమిషనర్ అధ్యక్షతన ఏర్పడిన ఈ ఉపసంఘంలో శ్రీయుతులు యస్. ఆర్. ఎ. యస్ అప్పలనాయుడు (యం పి), శాసనసభ్యులు యం. ఆర్. డిన్, వి రంగబాబు కె నరసయ్య, ఆర్. విజయరత్నం సభ్యులు

మునిసిపల్ కార్పొరేషన్ సాంస్కృతిక కార్యక్రమం

హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన కుటుంబనియంత్రణ విభాగం అక్టోబరు 28 న నిజాం కాలేజి గ్రౌండ్సులో నిర్వహించతలపెట్టిన శ్రీ పిఠాపురం నాగేశ్వరరావు బృందం సాంస్కృతిక కార్యక్రమం నవంబరు ఒకటవ తేదీకి వాయిదా పడింది. ఆసక్తిగలవారు ఆ విభాగం కార్యాలయం నుండి ఉచిత పాస్‌లు పొందవచ్చు.

జహీరాబాద్‌లో సూపర్ బజార్

మెదక్ జిల్లా జహీరాబాద్‌లో సహకార ప్రాతిపదికపై సూపర్ బజార్ ప్రారంభం కానుంది అక్టోబరు 24 న సంగారెడ్డిలో డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీ యస్ వీరరాజు ఈ సంఘాన్ని రిజిస్టరు చేసుకొన్నారు

రాష్ట్ర ప్రభుత్వం కొంత వాటాధనాన్ని యివ్వనున్నది.

బాలానంద సంఘం కార్యక్రమం

ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా బాలానంద సంఘం హైదరాబాదులో అనేక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది.

బాల బాలికలకు నవంబరు 8 న వ్యాసరచన పోటీలు 9 న విచిత్ర వేషధారణ పోటీలు 18 న ఏకపాత్రాభినయ పోటీలు, 23 న లలిత సంగీత పోటీలు జరుగుతాయి. 16 న రవీంద్రభారతిలో సాంస్కృతిక ప్రదర్శన లుంటాయి విజేతలకు 30 వ తేదీన బహుమతులు అందిస్తారు

పెన్షన్‌దారకు విజ్ఞప్తి

ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నవంబరు ఒకటవ తేదీన రాష్ట్ర ప్రభుత్వం సెలవుగా ప్రకటించినందున ఆ తేదీన పెన్షన్లను స్వీకరించే మాజీ సైనికులు నవంబరు 4 న తీసుకోవలసిందిగా సికింద్రాబాద్‌లోని పెన్షన్ పే మాస్టర్ (రక్షణ) ఒక ప్రకటనలో కోరారు.

శాంతి మండలంగా హిందూమహాసముద్రం

మలేషియా బలపరుస్తుందని మూసాహితమ్ ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబరు 2౹

హిందూమహాసముద్రాన్ని శాంతి మండలంగా పరిగణించాలనే డిమాండును మలేషియా బలపరుస్తుందని మలేషియా ప్రాథమిక పరిశ్రమల మంత్రి సాదతుక్ మూసా హితమ్ నేడిక్కడ ప్రకటించారు.

హిందూమహాసముద్రాన్ని శాంతి మండలంగా గుర్తించవలసిందిగా భారత దేశం చేస్తున్న ఆందోళన ప్రపంచంలో శాంతి, అభివృద్ధి కార్యకలాపాలకు ఎంతో ప్రముఖమైన అంశమని మలేషియా హై కమిషన్ సముదాయానికి ప్రారంభోత్సవం చేస్తూ ఆయన చెప్పారు. తమ దేశం యీ సమస్యపై భారత దేశాన్ని బలపరుస్తుందని అన్నారు.

భారత్ - మలేషియాల మధ్య ఆర్థిక సంబంధాలు బాగా వున్నాయనీ, ఉభయ దేశాల మధ్య వాణిజ్య సంబంధాల విస్తరణకు అవకాశాలు కలవని చెప్పారు.

ఎక్కువ బరువు మోస్తున్న ఎద్దుబండ్లు

న్యూఢిల్లీ, అక్టోబరు 27

నేటికి కూడా దగ్గర దూరం రవాణాలో రైళ్ళు, బస్సులను కలిపినా వాటికంటె ఎద్దుబండ్లే ఎక్కువ సరుకులు మోస్తున్నాయని ప్రధాని శ్రీమతి గాంధీ నేడు శాస్త్రజ్ఞులకు జ్ఞప్తి చేశారు.

అందువల్ల ఎద్దుబండ్ల సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, స్థానిక పరిస్థితులకు అనుకూలమైన వసతులను, చేతివృత్తుల వారు తయారుచేయగల పద్ధతిలో రూపొందించడానికి శాస్త్రజ్ఞులు కృషి చేయాలని ఆమె కోరారు.

నెహ్రూ-భట్‌నగర్ కృషి

శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధనా మండలి ఏర్పాటు నెహ్రూ భట్‌నగర్ కృషి, ఫలితమని ప్రధాని అన్నారు

శాస్త్రరంగంలో శాంతి స్వరూప్ భట్‌నగర్ కృషి జవహర్‌లాల్‌నెహ్రూ రాజకీయ నాయకత్వం దానికి దోహదం చేసిందని ఆమె చెప్పారు.

40 ఎకరాల బంజరు ఆక్రమణ

భీమునిపట్నం తాలూకాలో

చిట్టివలస, అక్టోబరు 25

ఇటీవల విశాఖజిల్లా భీమునిపట్నం తాలూకా కృష్ణాపురం గ్రామంలో 30 మంది వ్యవసాయ కార్మికులు విజయనగరం ఎస్టేటుకు చెందిన పద్మనాభస్వామి దేవాలయమునకు చెందిన 40 ఎకరముల బంజరు ఆక్రమించుకొన్నారు ఈ బంజరుకు పట్టాలిప్పించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఆక్రమణకు తాలూకా వ్యవసాయకార్మిక సంఘ కార్యదర్శి శ్రీ వాడా గురుమూర్తి నాయకత్వం వహించారు.

విశాలాంధ్ర సర్క్యులేషన్ పెంపుదల ఉద్యమం

కొత్తగూడెంలో 57 కొత్త చందాలు

కొత్తగూడెం అక్టోబరు 29

ఖమ్మంజిల్లా కొత్తగూడెంలో విశాలాంధ్ర ఏజంటు 57 కొత్త చందాలు చేర్పించారు. 100 కాపీలు పెంచడానికి కృషి జరుగుతున్నది విశాలాంధ్ర ఏజంటు శ్రీ అళ్ళగుడు ప్రసాదరావు స్వయంగా బస్తీ బస్తీ తిరిగి చందాలు చేర్పిస్తున్నారు

బూర్గంపాడు తాలూకాలో కొత్త ఏజన్సీలు

విశాలాంధ్ర చందాలు 50 పెంపు చేయాలని బూర్గంపాడు తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గం నిర్ణయించింది.

కార్యవర్గ సమావేశం ఈ నెల 25 వ తేదీన మణుగూరు గ్రామంలో శ్రీ పాగెళ్ళ వెంకులు అధ్యక్షతన జరిగింది జిల్లాకమ్యూనిస్టు నాయకులు శ్రీ వాసిరెడ్డి వెంకట[illegible] హాజరై విశాలాంధ్ర సర్క్యులేషన్ పెంపుదల ఉద్యమ ప్రాముఖ్యతను వివరించారు, కోటాలనుమించి చందాలు చేర్పిస్తామని కార్యవర్గ సభ్యులు ఉత్సాహంతో కోటాలు తీసుకున్నారు

మణుగూరు, అశ్వాపురం మల్లెమడుగు గ్రామాల్లో కొత్తగా ఏజెన్సీలు ప్రారంభించాలని నిర్ణయించారు.

గజ్వేల్‌లో కొత్త ఏజన్సీ

మెదక్ జిల్లా గజ్వేల్ కేంద్రంలో 10 విశాలాంధ్ర కాపీలతో కొత్త ఏజన్సీ ప్రారంభమైంది.

తాలూకా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ టి బాలకృష్ణారెడ్డి నేడీవిషయం తెలియజేశారు.

బెల్లంపల్లి, మోత్కూరుల్లో కొత్త ఏజన్సీలు

ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లిలో 10 కాపీలతో నవంబరు 1 నుండి కొత్త ఏజన్సీ ప్రారంభమవుతున్నది.

నల్గొండజిల్లా మోత్కూరులో 15 కాపీలతో కొత్తగా ఏజన్సీ ప్రారంభమవుతున్నది.

ఆత్మకూరులో 20 చందాలు

కర్నూలుజిల్లా ఆత్మకూరులో 20చందాలు కొత్తగా చేర్పించారు. నవంబరు 7 నాటికి ఏజన్సీ 75 కాపీలకు పెంచాలని నిర్ణయించుకున్నారు

పార్టీ కార్యకర్తలు శ్రీ యు వి బి సుబ్బయ్య, ముర్తుజా, కమ్మరిసుబ్బారాయుడు, మేరి చినవెంకటస్వామి మేడా వెంకటస్వామి, వి సుబ్బయ్య, షాబు యూసుఫ్, వెంకటరమణ బుడాన్ తదితరులు, పట్టణ కార్మికసంఘాల కార్యకర్తలు చందాల పెంపుదల కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

గూడెంలో 23 చందాలు

పశ్చిమగోదావరిజిల్లా తాడేపల్లిగూడెంలో కొత్తగా 23 విశాలాంధ్ర చందాలను చేర్పించారు.

చీరాలలో 24 చందాల పెంపు

ప్రకాశం జిల్లా చీరాలలో విశాలాంధ్ర చందాలు 24 పెంపు చేశారు. ఐ యల్. టి డి కంపెనీలో 9 విశాలాంధ్రచందాలు, [illegible] చందాలు 7 పెంచారు.

ఆర్. టి. సి కార్మికులు విశాలాంధ్ర చందాలు 23, కొత్తబాట చందాలు 5 చేర్పించారు

చీరాల ఏరియాలో 100 విశాలాంధ్ర చందాలను అదనంగా చేర్పించేందుకు కార్యకర్తలు పట్టుదలతో కృషి చేస్తున్నారు.

కొండపల్లిలో 20 చందాలు పంపు

కొండపల్లి, అక్టోబరు 29

చిన్న కొండపల్లిలో అదనంగా 20 విశాలాంధ్ర చందాలు చేర్పించారు. ఇంతకుముందు 16 చందాలు ఉన్నాయి. మొత్తం 50 చందాలు చేర్పించడానికి కృషి సాగిస్తున్నారు. జిల్లా కమ్యూనిస్టుసమితి సహాయ కార్యదర్శి శ్రీ మోదుమూడి శ్రీహరిరావు, మైలవరం బ్లాకు కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ మల్నీడుకోటయ్య, జిల్లా యువజన సమాఖ్య కార్యదర్శి సిహెచ్ కోటేశ్వరరావు, మైలవరం బ్లాకు కమ్యూనిస్టు నాయకులు శ్రీ కంచి చంద్రారావు, కొండపల్లి యువజన సమాఖ్య అధ్యక్షులు సామెనగాలిట్‌రావులు చందాలు చేర్పింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఒంగోలులో 55 చందాలు పెంపు.

ఒంగోలు, అక్టోబరు 29

ప్రకాశంజిల్లా కేంద్రమయిన ఒంగోలు పట్టణంలో విశాలాంధ్ర చందాలు 55 పెంపు చేయబడ్డాయి.

పట్టణంలోని మేధావులు, వ్యాపారులు విశాలాంధ్ర పత్రికకు చందాలు కట్టమని అడిగిన వెంటనే చందాదారులుగా చేరారు.

ప్రకాశంజిల్లాలోని అన్ని తాలూకాలలో కమ్యూనిస్టుపార్టీ ప్రజాసంఘాల కార్యకర్తలు టీములుగా బయలుదేరి విశాలాంధ్ర చందాలను పెంపు చేసేందుకు కృషి చేస్తున్నారు,

ఒంగోలు పట్టణంలో ఈకార్యక్రమంలో శ్రీయుతులు నల్లూరి అంజయ్య, బోడపాటి లక్ష్మయ్య, నాతాని వెంకటస్వామి, కరవాది వెంకటేశ్వరు, గంగిశెట్టి కోటయ్య, నూతనగుంట వెంకయ్య, రావెళ్ళ బాలయ్య, అప్పల ఈశ్వరరెడ్డి, నల్లూరి చినవెంకటేశ్వర్లు, పొత్తూరి నారాయణ, ధనిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు. (వి. వి.)

యు. పి. ఘర్షణలలో 156 మంది బందిపోటు దొంగల మృతి

లక్నో, అక్టోబరు 28

ఈ సంవత్సరం మొదటి తొమ్మిది మాసాలలో ఉత్తరప్రదేశ్‌లో బందిపోటు దొంగల ముఠాలతో జరిగిన 888 సంఘర్షణలలో 156 మంది బందిపోటు దొంగలు మరణించారు. మరో 3627 మంది అరెస్టు చేయబడ్డారు.

సాగుదార్ల తొలగింపు కార్యక్రమం నిలుపుదల

త్వరలో ఉత్తరువు జారీ చేస్తామని శ్రీ వై. వి. కృష్ణారావుకు ముఖ్యమంత్రి హామీ

హైదరాబాద్, అక్టోబరు 8

ఖమ్మంజిల్లాలో ప్రభుత్వ 2 (ఎ) భూముల నుండి సాగుదార్లను ఖాళీచేయించటాన్ని నిలుపుచేయించేందుకు తక్షణమే ఉత్తర్వులను జారీచేయటం జరుగుతుందని ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘానికి హామీ ఇచ్చారు.

రాష్ట్ర రైతుసంఘ అధ్యక్షులు శ్రీ వై.వి. కృష్ణారావు నేడుదయం ముఖ్యమంత్రిని కలుసుకొని, ఖమ్మంజిల్లా భద్రాచలం, నాగూరు తాలూకాలలో ప్రభుత్వ 2 (ఎ) భూములను సాగు చేసుకుంటున్నవారికి ఆ భూములను ఖాళీ చేయవలసిందిగా రెవిన్యూ అధికారులు నోటీసులు జారీ చేయటాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు

గత 10, 15 సంవత్సరాలుగా నిరుపేద భూమిలేని ప్రజలు ఈ భూములను సాగు చేసుకుంటున్నారని, ప్రస్తుతం ఈ భూముల నుండి వీరిని ఖాళీ చేయించేందుకు రెవిన్యూ అధికారులు ఏకపక్షంగా ప్రయత్నిస్తున్నారని ముఖ్యమంత్రికి సమర్పించిన మెమోరాండంలో శ్రీ కృష్ణారావు తెలియజేశారు ఈ భూములలో ప్రస్తుతం సాగుదారులు పైరు వేసివున్నారని ఆ మెమోరాండంలో పేర్కొన్నారు.

ఈ భూములనుండి సాగుదారులను ఖాళీ చేయించవలసివస్తే పంటలు చేతికి వచ్చిన అనంతరం మాత్రమే జరుగుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. పంటలు చేతికివచ్చిన అనంతరంకూడా భూములు లేనివారిని, పేద రైతులను ఖాళీ చేయించటం జరగదని ఆయన తెలిపారు

ఈ హామీని అమలు జరుపవలసిందిగా కూడా ఖమ్మం డిప్యూటీ కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఆర్థిక కార్యక్రమం అమలులో సహాయం

ట్రేడ్ యూనియన్‌లకు రాష్ట్రకార్మికమంత్రి విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబరు 28

విభేదాలను విస్మరించి ప్రధాన మంత్రి ప్రకటించిన నూతన ఆర్థిక కార్యక్రమాన్ని అమలు పరచటంలో పూర్తి సహాయాన్ని అందించవలసిందిగా భావ సారూప్యత గల ప్రజాతంత్ర ట్రేడ్ యూనియన్ సంస్థలకు ఆంధ్ర ప్రదేశ్ కార్మికమంత్రి శ్రీ టి అంజయ్య విజ్ఞప్తి చేశారు.

శ్రీశైలంలో ఐ. ఎన్ టి యు సి అనుబంధ యూనియన్ అయిన శ్రీశైలం ప్రాజెక్టు వర్కర్సు యూనియన్ వార్షిక మహాసభను ప్రారంభిస్తూ ఆయన పై విజ్ఞప్తి చేశారు

కార్మికవర్గ సంక్షేమానికి పాటుపడేందుకు ప్రగతిశీలమైన నూతన ట్రేడ్ యూనియన్ నాయకత్వం ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.

వచ్చేనెలనుండి యన్. యం. ఆర్. కార్మికుల వేతనాలను వర్క్ చార్జ్‌డ్ కార్మికులతో సమానంగా ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని ఆయన చెప్పారు.

రాష్ట్ర విద్యుత్ మంత్రి ఈనెల 25 న ఏర్పాటు చేసిన సమావేశంలో పై నిర్ణయం తీసుకోబడిందని ఇందువల్ల శ్రీశైలం ప్రాజెక్టులో పనిచేసే 800 మంది యన్. యం. ఆర్. కార్మికులకు లాభం చేకూరుతుందని ఆయన చెప్పారు.

ఆగ్నేయ రైల్వే

1-11-1975 నుండి రాబోవు టైముటేబుల్‌లో

కొన్ని ముఖ్యమైన మార్పులు

కొత్త ట్రైన్‌లు

ఎక్కువ దూరం

i) టాటానగర్ - అమృత్‌సర్ ఎక్స్‌ప్రెస్ (161 అప్/162 డౌన్)
వయా బర్కాకానా, గార్వారోడ్, చోపన్, అలహాబాద్, న్యూఢిల్లీ.

వారంలో 4 రోజులు

* టాటానగర్ నుండి ఆదివారం, మంగళవారం, గురువారం, శుక్రవారం
* అమృత్‌సర్ నుండి ఆదివారం, మంగళవారం, గురువారం, శనివారం

వేళలు

161 అప్				162 డౌన్
13-20	పోక	టాటానగర్	రాక	12 25
18-05	రాక	బర్కాకానా	పోక	07-35
18 25	పోక		రాక	07.15
20-2[illegible]	రాక	న్యూఢిల్లీ	పోక	05-45
21-15	పోక		రాక	04 25
06-15	రాక	అమృత్‌సర్	రాక	18- 0

నోట్: టాటానగర్ - అమృత్‌సర్ ఎక్స్‌ప్రెస్ టాటానగర్ మరియు అమృత్‌సర్ రెండుచోట్ల నవంబరు 2 ఆదివారం ప్రారంభోత్సవం జరుగుతుంది

ii) పూరి - రేణిగుంట ఎక్స్‌ప్రెస్ (79 అప్ / 80 డౌన్)

ప్రతిరోజు వేళలు

79 అప్				80 డౌన్
08-55	పోక	పూరి	రాక	20-[illegible]0
20-20	రాక	వాల్తేరు	పోక	08-[illegible]0
20-45	పోక		పోక	08.45
17-4[illegible]	రాక	రేణిగుంట	పోక	1 -00

iii) ఛత్తీస్‌ఘర్ ఎక్స్‌ప్రెస్ (51 అప్ / 52 డౌన్
రాయపూర్ - ఢిల్లీ నిజాముద్దీన్‌లమధ్య నేరుగాసంబంధం వయా నాగపూర్, భోపాల్.

ప్రతిరోజు వేళలు

51 అప్				52 డౌన్
1[illegible]-1[illegible]	పోక	రాయపూర్	రాక	11-30
21-40	రాక	నాగపూర్	పోక	[illegible]
22-10	పోక		రాక	04-45
09-00	రాక	భోపాల్	పోక	18-15
[illegible]9-30	పోక		రాక	17-4[illegible]
19-30	రాక	ఝాన్సీ	పోక	07-30

లోకల్

iv) హౌరా - మెచెడ (యం 11 అప్ / యం 30 డౌన్

వేళలు

యం 11 అప్				యం 30 డౌన్
0[illegible]-00	పోక	హౌరా	రాక	1[illegible]-[illegible]0
10-30	రాక	మెచెడ	పోక	11-55

బి. పొడిగించబడిన ట్రైన్స్

i) టాటానగర్ - మద్రాసు ఎక్స్‌ప్రెస్ (89 అప్ / 90 డౌను) బొకారో స్టీల్‌సిటీవరకూ

వేళలు

90 డౌను				89 అప్
0[illegible]-15	రాక	టాటానగర్	పోక	22-20
[illegible]6-05	పోక		రాక	2[illegible]- 0
08-25	రాక	మురి	పోక	18-35
08-45	పోక		రాక	18-15
10-15	రాక	బొకారో స్టీల్‌సిటీ	పోక	16-35

ii) ధన్‌బాద్ - చంద్రపుర లైట్ ట్రైన్ (1DCB/2DCB) బొకారో స్టీల్‌సిటీవరకూ

వేళలు

1 DCB				2 DCB
05-[illegible]0	పోక	ధన్‌బాద్	రాక	11-30
08-05	రాక	బొకారో స్టీల్‌సిటీ	పోక	08-30

iii) దుర్గ్ - రాయపూర్ - టిట్లా లోకల్ (5DRT/4 DRT) భటపర వరకు

వేళలు

5 DRB				4 DRB
17-2[illegible]	పోక	భటపర	రాక	16-25
21-40	రాక	దుర్గ్	పోక	11-40

సి) వేగం పెంచిన ట్రైన్‌లు.

చాలా ట్రైన్‌లు వేగం పెంచబడ్డాయి. వాటిలో ఈ క్రింది కొన్ని తెలియజేయబడినాయి.

1) బొంబాయి - హౌరా మెయిల్ (1 డౌన్)
ప్రస్తుతం హౌరాకు చేరుతున్న టైము 8-20 గంటలకుబదులు 8-05 గంటలకే చేరుతుంది.

(ii) ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ (77 అప్/78 డౌన్) వీటి టైములు క్రింద ఇయబడినవి

మార్చబడిన టైములు			ఇపుడున్న టైములు		
16-30	పోక	పూరి	16 30	పోక	పూరి
15-00	రాక	న్యూఢిల్లీ (నిజాముద్దీన్)	19 45	రాక	న్యూఢిల్లీ
10-00	పోక	న్యూఢిల్లీ (నిజాముద్దీన్)	05-45	పోక	న్యూఢిల్లీ
11-10	రాక	పూరి	10.30	రాక	పూరి

డి కొత్త కనెక్షన్‌లు

గోదావరి ఎక్స్‌ప్రెస్ (8 డౌన్) వాల్తేరులో వాల్తేరు - పలాసప్యాసింజరు (326 డౌన్ తో కలుపుతుంది.

(ఇ) కొత్త స్లీపర్ కోచ్‌లు

(i) పలాస హైదరాబాదుల మధ్య ఒక పార్శియల్ 3 టైర్ సెకండ్‌క్లాస్ స్లీపర్‌కోచి 325 అప్ 326 డౌన్, వాల్తేరు - పలాస ప్యాసింజరు మరియు 7 అప్/8 డౌన్ గోదావరి ఎక్స్‌ప్రెస్‌లతో నడుపబడుతుంది.

(ii) [illegible] నిజాముద్దీన్‌లమధ్య ఒక ఎయిర్‌క్లాస్ మరియు సెకండ్‌క్లాస్ కంపోజిట్‌కోచి [illegible] అప్/356 డౌన్ గోండి-జర్సుగుడ ప్యాసింజరు మరియు 77 అప్/78 డౌన్ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్స్‌తో నడుపబడుతుంది

(iii) [illegible]-నిజాముద్దీన్‌ల మధ్య ఒక సెకండ్‌క్లాస్ 3 టైర్ మరియు సెకండ్‌క్లాస్ కోచీలు 77 అప్/78 డౌన్ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్స్‌తో నడుపబడతాయి

(యఫ్ సర్వీసు రూటులో మార్పు

(1) కటక్-కేంద్రపారారోడ్ మధ్య మహానది బ్రిడ్జిపై రీగర్డరింగ్ పని చేస్తున్నందువల్ల 317 అప్/318 డౌన్ హౌరా పూరీప్యాసింజరు ట్రైన్స్ వయా కపిలాసరోడ్, తాల్చెర్ - నారజ్‌ల మీదుగా నడుపబడుతుంది అలాగే 463 అప్/464 డౌన్ భద్రక్-ఖుర్దారోడ్ ప్యాసింజరు ట్రైన్స్ (వయా నారజ్) భద్రక్-నెరుగుండి మధ్య 435-అప్/436 డౌన్ వాల్తేరు-పూరి ప్యాసింజర్ ట్రైన్స్‌తో నెరుగుండివద్ద తగిన కనెక్షన్స్‌తో నడుపబడుతుంది

వేళలు

317 అప్				318 డౌన్
2 -[illegible]0	పోక	హౌరా	రాక	[illegible] -55
13-24	పోక	కపిలాస్‌రోడ్	పోక	14 32
13- 8	పోక	[illegible]	పోక	14- 8
15-15	పోక	నారజ్	పోక	12-55
15-[illegible]0	పోక	బరంగ్	పోక	[illegible]2 30
19-10	రాక	పూరి	పోక	09-[illegible]5
163 అప్				464 డౌన్
04- 5	పోక	భద్రక్	రాక	23-08
07-10	రాక	నెరుగుండి	పోక	19 0
435 అప్				436 డౌన్
07-21	పోక	నెరుగుండి	రాక	19-0[illegible]

(ii) పూరి-వాల్తేరు ఎక్స్‌ప్రెస్ (5 అప్/6 డౌన్) పాస్ట్ ప్యాసింజరుగా నడుస్తుంది

(iii) 1974 అక్టోబరు టైము టేబుల్ ప్రకారం చక్రధర్‌పూర్-నాగపూర్ ప్యాసింజరు (337 అప్/338 డౌన్) చక్రధర్‌పూర్-నాగపూర్‌ల మధ్య మరియు గోండి-జార్సగుడ ప్యాసింజరు ([illegible]5 అప్/[illegible]06 డౌన్) గోండి-జార్సగుడల మధ్య పునరుద్ధరించబడుతుంది

(IV) ట్రై - వీక్లీ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ (77 అప్/78 డౌన్) పూరి మరియు హజరత్ నిజాముద్దీన్‌ల మధ్య నడుస్తుంది

జి అదనపు హాల్టులు

(1) హౌరా మద్రాసు జనతా ఎక్స్‌ప్రెస్ (37 అప్/38 డౌన్) రంభ మరియు గంజాంలలో ఆగును

(11) హౌరా [illegible] లోకల్ (P 7 అప్) మరియు ఖరగ్‌పూర్ - హౌరా లోకల్ (K 104 డౌన్) గోరపుట ప్యాసింజర్ హాల్టువద్ద ఆగుతుంది

(111) పూరి - వాల్తేరు పాస్ట్ ప్యాసింజరు (5 అప్/6 డౌన్) మరియు హౌస్, గొలబరి, చిల్కా, బాలుగాం జగన్నాధపూర్ గోలాంకర్‌లలో ఆగుతుంది

హెచ్ ఇపుడు వున్న సర్వీసులు రద్దు

79 అప్/80 డౌన్ పూరి - రేణిగుంట ఎక్స్‌ప్రెస్‌లు ప్రవేశపెడుతున్న మరియు 5 అప్/6 డౌన్ పూరి - వాల్తేరు ఎక్స్‌ప్రెస్‌లు పాస్ట్ ప్యాసింజర్లుగా మార్చుటవల్ల పూరి పలాసల మధ్య ప్రయాణీకుల అవసరాలు తీరుతున్న దృష్ట్యా 47 అప్/48 డౌన్ సికింద్రాబాద్ - పూరి ప్యాసింజరు రద్దుచేయబడుతుంది

ట్రైన్స్ కొత్త టైముల ప్రకారం 1975 అక్టోబరు 31/నవంబరు 1 అర్ధరాత్రి నుండి నడుపబడతాయి

ప్రింట్ చేయబడిన టైముటేబుల్ కొద్దిరోజులలో అమ్మకానికి లభించును.

చీఫ్ ఆపరేటింగ్ సూపరింటెండెంట్

భారత్ - జి. డి. ఆర్ మైత్రి

(2వ పేజీ తరువాయి)

ఎతులు, వందిమాగధులు కంగారుపడుతున్నారు

చరిత్ర తమకు చెల్లుచీటి యిచ్చేసింది తమ మనుగడకే ముప్పు ముంచుకు వస్తున్నది అని అంతర్జాతీయ సామ్రాజ్యవాదం గంగవెర్రులెత్తిపోతున్నది. అందుచేత ఎటువంటి సాహసకృత్యాలకైనా యీ యుద్ధశక్తులు ఒడిగడ్తాయి సందేహంలేదు అందుచేతనె వారు ఫాసిజానికి సంజీవి పోస్తున్నారు ఆ అస్త్రాన్ని ప్రయోగించి సోషలిజం అభివృద్ధిని దానితోపాటు అలీనదేశాల ప్రగతిని వీలైతే రూపుమాపాలని- కనీసం అడ్డుగొట్టి ఆపాలని అహర్నిశలూ ప్రయత్నిస్తున్నారు.

వీరు వియత్నాం నుంచి గెంటివేయబడి యూరప్‌లో సామ్యవాద ప్రాతిపదికపై ప్రచ్ఛన్న యుద్ధానికి స్వస్తి చెప్పాలనె హెల్సింకీ నిర్ణయాలను ఒప్పుకోవలసివచ్చి దావుదెబ్బతినుకుని మధ్యమున్న! ఎంచేత సామ్రాజ్యవాదం మనదేశంపై తన విధ్వంసక తీక్షణ వీక్షణాలను ప్రసరింపచేయడం ఆశ్చర్యకరం గాదు మనదేశంలో ఎలాగైనాసరే అస్థిరత్వాన్ని ప్రోత్సహించి పెంపొందించాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు డిగోగార్షియా నిర్మాణం బంగ్లాదేశ్ ఘటనలు, బెదిరింపులు-యివి అందుకే

ఆ ప్రయత్నాలు వమ్ము కావాలంటే మన ప్రజలు చేయాల్సిన కృషి బహుముఖంగా ఉండాలి అందులో ఒక ముఖ్యభాగం- సోషలిస్టు దేశాలతో సంబంధాలసహకారసంబంధాలను పెంపొందించుకోవడం ఈ కర్తవ్య సాధనలో భారత్ జి డి ఆర్ మైత్రికి యెంతయినా ప్రాముఖ్యత ఉన్నది

మూడేండ్ల దౌత్య సంబంధాలు

దేశవ్యాపితంగా జరిగిన ఆందోళన ఫలితంగా, ప్రపంచ వ్యాపితంగా వచ్చిన మార్పుల ఫలితంగా జి డి ఆర్ తో దౌత్య స్థాయిలో సంబంధాలు ఏర్పరచాలని భారతప్రభుత్వం 1972 అక్టోబరు 8 న నిర్ణయించింది

ఈ మూడేండ్ల కాలంలోను వచ్చిన ఫలితాలను స్థూలంగానైనా పరిశీలిస్తే విశదమౌతుంది భారత జి డి ఆర్ మైత్రికిగల ప్రాముఖ్యత అగ్రస్థాయిని జాయింట్ కమిషన్ను ఏర్పరచడం ద్వారా వివిధ రంగాలలో ముఖ్యంగా ఆర్థిక రంగంలో పరస్పర సహకారం పెరిగిలే అవసరాలను లోతుగా పరిశీలించి, రూపకల్పన చేయడం, విదేశీ వ్యాపారాన్ని 19[illegible] ఆఖరుకు 100 కోట్ల రూపాయల మేరకు (19[illegible]4 లో 13 లక్షల, 1974 లో 60 కోట్లు మాత్రమే) మొదటి ఐదు సంవత్సరాల తర్వాత 200 కోట్ల రూపాయల మేరకు పెంపొందించాలని లక్ష్యనిర్ణయన చేయడం-ఇవీ ఈ మూడేండ్ల పంట ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎన్నో శిధిలాలుగా ముడిబడియుండి, ఆ వ్యవస్థను సంక్రమించిన సంక్షోభానికి లోనవుతూ సతమతమౌతున్న మన ఆర్థిక వ్యవస్థను యీ లోటు పాట్లనుండి కొంతవరకైనా రక్షించడానికి ఈ సంబంధాలు ఉపయోగపడ్తున్నాయి సందేహంలేదు.

మొన్న గోవా, కాశ్మీరు సమస్యల సందర్భంగా నిన్న బంగ్లాదేశ్ విమోచనా ఉద్యమం సందర్భంగా నేడు ఫాసిస్టుశక్తుల, వారికి పక్కాసుదారులు గుండాలు అయిన సామ్రాజ్యవాదశక్తుల సమిష్టి కుట్రలను భగ్నంచేస్తూ ప్రధాని ఆత్యయిక పరిస్థితిని 20 సూత్రాల ఆర్థికకార్యక్రమాన్ని ప్రకటించి, వాటిని అమలు జరపడానికి జరిగే కృషిని సదవగాహన చేసుకుంటూ సహకరిస్తున్నది జి డి ఆర్, అంతర్జాతీయ రంగంలో మన జాతీయ లక్ష్యాలను ప్రచారం చేయడానికి, వాటిని ఆచరణలో పెట్టడానికి విదేశాలనుంచి సానుభూతి సహకారాలను పొందడానికి యీ మైత్రి తోడ్పడుతున్నది.

ప్రపంచ ప్రగతి శక్తులతో చేయూత

భారత జి డి ఆర్ మైత్రీ ఫలితాలు యీ రెండు దేశాలకు మాత్రమే పరిమితం కాలేదు ప్రపంచ పరిణామాలపైకూడ వీటి ప్రభావం తప్పకుండా ఉన్నది ముఖ్యంగా, నూతన ఆర్థిక వ్యవస్థను రూపొందించాలని ఫాసిస్టు, నయావలసవాదుల వ్యూహాగాలను రూపుమాపాలని అలీనదేశాలు, సోషలిస్టు దేశాలు కలిసి జరిపే సమిష్టి కృషికి భారత్-జి డి ఆర్ మైత్రి దోహదం చేస్తున్నది

ఇలాంటి మైత్రిని పెంపొందించాలనే, దేశభక్తిపూరితమైన మహా దాశయానికే అంకితమయ్యింది ఐక్య మిత్రమండలి

మన సంస్థ ఏర్పడి 13 ఏండ్లు దాటాయి నాటినుంచి నేటివరకు మన కార్యకలాపాలను సమీక్షించి చూసుకుంటె సంతోషంగా సంతృప్తితో, సగర్వంగా మనం చెప్పవచ్చు. మన కృషికి సత్ఫలితాలే వచ్చాయి నవ్యప్రపంచంలో నవభారత నిర్మాణానికి జరిగే కృషిలో మన ఉద్యమం వహించిన పాత్ర తక్కువ ఏమికాదు

ప్రభుత్వ స్థాయిలో ఏర్పడిన సంబంధాలను, మరింత దృఢంచేసి, బహుళ వ్యాప్తిని రూపొందించి, స్వతంత్ర భారత్‌ను శాశ్వతం బనా ప్రాతిపదికపై నిర్మించాలంటే బలమైన సంఘటితమైన ప్రజాఉద్యమం యిస్కస్ అనుభవం నిరూపించింది. మన సంస్థ అనుభవంకూడా అదే

పాట్నాలో డిశంబర్‌లో జరిగే అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక మహాసభను జయప్రదం చేయడానికి ఏర్పడిన జాతీయ సన్నాహక కమిటీలోను, రాష్ట్ర స్థాయిలో ఏర్పాటైన సన్నాహక కమిటీలలోను మన సంఘం తన ప్రతినిధుల ద్వారా నిర్మాణాత్మకమైన కృషిని చేసింది - చేస్తున్నది

వ్యవధి ఎంతోలేదు ఆరు వారాలు మాత్రమే అన్ని స్థాయిలలోను నిర్విరామ కృషి జరపాలి అందుకై సమిష్టిగా సాగిపోదాం

ఆత్మ సంతృప్తితో విశ్రమించం! సదా అప్రమత్తులమై మెలగుదాం! వ్యతిరేక శక్తుల ఎత్తుగడలను పటాపంచలు చేద్దాం! భారత్ జి డి ఆర్ మైత్రిని మరింత గాఢం చేద్దాం! ఫాసిజాన్ని పాతిపెట్టుదాం! ప్రపంచ శాంతిని సాధిద్దాం!

(అక్టోబరు 1[illegible]/75)

అమృతాంజనం

తలనొప్పి, జలుబు, ఇతర బాధలను నిరపాయంగా చప్పున పోగొడుతుంది

జలుబులు, వళ్లునొప్పి, కండరాల నొప్పి, బెణుకులు, తలనొప్పి—చప్పున తగ్గాలంటే అమృతాంజనం వాడండి బాధగా వున్నచోట అమృతాంజనం రాయండి తక్షణం బాధ మాయమవుతుంది అమృతాంజనం చిన్న సీసాలలోనూ, అదాచేసే పెద్ద సీసాలలోనూ, తక్కువ ధరకే లభించే చిన్న డబ్బాలలోనూకూడా దొరుకుతోంది

అమృతాంజనం 10 ఔషధాలు కలిసినది

అమృతాంజన్ లిమిటెడ్
AM/7570

నందిగామ సభ

(1వ పేజీ తరువాయి)

దుకు 20 అంశాల కార్యక్రమం పేదప్రజలకు ఈనాడు ఒక ఆయుధ మయింది దీంతో ఫాసిస్టుల ఎత్తుగడలను భగ్నం చేయాలి ప్రభుత్వానికీ, ప్రజల మధ్య సంస్కరణల అమలుకు ప్రతిబంధకంగా నిలిచిన నిరంకుశ పెత్తందారీ అడుగొత్తను ఛేదించాలి.

ఈ రెండు పార్టీల ఐక్యత ఎందుకు?

ప్రదేశ్ కమ్యూనిస్టుసమితి కార్యదర్శివర్గ సభ్యులు శ్రీ దాసరి నాగభూషణరావు ప్రసంగిస్తూ కాంగ్రెస్ కమ్యూనిస్టు పార్టీలు ఈ రోజు కలిసి వీధుల్లో ప్రదర్శన జరిపితే అశేష ప్రజానీకం ఆనందించింది ఈ జెండాలు ఐక్యంగా ఒక వేదిక నెక్కవలసినందుకు కినుక వహించినవారు, సందేహాలు అనుమానాలూ వ్యక్తం చేసిన వారూ లేకపోలేదు ఏది ఏమయినా ఈనాడు దేశంలో అనూహ్యంగా శరవేగంతో సాగుతున్న బ్రహ్మాండమయిన పరిణామాల గురించి భవిష్యత్ చరిత్రకారులు సువర్ణాక్షరాలలో లిఖిస్తారు

ఎందుకంటే ఈ నాడు భారత దేశం అమెరికన్ సామ్రాజ్యవాద పాశవిక శక్తిని బాహాటంగా సవాలు చేస్తోంది అందుకే భారత్‌లో ప్రజాస్వామ్యం లేదంటున్నారు పోర్చు కింగ్ లేదా తమ కిష్టంలేని ప్రభుత్వాలను అస్థిరకరించే హక్కున్నదని నిస్సిగ్గుగా చాటుతూనే రక్తపిపాస యుద్ధోన్మాదుల డాలర్ భూమిలో ప్రజాస్వామ్యం ఉందా?

భారతదేశం ఈనాడు అగ్నిపరీక్షను నిలిచింది నాలుగువక్కలా ఎటుచూసినా శత్రుదేశాలు యుద్ధధ్వజాలు మోహరించాయి. అంతరంగిక విచ్ఛిన్నకుల ముప్పు ముంచుకొచ్చింది ఇక అర్ధనగ్నశక్తులకిది తరుణం కాదు అమూల్యమైంది స్వాతంత్ర్యం దాన్ని రక్షించుకోవడానికి పాతవిభేదాలన్ని పక్కకుపెట్టి పేదప్రజలకోసం అందరం ఐక్యంగా ముందుకు సాగాలి

వసంత నాగేశ్వరరావు ప్రసంగం

కాంగ్రెస్ శాసనసభ్యుడు శ్రీ వసంత నాగేశ్వరరావు ప్రసంగిస్తూ భారతదేశంలో బూటకపు వద్దం విదేశీ శక్తుల కుట్రలు ప్రతిఘటించాలంటే భారత కమ్యూనిస్టుపార్టీతో కలిసిపనిచేయాలని, ఎవరేమి చెప్పినా ఈ స్నేహం సాగాలని వాంఛించేవారిలో నేనొకడిని భూసంస్కరణల అమలు కోసం రెండు పార్టీల కార్యకర్తలు గ్రామ స్థాయిల్లో కలిసికట్టుగా పనిచేయాలి

భారత్‌లో నియంతృత్వం వచ్చిందంటూ అటు బి. బి. సి ఇటు బోర్డు అందరూ బృందగానం చేస్తున్నారు పశ్చిమ దేశాలన్నీ భారత్ వ్యతిరేకతతో వ్యవహరిస్తుంటే సోవియట్ యూనియన్ మన దేశానికి కొండంత అండగా నిలిచింది మన ఉపఖండంలోని ప్రధానమైన దేశాల నాయకులను హత్య చేయడానికి సి ఐ ఏ పథకం వేసింది ఈ ఆపత్సమయంలో జాతీయవాదులు దేశభక్తులంతా ఐక్యం కావాలి నవంబర్ 7 విజయవాడ ప్రదర్శనలో ప్రజలు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలి

ఆంజనేయశాస్త్రి ప్రసంగం

జిల్లా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ జె ఎస్ ఆర్. ఆంజనేయశాస్త్రి ప్రసంగిస్తూ ప్రగతిశీల కార్యక్రమాల అమలును ఫ్యూడల్ స్వార్థపరవర్గాలు ప్రతిఘటిస్తూంటె ప్రభుత్వం నిస్సహాయంగా చూసేస్థితి ఉంది భూ సంస్కరణలచట్టాలు వెట్టిచాకిరీ రద్దు, ఋణ విముక్తి ఆర్డినెన్సులు వ్యవసాయ కార్మికుల్లో ఎంతో ఉత్సాహం రేకెత్తించాయి రాష్ట్రంలో ఇప్పటికి లెక్కతేలిన పది లక్షల ఎకరాల మిగులు భూమి పంపిణీకి పేదలంతా ఉద్యమించాలి

జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ వాసిరెడ్డి [illegible], ప్రసంగిస్తూ కమ్యూనిస్టు పార్టీ చీలికకు ముందున్నప్పటి ఉత్సాహ వాతావరణం తిరిగి యీనాడు కనిపిస్తోంది ప్రజాస్వామ్యం గురించి కబుర్లుచెప్పే ప్రతిపక్షాలు నిజానికి రాజ్యాంగం పైనా ప్రజాస్వామ్యంపైనా గౌరవం లేనివాళ్ళు ఇందిరాగాంధి సోషలిస్టుదేశాల ఏజెంటుగా కమ్యూనిస్టుల చేతి పనిముట్టుగా చిత్రిస్తూ దుష్ప్రచారం సాగిస్తున్నారు ఇదంతా బూటకం

శాసనసభ్యురాలు శ్రీమతి వాసిరెడ్డి, రాజ్యలక్ష్మి. "గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఇంకా వెనుకబాటు తనంతో ఇంటికే కట్టుబడి ఉంటున్నారు, ఉత్సాహంతో పాల్గొనడం ద్వారా వారికి చైతన్యం కలిగించాలి

కంచికచర్ల సమితి అధ్యక్షులు చింతా వెంకటేశ్వర్లు కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసిపోవటంపై కొన్నిచోట్ల అభ్యంతరాలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు కానీ తీరగా రాజకీయ విభేదాల గురించి చర్చించడానికిది సమయం కాదు విస్తృత దృక్పథంతో ముందుకు సాగాలి.

రేడియో

శుక్రవారం అక్టోబరు 31
శక 1897 .*. కార్తీక 9

హైదరాబాద్ (ఎ)

405.4 మీ. (740 కి హె.)

6-00 వందే మాతరం 6-10 భక్తి రంజని - నారాయణాచార్యుల కృతులు సంప్రదాయకీర్తనలు. 7-15 గాంధి మార్గం. 7 2[illegible] చిత్రనీయ - భక్త తుకారాం, శ్రీ సత్యనారాయణ మహాత్మ్యం, శ్రీ సింహాచలక్షేత్ర మహిమ, తులాభారం. 8 20 ఎస్ ఎల్ ఎన్ శాస్త్రి - వయొలిన్. 11-40 ప్రాథమికోన్నత పాఠశాలలకు 12 2[illegible] హిందీ పాఠం 1 10 చిత్రనీయ - మాతృదేవత, భలేకోడలు బంగారుకలలు. 2-10 ఉన్నత పాఠశాలలకు. 5-30 విజయవాడ వలె. 6- [illegible] 'శ్రీపీఠాలయం' ఋక్ర[illegible] [illegible]-45 చిత్రనీయ - రాముని మించిన రాముడు, తాతమ్మ కల, కన్నవారి కలలు, [illegible] మూరాలి, అన్నదమ్ముల అనుబంధం, నాటు స్వతంత్ర్యం వచ్చింది, బలిపీఠం, బాబు 8- 0 లలిత సంగీతం. పి వీరమణి 8 4[illegible] నాటిక. 9-30 దక్షిణ ప్రాంత సంగీత సభ ద్వారం సం[illegible]మూరు. వయొలిన్. 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

విజయవాడ

6-00 వందేమాతరం, శుభోదయం ప్రసార విశేషాలు: 6-05 భక్తిరంజని దేశభక్తి గేయం, దేవీస్తుతి నాతియాకరాం, 7-15 గాంధీ మార్గం 7 25 ఉద్దండ సంగీతం. 7-45 సంగీత శిక్షణ (జానియన్లకు). 11-45 ప్రాథమికోన్నత పాఠశాలలకు. 12 05 చిన్నారి చిట్టి - క్లారినెట్. 1-25 చిత్రతరంగిణి. 2-1[illegible] ఉన్నత పాఠశాలలకు. 5-[illegible]0 చిన్నారి చిట్టి - క్లారినెట్. 6 30 యువవాణి. 7-4[illegible] వర్ధ్య పఠనం. -05 చిత్రతరంగిణి. 8-15 పురంధిక. 9-15 స్పాట్ లైట్ 9-30 దక్షిణప్రాంత సంగీత సభ ద్వారం మంగతాయారు - వయొలిన్. 10-30 ప్రసార సమాప్తి

గుంటూరుజిల్లా పైరుకు నష్టం

(1 వ పేజీ తరువాయి)

వ్యవసాయశాఖాధికారి తెలిపారు

నవక్రాన్ కొట్టించుటకు ఎకరానికి 13 రూపాయలు రైతులకు ఖర్చు అవుతుందనికూడ ఆయన వివరించి ఈ మందు వరిమొక్క మొదళ్ళకు కొట్టాలి అని వివరించారు

రు. 2 కోట్ల నష్టం

గత సంవత్సరం 7 లక్షల అన్నుల వరి ధాన్యం గుంటూరుజిల్లాలో పండింది ఈ సంవత్సరం కనీసం 10 శాతం పంట అయినా తగ్గుతుందని షుమారు 2 కోట్ల రూపాయల విలువగల వరి పంట దెబ్బ తింటుందని వ్యవసాయ అనుభవజ్ఞులుభావిస్తున్నారు

ఇటీవల వచ్చిన కృష్ణానది వరదలవలన లంకభూములలో వాణిజ్యపంటలైన మిరప పసుపు, చెరకుపంటలకు దెబ్బతగిలిందని ఎకరానికి 10 రూపాయలు రైతులకు అదనంగా ఖర్చవుతుందని తెలుస్తున్నది మిరప లక్ష ఎకరాలలోను, 60వేల ఎకరాలలో ప్రత్తి పంట వేశారు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రాంతంలో ఆకుముడత తెగులు వరి పంటకు 20 వేల ఎకరాలలో వ్యాపించగా క్రిమి సంహారక మందులు 20 వేల ఎకరాలలోను చల్లారని జిల్లా వ్యవసాయ శాఖాధికారి తెలియచేశారు

ఈ నెల 9 వ తేది 13 లేక 12వందల టన్నుల అమ్మోనియమ్ సల్ఫేట్ దిగుమతి చేయబడి, ప్రధానంగా వాణిజ్య పంటలకు ఈ రసాయనిక ఎరువులు వినియోగించనున్నట్లు చెప్పారు.

మైనర్ ప్రాజెక్ట్సు సర్వే ఆర్గనైజేషన్

(షిప్పింగ్&ట్రాన్స్‌పోర్టుమినిస్ట్రీ)

ఇద్దరు మెరైన్ ఇంజన్ డ్రైవర్లు కావలెను (లభించినట్లయితే షెడ్యూల్డు కులము లేక షెడ్యూలు జాతికి ఒక్కటి రిజర్వు చేయబడినది లభించనిచో రిజర్వు చేయ[illegible]) వయస్సు 40 సంవత్సరాల లోపు (షెడ్యూలు కులము/షెడ్యూలుజాతికి మరియు యితర కేటగిరీలకు నిబంధనల ప్రకారం సడలించబడును) జీతం (గ్రేడు I రు [illegible]80-12-500-ఇబి-15-560 ప్లస్ అలవెన్సులు గ్రేడు II - రు. 330-8-370-10-400-ఇబి-10-480 ప్లస్ అలవెన్సులు

అర్హతలు తప్పక కావలసినవి గ్రేడు I 1958 యం. యస్ చట్టంక్రింద సముద్రంలో నడిచే ఇంజన్ డ్రైవర్ (మోటార్) కాంపిటెన్సీ సర్టిఫికేట్ లేదా 1917 ఐ యస్ వి చట్టంక్రింద జారీ చేయబడిన మొదటితరగతి ఇంజన్‌డ్రైవర్ (మోటార్)గా కాంపిటెన్సీ సర్టిఫికేట్ లేదా 1917 ఐ యస్ వి చట్టంక్రింద జారీచేయబడిన రెండవ తరగతి కాంపిటెన్సీ సర్టిఫికేట్ గ్రేడులో కనీసం 3 సంవత్సరాలు సర్వీసు లేక అనుభవం కలిగి వుండాలి గ్రేడు II- ఐ యస్ వి చట్టంక్రింద రెండవ తరగతి ఇంజన్ డ్రైవర్‌గా కాంపిటెన్సీ సర్టిఫికేట్

డ్యూటీ స్థలం. ప్రస్తుతం బొంబాయి తప్ప భారతదేశంలో ఎక్కడైనా

దరఖాస్తులలో వయస్సు, అర్హతలు, అనుభవం మొదలగునవి తెలుపుతూ కావలసిన సర్టిఫికేట్లు/అర్హతాపత్రాలు అటెస్టు చేయించిన కాపీలు సీనియర్ మెరైన్ సర్వేయర్ కామర్స్‌హౌస్, 4 వ ఫ్లోర్ కరింభాయ్‌రోడ్, బల్లార్డ్ ఎస్టేట్ బొంబాయి-400038 వారికి 15-11-75 లోపల చేరునట్లు పంపాలి ప్రభుత్వ సర్వెంట్లు ప్రాపరు చానల్‌లో దరఖాస్తు చేయాలి

davp 700 (18) 75

రాజమండ్రిలో సన్నాహాలు

ఫాసిస్టు వ్యతిరేక మహాసభ నిర్వహణకు

రాజమండ్రి అక్టోబరు 29

రాజమండ్రిలో ఫాసిస్టు వ్యతిరేక మహాసభ జయప్రదంగా నిర్వహించడానికి అవసరమైన సన్నాహాలు ప్రారంభించారు.

ఈ సందర్భంగా దాయమ్మ మెమోరియల్ హాలులో మహాసభ కమిటీ కన్వీనర్, పట్టణ కాంగ్రెస్ నాయకులు శ్రీ పొన్నాడ చలపతిరావు అధ్యక్షతన కాంగ్రెస్ కమ్యూనిస్టు ప్రతినిధుల సంయుక్త సమావేశం జరిగింది.

యుతులు వాయుపూడి రామకృష్ణ, వల్లా అప్పారావు, ముళ్ళపూడి సూర్యనారాయణ, పిట్టూరి ప్రభాకరచౌదరి, చవా కుల రాఘవరావు, యామన వెంకటస్వామి ప్రభృతులు సమావేశంలో ప్రసంగించారు.

త్వరలో విస్తృత సమావేశం ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు

బస్సు బోల్తాపడి ఒకరి మృతి

కోజికోడ్ అక్టోబరు 29

మల్లాపురం జిల్లా తిరూరివద్ద బస్సు బోల్తాపడిన ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించారు. మరో 40 మందికి గాయాలు తగిలాయి. అందులో ఆరుగురిపరిస్థితి తీవ్రంగా ఉన్నది.

మార్కెట్ ధరలు

విజయవాడ, అక్టోబరు 29

విజయవాడ అసిస్టెంట్ డైరెక్టరు ఆఫ్ మార్కెటింగ్ నేడు అందజేసిన 28.10.75 నాటి టోకు ధరలు (క్వింటాల్‌కు సంచి ఖర్చులు,పన్నులు మినహా)

ధాన్యం		
	మసూరి	అక్కుళ్ళు
విజయవాడ	125.00	100.00
బియ్యం		
విజయవాడ	190.00	160.00
అపరాలు		
	కందులు	మినుములు
విజయవాడ	168.00	198.00
రాజమండ్రి	160 00	200.00
గుంటూరు	170.00	200.00
	పెసలు	శనగలు
విజయవాడ	140.00	—
రాజమండ్రి	170.00	—
గుంటూరు	140.00	195.00
వేరుశనగ		
	పప్పు	నూనె
విజయవాడ	—	705.00
నంద్యాల	2 6.75	655.00
బెల్లం		
	1వ రకం	2వ రకం
అనకాపల్లి	266.00	258.00
తాడేపల్లిగూడెం	—	—

రేపే విడుదల!
ఉదయం ఆటతో

అప్సర సినిమా హౌస్ (ఏ. సి.)	–	విజయవాడ
నాజ్ అప్సర (ఏ. సి.)	–	గుంటూరు
గీత్ (ఏ. సి.)	–	విశాఖపట్నం
అశోక్ మహల్	–	రాజమండ్రి
సినిమా మెజెస్టిక్	–	కాకినాడ
రంగ్ మహల్	–	నెల్లూరు
స్వరాజ్ టాకీస్	–	తెనాలి
శ్రీ గోపాలకృష్ణా టాకీస్	–	ఏలూరు
యస్. సి. యస్. థియేటర్	–	విజయనగరం
కృష్ణ కిశోర్ టాకీస్	–	మచిలీపట్టణము
సత్యకృష్ణ ప్యాలెస్	–	భీమవరం
శ్రీ గంగా మహల్	–	గుడివాడ
శ్రీసత్యనారాయణపిక్చర్‌ప్యాలెస్	–	అనకాపల్లి
వెంకటేశ్వర డీలక్స్ థియేటర్	–	అమలాపురం
రామ్ తులసి థియేటర్	–	తాడేపల్లిగూడెం
శ్రీనివాస డీలక్స్ థియేటర్	–	ఒంగోలు
గజలక్ష్మీప్యాలెస్	–	పాలకొల్లు
రహమతీయ పిక్చర్ ప్యాలెస్	–	కడప
వెరైటీ టాకీస్	–	కర్నూలు
శ్రీ రఘువీర టాకీస్	–	అనంతపురం
వెంకటేశ (ఏ సి)	–	హైదరాబాద్
విహార	–	హైదరాబాద్
ప్యారడైజ్	–	సికిందరాబాద్
నవీన్ థియేటర్	–	వరంగల్
అశోక్ టాకీస్	–	నిజామాబాద్
త్వరలో: ప్రతాప్ టాకీస్	–	తిరుపతి



తూర్పు గోదావరిజిల్లా హక్కుదార్లు : శ్రీ కృష్ణా ఫిలింస్ - పసలపూడి,
పశ్చిమ గోదావరిజిల్లా హక్కుదార్లు : దేవీ ఎంటర్‌ప్రైజెస్ - ఏలూరు

చౌక ధరలకు మందుల సరఫరా

రానున్న మూడు నెలల్లో ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మంత్రి శ్రీ మాలవీయా వెల్లడి

బొంబాయి, అక్టోబరు 28

రానున్న రెండు మూడు నెలల కాలంలో ప్రజలకు చౌకగా, వివిధ 100 రకాల మందులను సరఫరా చేయటం జరుగుతుందని పెట్రోలియం రసాయనాల మంత్రి శ్రీ కె డి. మాలవీయ నేడిక్కడ తెలియజేశారు.

పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూరు రకాలలో అత్యవసరమైన మందులు కూడా వుంటాయని చెప్పారు.

మందుల ఉత్పత్తిదారులతో అనేక మార్లు తాను జరిపిన చర్చల సందర్భంగా దేశానికి అవసరమగు మందుల ధరలను తగ్గించవలసిన అవసరాన్ని, వాటిని అధికంగా సరఫరా చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పానని అన్నారు

యీ లక్ష్యాల సాధనకు ప్రభుత్వం మందుల ఉత్పత్తిదారులకు కొన్ని ప్రతిపాదనలు చేసిందని అన్నారు. యీ ప్రతిపాదనలను వారు ఆమోదించే సూచనలున్నాయని చెప్పారు.

నూతన పథకానికి ప్రైవేట్ రంగంలోని మందుల ఉత్పత్తిదారుల సహకారం లభిస్తుందా? లేక నిర్బంధంగా వారిచేత ఈ పథకాన్ని ఆమోదింపజేస్తారా? అని విలేకరులు ప్రశ్నించగా త్వరలో ఢిల్లీలో వారిని కలుసుకొని చర్చలు జరుపనున్నానని అన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు మందుల సరఫరాను పెంచాలని ప్రభుత్వం సూచించిందని అన్నారు. ఈ ప్రతిపాదనకు ఉత్పత్తిదారులు సూత్రప్రాయంగా అంగీకరించారని, అయితే మందులపై లెవీలను పునర్వ్యవస్థీకరించాలని కోరారని అన్నారు అన్ని విషయాలను పరిశీలిస్తున్నామని చెప్పారు.

మందుల పంపిణీ కార్యక్రమాన్ని దశలవారిగా ప్రారంభిస్తామని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని 11 వేల పెట్రోలు బంకులలో మందులు, పైరు, బ్యాటరీలు, ముతక వస్త్రాలను సరఫరా చేస్తామని అన్నారు. సమాజంలోని బలహీనవర్గాలకు వాటిని సరఫరా చేయటం జరుగుతుందని అన్నారు.

ప్రారంభంలో ఇండో - బర్మా పెట్రోలియం కంపెనీ నవంబరు చివరినాటికి 20 కేంద్రాలను ప్రారంభిస్తుందని అన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ త్వరలో 40 కేంద్రాలు ప్రారంభిస్తుందని అన్నారు.

పేద ప్రజలను గుర్తించే నిమిత్తం వారికి కార్డులను జారీచేసే పథకాన్ని రూపొందిస్తామని అన్నారు అసిస్టెంటు కలెక్టరులు కార్డులు జారీచేసే అధికారం వుంటుందని చెప్పారు.

నూనె వుత్పత్తి ప్రయత్నం ప్రారంభం

బొంబె హైలోని రెండు బావులలో నూనె వుత్పత్తి ప్రయత్నాలను నూనె ఖనిజ వాయువుల కమిషన్ డ్రిల్లింగ్ షిప్ "సాగర సామ్రాట్" ప్రారంభించిందని శ్రీ మాలవీయా తెలియజేశారు.

ఈ సంవత్సరాంతానికి 20 లక్షల టన్నుల నూనెను ఉత్పత్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు

సముద్రంలోను, తీర ప్రాంతాలలోను నూనె అన్వేషణ కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని విలేకరుల ప్రశ్నలకు సమాధానంగా తెలిపారు. 1980 నాటికి దేశం నూనె విషయంలో స్వయం సమృద్ధిని సాధించగలదని అన్నారు.

అరేబియా సముద్రంలో కచ్ నుండి లక్షద్వీపం వరకు 14 వందల కిలోమీటర్ల పొడవునా నూనె నిల్వలు వున్నట్లు సీస్మిక్ సర్వేలో వెల్లడయిందని చెప్పారు. ఇందుకు సంబంధించిన కార్యకలాపాలను నూనె ఖనిజ వాయువుల కమిషన్ ఒక్కటే నిర్వహించలేదని, అందుచేత యితర పార్టీలకి కొంట్రాక్టు యిస్తామని అన్నారు.

నా వివాహమై 14 సంవత్సరములైనది కాని సంతానము కలుగలేదు నేను పెద్ద పెద్ద హాస్పిటల్స్‌లో ఢిల్లీ, ఆగ్రాలలో చికిత్స పొంది చాలా డబ్బు ఖర్చు పెట్టినాను కాని ఫలితం దక్కలేదు ఒక దినము నా స్నేహితుడు ఒకడు డా॥ కె ఎస్ సైని ఎం ఎ ఎం.ఎస్., (పంజాబ్), లేడీ డాక్టర్ చంపా సైని ఎం.ఎ ఎం.ఎస్, (పంజాబ్) వారి సంతాన్ హాస్పిటల్ 20, వి. ప్రహ్లాదమార్కెట్ కరోల్‌బాగ్, ఢిల్లీ-1కు వెళ్ళి వారివల్ల చికిత్స పొందమని సలహా ఇచ్చెను అంతట నేను నా భార్య సైతం వారి వద్దకు వెళ్ళి చికిత్స పొందినాను వారి చికిత్స వల్ల 6 నెలలో మాకు ఆశాకిరణము కలిగినది 4-8-74 వ తేదీన ఒకప్రకాశమానమైన మగశిశువు మాకు జన్మించెను ఇప్పుడు మా గృహము స్వర్గమయమైనది సదరు డాక్టరుగారు యదార్థమైన శాస్త్రీయ (సైంటిఫిక్) పద్ధతిన చికిత్స జరుపుచున్నారు సంతానవిహీనులైన దంపతులు సదరు డాక్టరు కె.ఎస్. సైని, లేడీడాక్టరు చంపా సైనిగార్ల వద్దకు వెళ్ళి వారి గత 25 సంవత్సరముల అనుభవంవల్ల కలిగే లాభమును పొందగలరని నేను సలహా యిచ్చుచున్నాను. అట్టి వారు సదరు డాక్టర్ల చికిత్స వల్ల తప్పకుండా ఫలితమును పొందగలరని నొక్కి చెప్పుచున్నాను. ఈ సర్టిఫికేటుతో నాకు కలిగిన చంద్రబింబంలాంటి కుమారుని సహితము నా భార్య తీయించుకున్న ఫోటో ఇవ్వటమైనది. నా చిరునామా :

ఓంప్రకాష్ జైన్,
28/9/ లాల్ క్వార్టర్సు,
హాపూర్‌రోడ్, డియాబాద్, ఉత్తరప్రదేశ్

సంతాన్ హాస్పిటల్



డా॥ కె. ఎస్. సైని
M A. Ms. (పంజాబ్)
స్త్రీ పురుషుల సంతాన ప్రాప్తి విషయాల్లో స్పెషలిస్టు.

మా సలహాద్వారా దేశం అంతటా సంతానంలేని వేల జంటలు లాభపడిరి. స్త్రీలకు చికిత్సలో వారికి లేడీ డాక్టరు చంపా సైని, M A, MS. (పంజాబ్) మరియు నర్సులు సాయపడుతున్నారు. మీ పట్టణంలో మమ్ములను సంప్రదించి యీ అవకాశం ఉపయోగించుకొండి.

కార్యక్రమం

విజయవాడ
శ్రీ రాజరాజేశ్వరి నిలయం, పోస్టాఫీస్ రోడ్, రామచంద్రనగర్. మేరీస్టెల్లా స్త్రీల కళాశాలకు ఎదురుగా-పటమట, విజయవాడ-
17—11—75 నుండి 21—11—75
13—1—76 నుండి 7—1—76

రాజమండ్రి
సంతాన్ హోటల్ ఇంటి నెం. 12-3
గాంధిపురం, నెం. 1, పోస్టాఫీసువద్ద.
25—11—75 నుండి 30—11—75
11—1—76 నుండి 16—1—76

విశాఖపట్టణం
శ్రీ వెంకట విద్యాలయం అబిడీనగర్, అక్కయ్యపాలెం బ్రిడ్జిదగ్గర విశాఖపట్నం-4
1—12—75 నుండి 11—12—75
2—1—1976 నుండి 27—1—76
పనివేళలు: ఉ॥ 10 నుండి సా॥ 4
అన్ని కేంద్రాలు [illegible] చేయబడును

PRAVININDIA

ఆంధ్రప్రదేశ్‌లో 125 గ్రామాల విద్యుదీకరణ పూర్తి

హైదరాబాద్ అక్టోబర్ 28

గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ యిచ్చిన ఋణ సహాయంతో రాష్ట్రం ఇంతవరకు మొత్తం 125 గ్రామాలను విద్యుదీకరణ చేయటం జరిగింది

1975-76సంవత్సరానికిగాను రాష్ట్రంలో విద్యుదీకరణ చేయాల్సిన గ్రామాలు 481 లక్ష్యంగా వుంది

ఈ సంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్న 847 హరిజన వాడలకుగాను 151 హరిజన వాడలకు కూడా దాదాపు విద్యుదీకరణ సౌకర్యం కల్గించడం పూర్తయిందని నేడిక్కడ విడుదల చేయబడిన పత్రికా ప్రకటన తెలుపుతోంది

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికిగాను మరో కేంద్ర సహాయ కార్యక్రమం క్రింద, అదనంగా 115 గ్రామాలకుగాను గ్రామాలను అప్పుడే విద్యుదీకరించడం జరిగిందని ఆ ప్రకటన తెలుపుతోంది

అమెరికా చే అణ్వస్త్ర పరీక్ష

వాషింగ్టన్, అక్టోబరు 28

అమెరికా నేడు నెవాడా ఎడారిలో 12 వ భూగర్భ అణ్వస్త్ర పరీక్షను జరిపింది. అణ్వస్త్రం 200 కిలో టన్నుల నుండి ఒక మెగటన్ శక్తి కలిగిందని, ఇంధన పరిశోధనా అభివృద్ధిసంస్థ తెలిపింది. హిరోషిమాను నాశనం చేసిన బాంబుకంటే ఇది 10 రెట్లు శక్తివంతమైందని తెలిపింది.

మూడేళ్ళలో గూడూరు విజయవాడ రైల్వే విద్యుదీకరణ

విజయవాడ, అక్టోబరు 28

విజయవాడ—గూడూరు రైలు మార్గం విద్యుదీకరణ 1978—79 మధ్య కాలానికి పూర్తి కాగలదని చీఫ్ ఎలెక్ట్రికల్ ఇంజనీర్ శ్రీ ఎస్. వి. ఎస్. మూర్తి నేడిక్కడ ప్రకటించారు

విద్యుదీకరణ కార్యక్రమాన్ని ఆయన వివరించారు 420 కిలోమీటర్ల దూరంలో 310 కిలో మీటర్ల దూరం మేరకు ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్‌కు ఫౌండేషన్లు పూర్తయ్యాయి. ఎలక్ట్రికల్, సివిల్ కలర్ సిగ్నలింగ్ సెట్ విభాగాల డిజైన్స్ 60 శాతం వరకు పూర్తయ్యాయి.

అక్టోబరు ఒకటవ తేదీన స్తంభాల పాతడం ప్రారంభించి యిప్పటికి 60 కిలోమీటర్ల దూరం పూర్తిచేయటం జరిగింది.

కార్యక్రమంపై యింతవరకు ఎనిమిది కోట్ల రూపాయలు వ్యయం చేశారు ఈ సంవత్సరం మరో రెండు కోట్లు చేస్తారు. 1976 77 లో ఎనిమిదినుండి తొమ్మిది కోట్ల రూపాయలవరకు లభించగలదన్న ఆశాభావాన్ని వెల్లడించారు. (వి. వి.)

బెంగళూరు, అక్టోబరు 29

యూనివర్శిటీల ఉర్దూ విభాగాలలో తీవ్రమైన మార్పులు తీసుకరావాలని నిన్న ఇక్కడ ముగిసిన అఖిలభారత యూనివర్శిటీ ఉర్దూ టీచర్ల మహాసభ సూచించింది

ఉత్తర కోస్తా వాసులకు అదనపు రైల్వే సౌకర్యాలు

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, అక్టోబరు 28

నవంబరు ఒకటవతేదీ నుండి అమలులోకి రానున్న నూతన రైల్వే టైమ్ టేబుల్ ప్రకారం ఉత్తర కోస్తా ప్రాంతంలోని రైల్వే సౌకర్యాలను అధికం చేశారు.

దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ యాపరింటెండెంట్ శ్రీ బెరియన్, దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ శ్రీ శ్యామ్‌సుందరం టైమ్‌టేబిల్‌లో వచ్చిన మార్పులను నేడిక్కడ వివరించారు.

క్రొత్తగా పూరి-రేణిగుంటల మధ్య కొత్త ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టారు. ఇది భీమవరం, నిడదవోలుల గుండా పోతుంది. దీనికి చేరుకొనేలాగా నర్సాపూర్-భీమవరం మధ్య ఒక ప్యాసింజర్‌ను ప్రవేశపెట్టారు. కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు అందుకొనేలాగ నరసపూర్-విజయవాడ మధ్య వేగంగా వెళ్ళే ఒక పాసెంజర్‌ను ప్రవేశపెట్టారు భీమవరం-నిడదవోలు మధ్య మరొ రైలుకారును, రాజమండ్రి-నిడదవోలు మధ్య ఒక రైలు కారును ప్రవేశపెట్టారు

కాకినాడ-ఏలూరు పాసింజరును విజయవాడ వరకు పొడిగించారు భీమవరం-గుంటూరు పాసింజరును నరసపూర్ వరకు పొడిగించారు.

మద్రాసు-ఢిల్లి ఎక్స్‌ప్రెస్ బీనావద్ద, జయంతి ఎక్స్‌ప్రెస్ నెలూరువద్ద యికనుండి ఆగుతాయి. కాజీపేట-[illegible] మధ్య ఒక పాసింజరును ప్రవేశపెట్టారు.

మిటర్‌గేజ్‌లో గుంటూరు - నంద్యాల పాసెంజరును ద్రోణాచలం వరకు పొడిగించారు.

తిరుపతి - కాకినాడ-విజయవాడ-[illegible] పాసెంజర్ ప్రయాణ వేగాన్ని పెంచారు.

ఉత్తర సర్కారు జిల్లాలవారు హైదరాబాద్ వెళ్ళి రావటానికి వీలుగా గోల్కొండ కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లకు కనెక్షన్లు ఏర్పాటు చేయటం మార్పులలో విశేషం.

సాహిత్య అకాడమీ అవార్డులు

1975 సంవత్సరానికి

హైదరాబాద్, అక్టోబరు 28

1975 సంవత్సరానికిగాను, ఆధునిక తెలుగు సాహిత్యానికి యిచ్చే అవార్డుల పథకం క్రింద ముళ్ళపూడి వెంకటరమణ "సీతా కల్యాణం" కథానికను ఉత్తమ కథానికగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఎంపిక చేసింది.

డాక్టర్ యన్. తి. జ్ఞానానందకవి రచించిన "అమరవాణి" (పద్య కావ్యం), శ్రీ ఆర్. యస్. సుదర్శనం రచించిన సాహిత్య విమర్శనాత్మక గ్రంధమైన "సమాజం - సాహిత్యము", శ్రీ గొల్లపూడి మారుతీరావు రచించిన "కళ్ళు" నాటికలు ఉత్తమమైనవిగా ఎంపిక చేయబడ్డాయి.

ఈ సంవత్సరం నవలలకు అవార్డు యివ్వబడలేదని నేడిక్కడ అకాడమీ విడుదలచేసిన ప్రకటన తెలుపుతోంది.

వీరికి ఒక్కొక్కరికి అవార్డు క్రింద రు 1,116 లు అందజేస్తారు.

వాల్డీమ్ క్యూబా పర్యటన

నవంబరు 2 న

ఐ.రా.స. అక్టోబరు 29

ఐ.రా.స. ప్రధాన కార్యదర్శి కర్ట్ వాల్డీమ్ నవంబరు 2 న క్యూబాలో రెండు రోజులపాటు అధికార పర్యటన జరుపుతారు.

ఈయన హవానాలో క్యూబా ప్రధాని కాస్ట్రోతోనూ, విదేశాంగమంత్రి రౌల్ రోవా తోనూ చర్చిస్తారు.

భారతదేశానికి 6 వేల యుగోస్లావియా ట్రాక్టర్లు

బెల్గ్రేడ్, అక్టోబర్ 28

భారత్‌కు 6 వేల ట్రాక్టర్లను ఎగుమతి చేయడానికి యుగోస్లావియా ఇ. యం. టి కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది.

ఈ ఒప్పందం విలువ 2.10 లక్షల డాలర్లు. 97 అక్టోబర్ మాసాంతానికి ఈ ట్రాక్టర్లు విడుదల చేయబడతాయి

గూడ్సురైలు-కారుఢీ

9 మందికి గాయాలు

హైదరాబాద్, అక్టోబరు 28

చిత్తూరుజిల్లా [illegible]వద్ద చిన్నకాపలాలేని లెవెల్‌క్రాసింగ్ వద్ద గూడ్సుబండి ఒక కారును ఢీకొనగా కారులోని 9 మంది గాయపడ్డారని నేడు ఇక్కడికి అందిన సమాచారం వల్ల తెలుస్తున్నది

కారు డ్రైవరుతోసహా గాయపడిన వారందరిని సమీప అస్పత్రిలో చేర్చారు. వారిలో ఇద్దరి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది.

జంటనగరాల్లో వరుసగా 5 వ రోజు భారీ వర్షాలు

హైదరాబాద్, అక్టోబరు 28

జంట నగరాలలో వరుసగా అయిదవ రోజు నేడు కుండ పోతగా వర్షం పడింది.

నేటి సాయంత్రానికి 11 6 మిల్లీమీటర్ల వర్షం పడినట్లు వాతావరణ పరిశోధనా కేంద్రం రికార్డు చేసింది.

ఆకాశం ఇంకా మేఘావృతమై వుంది పల్లపు ప్రాంతాలలోని ప్రజలు భయాందోళనలతో కాలం గడుపుతున్నారు.

నగరంలోని ప్రధానవీధిలో నేడు ఒక ఇల్లు కూలిపోయింది. అయితే ఎవరూ గాయపడలేదు.

ఇది ఇలావుండగా అధికారులు ముందు జాగ్రత్తగా అన్నిచర్యలు తీసుకున్నారు. మూసీ నది గట్ల భద్రత నిమిత్తం అవి చర్యలు తీసుకున్నారు. నిన్న నదిగట్టు కొంత తెగిన ఫలితంగా పెద్ద చింతచెట్టు పడిపోయింది.

చిలీలో ఖైదీలకు కొత్త రకం విష ప్రయోగం

లండన్, అక్టోబరు 29

చిలీలోని ఖైదీలపై సైనికముఠా ఒకరకమైన మందును ప్రయోగిస్తోంది. దీనివల్ల ఖైదీలు క్రమంగా కొంతకాలానికి మరణిస్తారని "లండన్ అబ్జర్వర్" రాసింది

రాజధాని శాంటియాగోనుండి ఎలాగో బయటికి వచ్చిన వైద్య సమాచారం మేరకు యాంటి కాన్సర్ డ్రగ్ "సైక్లోఫాస్ఫమైడ్"ను ఖైదీలకు ఓవర్‌డోసులలో ఎక్కిస్తున్నారని ఆ పత్రిక రాసింది.

శాంటియాగోలో కొంతకాలం ఉన్న ఇద్దరు నిర్బంధితులకు ప్రస్తుతం వైద్యం చేస్తున్న డాక్టర్ ఇలా చెప్పారు:

"ఈ మందు విపరీతమైన దిక్కుని ద్రావణంగా ఉండగా ఒక గొట్టంద్వారా ఖైదీ మూత్రకోశంలోకి ఎక్కిస్తారు. దీనివలన ఖైదీకి భరించలేని బాధకలుగుతుంది. కొన్ని సంవత్సరాలకు మూత్రకోశం పూర్తిగా పాడై చివరకి ఆవ్యక్తి మరణిస్తాడు.

ఈ పాశవిక చిత్రహింస ఉద్దేశం గురించి రాస్తూ: "ప్రతిఘటించే పనిలేకుండా ఖైదీయే కొన్నాళ్ళకు ఇంటి దగ్గర చచ్చిపోతాడు" అని లండన్ అబ్జర్వర్ పేర్కొంది.

యు. పి లో 2½ లక్షల హెక్టార్ల భూమి పంపకం

లక్నో, అక్టోబరు 28

వచ్చే ఫిబ్రవరి మాసాంతానికి ఉత్తర ప్రదేశ్‌లో 2½ లక్షల హెక్టార్ల భూమిని భూమిలేని పేదలకు పంపిణీ చేయటం జరుగుతుందని నేడిక్కడ అధికార ప్రకటనలో తెలియ చేయబడింది.

మొత్తం 5 లక్షల మంది వ్యవసాయ కార్మికులకు ఈ పంపిణీవల్ల ప్రయోజనం చేకూరుతుంది.

వచ్చే రెండుమాసాలలోపుగానే ఇందులో ఎక్కువ భాగం భూమిని పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది.

రాష్ట్రంలో భూసంస్కరణల చట్టం అమలువల్ల 3.6 లక్షల హెక్టార్ల భూమిని పేదలకుపంపిణీ చేసేందుకులభ్యమవుతుందని ఆ ప్రకటన తెలిపింది.

భూమిలేని పేదలకు పంపిణీ చేయబడిన భూములను బదిలీ చేయటానికి వీలులేకుండా చేయటం జరుగుతుందని ముఖ్యమంత్రి శ్రీ బహుగుణ తెలియజేశారు.

ఫ్రాంకో పరిస్థితి

మాడ్రిడ్, అక్టోబరు 29

స్పెయిన్ నియంత జనరల్ ఫ్రాంకో ఆరోగ్య పరిస్థితి మరింత విషమించిందని, ఆ రాత్రి ఆయనకు చికిత్స చేస్తున్న డాక్టర్లు తెలిపారు.

ఈజిప్టుకు అమెరికా గోధుమలు, పొగాకు

ఉభయదేశాలమధ్య ఒప్పందం

వాషింగ్టన్, అక్టోబరు 29

వచ్చే సంవత్సరం అమెరికా దాదాపు రు. 9 కోట్ల 80 లక్షల విలువగల గోధుమలు, గోధుమపిండి, పొగాకు ఈజిప్టుకు ఎగుమతి చేస్తుంది.

పై మేరకు నిన్న ఇక్కడ ఉభయదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఒప్పంద పత్రంపై అమెరికా విదేశాంగమంత్రి కిసింగర్, ఈజిప్టు విదేశాంగమంత్రి ఇస్మాయిల్ ఫామీ సంతకాలు చేశారు

ఒప్పందం మేరకు ఈజిప్టు వచ్చే 20 ఏళ్ళలోగా అమెరికా ధాన్యానికి పొగాకుకు డాలర్లలో డబ్బు చెల్లిస్తుంది.

జెనీవా సమావేశం పునరుద్ధరణకు యత్నాలు

జెనీవా శాంతిసమావేశాన్ని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవలసిందిగా అమెరికా, సోవియట్ యూనియన్‌లను అభ్యర్థించడానికి ఈజిప్టు నిర్ణయించినట్లు తెలుస్తున్నది.

అమెరికా అధ్యక్షుడు ఫోర్డుతో ఈజిప్టు అధ్యక్షుడు అన్వర్ సాదత్ నిన్న జరిపిన చర్చల సందర్భంగా పై విషయం తెలుస్తున్నదని ఏ పి. విలేకరి వ్రాస్తున్నారు

అన్నిపక్షాలు అంగీకరించినప్పటికీ జెనీవా సమావేశం తిరిగి జరపడానికి రెండు మూడు మాసాల వ్యవధి పట్టవచ్చునని దౌత్యవర్గాల అభిప్రాయం.

ఈ లోగా సినాయ్ రంగంనుంచి ఇజ్రాయిల్ సైన్యాల ఉపసంహరణకు కిసింగర్ ద్వారా ప్రయత్నించడానికి సాదత్ ఆశిస్తున్నట్లు ఏ. పి. విలేకరి కథనం

సమితి స్థాయిలో నిఘా కమిటీలు

కార్మిక మంత్రి వెల్లడి

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, అక్టోబరు 29

గ్రామీణ వ్యవసాయకార్మికుల ప్రయోజనార్థం 20 అంశాల కార్యక్రమం క్రింద తీసుకున్న కట్టుబానిస విధానం, గ్రామీణ ఋణాలపై మారటోరియం మొదలైన చర్యల అమలుకు సమితి స్థాయిలో నిఘా కమిటీలను ఏర్పాటు చేసే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తున్నదని కార్మికశాఖ మంత్రి శ్రీ టి. అంజయ్య నేడిక్కడ చెప్పారు.

కార్మికశాఖ అధికారుల సమావేశంలో ప్రసంగిస్తూ సమాజంలో వ్యవసాయ కార్మికవర్గం యింకా తీవ్రంగా దోపిడికి గురవుతున్నప్పుడుగానే వున్నారని వారికి సంబంధించిన కనీస వేతనాల అమలు ఇంకా ఆకాంక్షగానే మిగిలిపోయివున్నదని అన్నారు.

కార్మికుల అభివృద్ధికి చేసిన శాసనాలను సక్రమంగాను, పటిష్టవంతంగాను అమలు పరచనట్లయితే వుపయోగమేమీ వుండదన్నారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలను అమలుపరచటంలో యెక్కువ ప్రాధాన్యతను యివ్వవలసివున్నదని శ్రీ అంజయ్య నొక్కి చెప్పారు.

వ్యవసాయ కార్మికుల పని పరిస్థితుల మెరుగుకై చట్టంతీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తున్నది. అలాగే వ్యవసాయకార్మికుల సంక్షేమనిధిని ఏర్పాటుచేయాలని భావిస్తున్నది అని తెలిపారు

ఆర్థిక కార్యక్రమం క్రింద తీసుకున్న చర్యలను గట్టిగా అమలుపరచాలని అధికారులను శ్రీ అంజయ్య కోరారు

పరిశ్రమ యొక్క, కార్మికుల యొక్క సమస్యలను అర్థం చేసుకునేందుకుగాను పరిశ్రమవారీ చర్చలు జరుపుతామనిఅన్నారు. కార్మిక చట్టాలు సక్రమంగా అమలు పరిచేటట్లు చూసేందుకుగాను షాపు అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లకు, మోటార్ ట్రాన్స్‌పోర్టుకు, బీడి, సిగార్‌లకు కమిటీలను నియమించిందని శ్రీ అంజయ్య అన్నారు.

రు.2.45 కోట్లతో చాగల్లు మంచినీటి సరఫరా పథకం

పంచాయతీరాజ్ ఉత్సవాల సందర్భంగా నవంబరు 11న ముఖ్యమంత్రి చే శంకుస్థాపన

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, అక్టోబరు 29

రు. 2.45 కోట్ల వ్యయమయ్యే గోదావరిజిల్లా చాగల్లు మంచినీటి సరఫరా పథకానికి నవంబరు 11 వ తేదీన ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు శంకుస్థాపన చేస్తారు.

నవంబరు ఒకటవ తేదీ నుండి పందొమ్మిదవ తేదీవరకు జరిగే పంచాయతీరాజ్ రజతోత్సవాల సందర్భంగా చేపట్టే కార్యక్రమాలలో ఇది ఒకటని పంచాయతీ రాజ్ మంత్రి శ్రీ [illegible] లక్ష్మణదాసు నేడిక్కడ చెప్పారు

కర్నూలుజిల్లా నందికొట్కూరువద్ద 12 లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించే మంచినీటి సరఫరా పథకానికి కూడ ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని శ్రీ లక్ష్మణదాసు తెలియజేశారు.

హైదరాబాదు రవీంద్రభారతిలో నవంబరు 1 వ తేదీన ముఖ్యమంత్రి ఉత్సవాలను ప్రారంభిస్తారని, కేంద్ర మంత్రి శ్రీ రఘు రామయ్య అధ్యక్షత వహిస్తారని చెప్పారు. అఖిల భారత పంచాయతీరాజ్ ఉత్సవాల కమిటీ కన్వీనర్ శ్రీ జి. యస్. మూర్తి కూడ సమావేశంలో పాల్గొంటారని శ్రీ లక్ష్మణదాసు అన్నారు.

నవంబర్ 1-19 తేదీల మధ్య రాష్ట్రంలో పంచాయతీరాజ్ ఉత్సవాలు యీ క్రింది విధంగా వుండాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నవంబర్ ఒకటవ తేదీ గ్రామ స్థాయిలో ఉత్సవాల ప్రారంభం. ఉత్సవాలను ప్రారంభించేందుకు ప్రతి పంచాయతీని విలేజ్ డెవలప్ ఆఫీసర్లు, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు, బి. డి. వోలు, జిల్లా పంచాయతీ ఆఫీసర్లు, జిల్లా పరిషత్ల కార్యదర్శి వెళతారు.

నవంబరు 2-10 తేదీల మధ్య 20 అంశాల ఆర్థిక కార్యక్రమాన్ని వివరించేందుకు అన్ని పంచాయతీలు జనరల్ సమావేశాలను, గ్రామ సభలను ఏర్పాటు చేయాలి

ప్రతి గ్రామంలో ఎంతమంది ఇండ్లు, పొలం లేనివారు వున్నారో సమాచారాన్ని సేకరించాలి. భూమి లభించిన చోట దానిని పంపిణీ చేయాలి. గ్రామంలో మంచినీటి సరఫరా పథకం వున్నదా? అత్యవసర వస్తువుల పంపిణీ సక్రమంగా జరుగుతున్నదా? అనే సమాచారాన్ని కూడా సేకరించాలి.

నవంబర్ 10-14 తేదీలమధ్య శ్రమదానం కార్యక్రమాలను నిర్వహించటంద్వారా పిల్లల, విద్యార్థుల, యువకుల సమావేశాలను ఏర్పాటు చేయాలి.

నవంబర్ 15-19 తేదీల మధ్య మహిళా సంక్షేమ కార్యక్రమాలు, మహిళా మండలి సమావేశాల నిర్వహించటం, వారికి అత్యవసర వస్తువుల పంపిణీ బాధ్యతను అప్పగించటం.

నవంబర్ 19న : అన్ని పంచాయతీలలో ముగింపు ఉత్సవాలు, బాలనాడు. మహిళా మండలులను ప్రారంభించటం, అన్ని పాఠశాలలలో శ్రీమతి ఇందిరాగాంధీ ఫొటోల ఆవిష్కరణ.

భూగర్భ అణు ప్రేలుడు

బొంబాయి అక్టోబరు 29

తూర్పు కజక్ ప్రాంతంలో సోవియట్ యూనియన్ భూగర్భ అణు ప్రేలుడును నిర్వహించినట్లు బాబా అణు పరిశోధక కేంద్రం రికార్డు చేసింది

భారత కాలమాన ప్రకారం నేడుదయం 10 గంటల 17 నిమిషాలకు ఈ ప్రేలుడు నిర్వహించబడినట్లు ఈ కేంద్రం ప్రతినిధి ఒకరు చెప్పారు

ఆర్థిక కార్యక్రమం అమలులో డి.యం.కె. ప్రభుత్వ వైఫల్యం

అభిశంసన తీర్మానంపై చర్చ సందర్భంగా శాసనసభలో ప్రతిపక్షాల విమర్శ

మద్రాసు, అక్టోబరు 28

ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి ప్రకటించిన 20 అంశాల ఆర్థిక కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో అమలు చేయటంలో డి. యం. కె ప్రభుత్వం విఫలమయిందని నేడు తమిళనాడు శాసనసభలో ప్రతిపక్ష సభ్యులు తీవ్రంగా విమర్శించారు.

ఆర్థిక కార్యక్రమం అమలులో విఫలమైన డి. యం కె. ప్రభుత్వాన్ని అభిశంసించాలని కోరుతూ కాంగ్రెస్‌పార్టీ సభ్యులు శ్రీ ఎ. ఆర్. మారిముత్తు కమ్యూనిస్టుపార్టీ సభ్యులు శ్రీ కె. టి. కె తంగమణి ప్రతిపాదించిన తీర్మానంపై చర్చ సందర్భంగా సభ్యులు పై విధంగా విమర్శించారు. అక్టోబరు 28 న సభ ఈ తీర్మానంపై చర్చకు అనుమతి యిచ్చింది.

స్మగ్లర్లు, పన్ను ఎగవేతదార్లపై కేంద్రం సమర్థవంతమైన చర్యలు తీసుకున్నదని, అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి చర్యలు తీసుకోవటంలోవిఫలమైందని శ్రీ మారిముత్తు విమర్శించారు. నిత్య జీవితావసర వస్తువుల పంపిణీకి సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదని ఫలితంగా బలహీన వర్గాలవారు అనేక యిబ్బందులకు గురౌతున్నారని అన్నారు.

భూసంస్కరణలను సక్రమంగా అమలు చేయటంలేదు. బినామీ బదలాయింపులను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. మిగులు భూమి పంపిణీ సక్రమంగా జరగడంలేదని ఆయన విమర్శించారు.

రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో కట్టుబానిస పద్ధతి యింకా వుందని, హరిజనులు యీ దురాచారానికి బలైపోతున్నారని అన్నారు పరిస్థితి యీ విధంగా వుండగా, వెట్టిచాకిరి అనేది రాష్ట్రంలో లేదని ప్రభుత్వం చెపుతున్నదని అన్నారు,

శ్రీ తంగమణి

కమ్యూనిస్టుపార్టీ సభ్యులు శ్రీ తంగమణి ప్రసంగిస్తూ, అత్యవసర పరిస్థితి అనంతరం పార్లమెంటు ఆమోదించిన రాజ్యాంగ సవరణలను ధృవీకరించేందుకు శాసనసభను సమావేశపరచడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

20 అంశాల ఆర్థిక కార్యక్రమాన్ని గురించి డి. యం. కె ప్రభుత్వం చెప్పేదానికి, ఆచరణకు ఎంతో వ్యత్యాసం వుందని విమర్శించారు.

సెన్సార్‌షిప్ అధికారులు ఆమోదించిన వార్తలను ప్రచురించినపత్రికలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నదని అన్నారు.

భూసంస్కరణలను సమర్థవంతంగా అమలుచేయడంలో రాష్ట్రం విఫలమైందని విమర్శించారు భూసంస్కరణల విషయంలో కేంద్రం పంపిన ఆదేశక సూత్రాలను రాష్ట్ర ప్రభుత్వం అనుసరించడం లేదని అన్నారు.

అత్యవసర పరిస్థితి ప్రకటనను వినియోగించుకొని వ్యవసాయ కార్మికుల వేతనాలను పెంచేందుకు చర్యలు తీసుకోవడంలో కూడా ప్రభుత్వం విఫలమయిందని అన్నారు

అన్నా డి.యం.కె. సభ్యులు శ్రీ హాండే మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని గురించి మాట్లాడేహక్కు డి. యం. కె. ప్రభుత్వానికి లేదని అన్నారు. అత్యవసర పరిస్థితిని తొలుత విమర్శించిన డి. యం కె ప్రభుత్వం, అత్యవసర పరిస్థితిని, 20 అంశాల కార్యక్రమాన్ని ఉపయోగించుకొని తమను తాము రక్షించుకొనేందుకు తిరిగి అత్యవసర పరిస్థితిపట్ల తన వైఖరిని మార్చుకున్నదని అన్నారు.

క్రీడారంగం

శ్రీలంక క్రికెట్ జట్టు మద్రాసు రాక

మద్రాసు అక్టోబరు 28

అనురా తెన్నెకూన్ నాయకత్వాన 16 మంది సభ్యులుగల శ్రీలంక క్రికెట్ జట్టు కొలంబోనుండి నేటి మధ్యాహ్నం యిక్కడికి వచ్చింది.

3 అనధికార టెస్టులతోపాటుగా దేశంలో జరిగే 9 క్రికెట్ పోటీలలో యీ జట్టు ఆడుతుంది.

యీ నెల 31 న కాన్పూర్‌లో మొదలయ్యే 3 రోజుల పోటీలో సెంట్రల్ జోన్‌తో యీ జట్టు ప్రథమంగా ఆడటం ప్రారంభిస్తుంది.

హైదరాబాద్‌లో మొదటి అనధికారటెస్టు జరుగుతుంది.

మహిళా క్రీడోత్సవానికి ప్రారంభోత్సవం

హైదరాబాద్, అక్టోబరు 28

రాష్ట్రంలో అంతర్జాతీయ మహిళా సంవత్సరం సందర్భంగా ఏర్పాటుచేసిన మహిళా క్రీడోత్సవానికి వ్యాయామశాఖ స్టేట్ మంత్రి శ్రీమతి సరోజినిమహిషి నేడిక్కడ ప్రారంభోత్సవం చేశారు.

ఈ క్రీడోత్సవం నృత్య ప్రదర్శనలు, ఆటలతోను ప్రారంభమైంది.

నగరంలోని 48 స్కూళ్ళకు ప్రాతినిధ్యం వహించే దాదాపు 6 వేలమంది బాలికలు ఇందులో పాల్గొన్నారు

రాష్ట్ర రెవిన్యూమంత్రి శ్రీ పి. నరసారెడ్డి అధ్యక్షత క్రింద వెంకట్‌జీ స్మారక సంస్థ యీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నది.

బ్రిటిష్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ చే శిక్షణ

విజయవాడ, నవంబరు 28

బ్రిటిష్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ జి. హావెల్‌వెల్ విజయవాడ మున్సిపల్ స్టేడియంలో మూడురోజులపాటు వెయిట్ లిఫ్టర్స్‌కు శిక్షణను ఇవ్వనున్నారు.

నవంబరు 4 వ తేదీనుండి 6 వ తేదీ వరకు కృష్ణాజిల్లా క్రీడామండలి యీ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. శిక్షణ పొందదలచినవారు నవంబరు 4 వ తేదీ ఉదయం పదిగంటలలోగా స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి శ్రీ యం. సిహెచ్ పున్నయ్య చౌదరిని సంప్రదించాలి.

ఇతర పట్టణాలనుండి వచ్చేవారికి స్టేడియంలో ఉచితవసతి సౌకర్యం ఏర్పాటు చేయబడింది.

స్వచ్ఛందంగా గుప్త ఆదాయాన్ని తెలిపే వారికి అవకాశం

డిసెంబరు చివరివరకు పొడిగింపు

విజయవాడ, అక్టోబరు 2

గుప్తంగా వుంచిన ఆదాయాన్ని స్వచ్ఛందంగా వెంటనే వెల్లడించాలని, కనీసం డిసెంబరు 31వ తేదీలోగా తెలిపితే ప్రాసిక్యూషన్ వుండబోదని ఇన్‌కంటాక్సు కమిషనర్ ఒక పత్రికా ప్రకటనలో కోరారు.

గుప్త ఆదాయాన్ని స్వచ్ఛందంగా వెల్లడించినవారికి కొన్ని సదుపాయాలు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్సుపై ఎవరికైనా అనుమానాలు వుంటె ఆదాయపన్నుశాఖ అధికారులనుండి తెలుసుకొనవచ్చు

నిర్ణీత దరఖాస్తులను విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం, కాకినాడ, నెల్లూరుల లోని ఆదాయపుపన్ను అసిస్టెంట్ కమిషనర్ల నుండి గుంటూరు, రాజమండ్రిలలోని ఆదాయపు పన్ను అధికారులనుండి. హైదరాబాద్‌లోని ఆదాయం పన్ను కమీషనర్ల కార్యాలయంలోని పబ్లిక్ రిలేషన్సు ఆఫీసరునుండి పొందవచ్చు. ఈ పథకం క్రింద వచ్చేవారు, ప్రాసిక్యూషన్‌లు, పెనాల్టీల బాధను తప్పించుకోదలచినవారు ఆదాయపన్ను అధికారులను కలుసుకొనవలసిందిగా ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

దీపావళికి అదనంగా చక్కెర

హైదరాబాద్, అక్టోబరు 29

దీపావళి పండుగ సందర్భంగా అదనంగా చక్కెర సరఫరా చేయటం జరుగుతుందని జంట నగరాల రేషనింగ్ అధికారి తెలియజేశారు.

అదనపు పంచదారను నవంబరు 1-10 తేదీలమధ్య తీసుకోవచ్చును. తక్కువ ఆదాయం గ్రూపులవారి కార్డులవారికి ఒక కిలో యిస్తారు ఉన్నత ఆదాయం కార్డుల వారికి రెండు కిలోలిస్తారు.

విద్యార్థినుల ప్రతిన

ఉజ్జయిని, అక్టోబరు 28

మూడు రాష్ట్రాల విశ్వ విద్యాలయాలకు చెందిన 250 మంది విద్యార్థినులు కట్నం తీసుకొనే అబ్బాయిలను పెళ్ళాడరాదని నిన్న ఇక్కడ ప్రతినబూనారు.

ఇక్కడికి సమీపాన గల పాన్‌లాచి వద్ద జరుగుతున్న నేషనల్ సర్వీస్ క్యాంప్‌కు హాజరైవున్న ఈ విద్యార్థినులు మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్ విశ్వవిద్యాలయాలకు చెందినవారు. సాంఘిక దురాచారాల నిర్మూలనకు కృషిచేస్తామని కూడా వారు తెలియజేశారు.

విక్రమ్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు శ్రీ శివమంగళ్ సింగసుమన్ సాహసోపేతమైన ఈ చర్య తీసుకున్న విద్యార్థినులను అభినందించారు.

చెరకు ఉత్పత్తిదార్లకు మరింతగా సాయం

న్యూఢిల్లీ, అక్టోబరు 29

చెరకు ఉత్పత్తిదారులకు సహాయపడటంలో ఖండసారి పరిశ్రమ మరింతగా సహకరించాలని ఆర్థిక మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం నేడు కోరారు.

ఖండసారి పరిశ్రమపై 0 వ సాంకేతిక సదస్సును ప్రారంభిస్తూ ఆయన పై విధంగా అన్నారు.

వ్యవసాయ ప్రాతిపదికగాగల పరిశ్రమల అభివృద్ధి ఫలితాలను ప్రజలకు అందించటంలోనూ, వ్యవసాయాన్ని ఆధునీకరింపటంలోనూ ఖండసారి పరిశ్రమ ప్రముఖ పాత్రను నిర్వహించవలసి వుందన్నారు.

ఎక్సైజ్ డ్యూటీ తగ్గించాలని బ్యాంకుల ఋణవిధానాలను సడలింపజేయాలన్న డిమాండ్లను ప్రస్తావిస్తూ, ఈ డిమాండ్లు తనకు అసంతృప్తిని కలిగించాయని ఆయన అన్నారు.

అభివృద్ధి చెందిన సాంకేతిక విధానాలను వినియోగించి పరిశ్రమ సామర్థ్యాన్ని మెరుగుపరచాలని ఆయన కోరారు.

పరిశోధనలకు, అభివృద్ధికి, సాంకేతిక విధానాలను అభివృద్ధి పరచేందుకు పరిశ్రమ ప్రాధాన్యత నివ్వాలన్నారు

వెనుకబడినవారికి తగిన ప్రాతినిధ్యం

న్యూఢిల్లీ, అక్టోబర్ 29

నూతన ఆర్థిక కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు జరపాలంటే బలహీన వర్గాలకు తగినంత ప్రాతినిధ్యం కల్గించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీ వెనుకబడిన తరగతుల విభాగం ప్రధాన మంత్రిని కోరింది

పార్టీలోను, గ్రామీణ బ్యాంకుల వంటి స్వయం ప్రతిపత్తి సంస్థలలోను వెనుకబడిన తరగతులకు తగిన ప్రాతినిధ్యం యివ్వనట్లయితే ఆర్థిక కార్యక్రమం అమలులో వెనుకబడిన తరగతులపాల్గొనడం కష్టమని యిటీవల ప్రధానమంత్రికి సమర్పించిన మెమోరాండంలో పేర్కొనటం జరిగింది.

ఆర్థిక కార్యక్రమం అమలు మొదటి చర్యగా రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లను యితర స్వయం ప్రతిపత్తి సంస్థలను పునర్వ్యవస్థీకరించాలని మెమోరాండంలో కోరారు.

తూ. గో. జిల్లాలో నూతన కార్యక్రమం అమలు

మంత్రికి కమ్యూనిస్టు నాయకుల వివరణ

రాజమండ్రి, అక్టోబరు 25

ఇటీవల రాష్ట్ర రెవిన్యూమంత్రి శ్రీ నరసారెడ్డి ఇక్కడికి వచ్చిన సందర్భంగా జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ముళ్ళపూడి సూర్యనారాయణ, కార్మిక నాయకులు శ్రీ చిట్టూరి ప్రభాకరచౌదరి కలిసి తూర్పుగోదావరి జిల్లాలో ఇరవై సూత్రాల కార్యక్రమం అమలు జరిగే తీరును వివరించారు.

రాజమండ్రి తా॥ కోరుకొండ ప్రాంతంలో స్వంత భూస్వాములనుండి బంజర్లు ఆక్రమించిన వారినుండి బంజరు స్వాధీనం చేసుకోవడం హర్షదాయకమేనని, కాని శ్రీరంగపట్నంలో ఏమీ భూమిలేని శ్రీ అడారి తాతబ్బాయి చిరకాలంగా సాగుచేసుకుంటూ, ప్రస్తుతం పంటతోవున్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం లాంటి అన్యాయాలు జరగకుండా ప్రభుత్వం ఆదేశాలివ్వాలని కోరారు

రాజోలు తాలూకా అంతర్వేదిలోని 500 యకరాల బంజరు భూమి విషయం మంత్రి దృష్టికి తీసుకురాగా కొత్తగా కో-ఆపరేటివ్ సొసైటీఏర్పాటుచేసి తద్వారా ఆర్థిక సహకారం ఇచ్చి ఆ బంజర్లనుసాగులోకి తెచ్చే ఏర్పాట్లుచేస్తామని చెప్పారు.

ఆలమూరు తాలూకాలో ఎడిదమొదలైన గ్రామాలలో రైతాంగానికి ఏమీ అడ్డులేక పేదలు ఆక్రమించిన పోరంబోకులను పంపకం చేయడంలో భూస్వామిక శక్తుల అడ్డువల్ల జాప్యం జరుగుతోందని అలాంటి కేసులలో న్యాయం కలుగచేయాలని కోరారు.

షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు ప్రభుత్వం ఇస్తున్న సహకారం హర్షదాయకమేనని, కాని ఇతర కులాలలోని పేదలు ఇండ్లస్థలాలు తదితర విషయాలలో న్యాయం చేయాలని కోరుతున్నారని ఈ విషయంపట్ల కూడా ప్రభుత్వం తగు న్యాయంచేయాలని కూడా శ్రీసూర్యనారాయణ, ప్రభాకరచౌదరి మంత్రికి విజ్ఞప్తి చేశారు. (వి వి,)

20 వేల డిక్లరేషన్లు

మంత్రి నరసారెడ్డి వెల్లడి

రాజమండ్రి, అక్టోబరు 25

తూర్పుగోదావరిజిల్లాలో భూసంస్కరణల చట్టం క్రింద 20 వేల డిక్లరేషన్లు దాఖలయ్యాయని, అందులో 5 వేల డిక్లరేషన్లలో తప్పుడు సమాచారం యివ్వబడినట్లు కనుగొనబడిందని రెవిన్యూమంత్రి శ్రీ పి. నరసారెడ్డి యిటీవల ఇక్కడ తెలియచేశారు.

ఇంతవరకు వేయి మందికి నోటీసులు ఇవ్వబడ్డాయని కూడా ఆయన చెప్పారు

భూసంస్కరణల అమలుకు సంబంధించి ఆయన అధికారులతో చర్చలు జరిపారు.

రాష్ట్ర వ్యాపితంగా జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వబడతాయని, అయితే ముఖ్య జిల్లా కేంద్రాల్లో పనిచేసేవారికి ఇవ్వడం జరుగుతుందని ఆయన చెప్పారు.

కళాదర్బారు ఆధ్వర్యంలో సాహిత్య గోష్ఠి

స్థానిక కళాదర్బారు ఆధ్వర్యంలో భువనవిజయంపై సాహిత్యగోష్ఠి యిటీవల యిక్కడ జరిగింది

కళాదర్బార్ స్థాపకులు శ్రీ అప్పారావు స్వాగతం చెప్పారు

శ్రీయుతులు బి. వి. ఎస్. శాస్త్రి కొత్తపల్లి శ్రీమన్నారాయణ, ప్రభాకర, సత్యబాబు సన్నిధాన నరసింహశర్మ, గంగరాజు ప్రభృతులు స్వీయ కవితలు చదివారు.

భువన విజయాన్ని శ్రీ పి. బి వీరాచార్యులు, శ్రీ మోపాడ నిర్వహించారు

ఇందులో రాజరాజుగా శ్రీ మహతి, నన్నయగా శ్రీ శాస్త్రి శ్రీనాధుడుగా శ్రీ కందుమూర్తి శ్రీపాదగా శ్రీ భువనమూర్తి కందుకూరి వీరేశలింగం పంతులుగా శ్రీ పి. బి వీరాచార్యులు వ్యవహరించారు

హొటల్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు

రామచంద్రపురంలో

రామచంద్రపురం, అక్టోబరు 25

ఇటీవల రామచంద్రపురంలో కొత్తగా పట్టణ హోటల్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటయింది.

పట్టణ కమ్యూనిస్టుపార్టీ ఆఫీసులో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు కొత్తగా యూనియన్ ఏర్పాటు చేశారు

శ్రీ వెంకటేశ్వరరావును యూనియన్ అధ్యక్షులుగా, శ్రీ పి నారాయణరావు ఉపాధ్యక్షులుగా సత్యనారాయణను కార్యదర్శిగా శ్రీ కె ప్రకాశ్‌ను సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

మరో ముగ్గురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

పెద్దాపురంలో సబ్ కోర్టుకు ప్రయత్నాలు

పెద్దాపురం, అక్టోబరు 25

పెద్దాపురంలో సబ్‌కోర్టు స్థాపించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి

శ్రీయుతులు మంగిపూడి సూర్యారావు యిటీవల యీ విషయంపై గవర్నర్ శ్రీ ఓబుల్‌రెడ్డికి విజ్ఞప్తి చేయగా జిల్లా జడ్జి పెద్దాపురంవచ్చి స్థలం. వసతి వగైరాల అంశాలను పరిశీలించారు.

ప్రత్తిపాడు, తుని, ఏలవరం, పెద్దాపురం ఈ నాలుగు తాలూకాలకు డివిజన్ కేంద్రంగా ఉంటున్న పెద్దాపురంలో సబ్‌కోర్టులేనందువల్ల యీప్రాంతప్రజలకు చాలా ఇబ్బందిగా వున్నది.

(వి వి)

కోనసీమలో ఎక్సైజు అధికార్ల దాడులు

అంబాజీపేట అక్టోబరు 26

తూర్పుగోదావరిజిల్లా రాజోలుగ్రామంలో ఇటీవల కొత్తపేటకు చెందిన సెంట్రల్ ఎక్సైజు అధికారులు అకస్మికంగా దాడి జరిపి రాజోలు బంగారపు పనివారల సంఘ అధ్యక్షులు శ్రీ బి రామమూర్తి ఇంటో లెక్కలో చూపని బంగారపు వస్తువులు సుమారు రు 2000/- కిమ్మత్తుగలవి స్వాధీన పర్చుకున్నారు.

కొత్తపేటకు చెందిన శ్రీ పి. హెచ్. పాపయ్యలను అతనిఇంటిలో రు 200/-లు కిమ్మత్తుగల బంగారపు ముద్ద లెక్కలో చూపని బాపతు రొక్కం రు. 20,400/-లు స్వాధీన పర్చుకున్నారు

రాజోలు తాలూకా అంకలగన్నవరం గ్రామంలో సుమారు రు. 2200/. లు విలువగల పొగాకు స్వాధీన పర్చుకుని సదరుయజమాని శ్రీ మేడిశెట్టి చక్రవర్తిపై కేసు పెట్టారు

ఈ పై దాడులకు కొత్తపేట సెంట్రల్ ఎక్సైజు డిపార్టుమెంటు సూపరింటెండెంటు శ్రీ కె. వి హమీద్‌ఖాన్ అధ్వర్యములో ఇనస్పెక్టర్లు శ్రీ సి శ్రీహరిరావు శ్రీ డి. వి ఎల్. ఎన్ మూర్తి, శ్రీ రామారావు, శ్రీ నాగేశ్వరరావు, శ్రీ సత్యనారాయణ, శ్రీ జె. ఇబ్రాహిం సహకరించారు.

గౌతమీ గ్రంథాలయ పాలకవర్గ సమావేశం

రాజమండ్రి అక్టోబరు 25

గౌతమీ గ్రంథాలయ పాలకవర్గం ఇటీవల శ్రీ నార్ని కేదారేశ్వరుడు అధ్యక్షతను సమావేశమై గురుకులం వ్యవస్థాపకులు, శాసనమండలిసభ్యులు శ్రీ శిష్ట్లా బుల్లియ్యను గౌతమీ గ్రంథాలయ నూతన భవన నిర్మాణ కమిటీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకొంది.

శ్రీయుతులు నార్ని కేదారేశ్వరుడు, మహీధర జగన్మోహనరావు బులుసు సీతారామశాస్త్రి ఎం సుందరం ప్రభృతులు ఈ కమిటీలో సభ్యులుగా వుంటారు. మరి కొందరు కమిటీ సభ్యులను ఎన్నుకునే అధికారం శ్రీ బుల్లియ్యకియిస్తూ తీర్మానించారు

శ్రీ నార్ని కేదారేశ్వరుడు గత వర్ష సభ్య సమావేశంలో గౌతమీ గ్రంథాలయ భవన నిర్మాణానికి ప్రకటించిన విరాళం 10 000 లు నూతన భవనం పునాదులు ఎడిన వెంటనే యిస్తానని ప్రకటించారు.

(వి. వి.)

రిక్షా వర్కర్స్ యూనియన్ పునర్నిర్మాణం

ఖమ్మంలో

ఖమ్మం, అక్టోబరు 25

ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీ వున్న సందర్భంలో ఎంతో బలంగావున్న ఖమ్మం రిక్షావర్కర్సు యూనియన్ పార్టీలో చీలిక ఏర్పడిన తరువాత కొంతకాలంపాటు మార్క్సిస్టుపార్టీ అధ్వర్యాన పనిచేసినప్పటికీ, ఆ వర్గ నాయకత్వం రిక్షా కార్మికుల ఎడ స్థితుల యెడల అవలంబించిన నిర్లక్ష్యం వలన సంఘంలో అనేక చీలికలు ఏర్పడి యూనియన్ యావత్తూ నిర్వీర్యమైపోయింది

రిక్షాకార్మికులంతా పునరాలోచించి స్థానిక కమ్యూనిస్టుపార్టీ నాయకులతో సంప్రదించి తమ యూనియన్ను పునర్నిర్మాణం గావించవలసిందిగా కోరారు

అదే సందర్భంలో ఇటీవల పట్టణంలో గొప్ప ప్రదర్శన జరిపి వారికోర్కెలను వెల్లడించారు.

నూతన కమిటీ

పట్టణంలోని వివిధ వర్గాలకు చెందిన రిక్షా డ్రైవర్లు యీ నెల 17 వ తేదినాడు రిక్షా వర్కర్సు యూనియన్ స్థాపకుల్లో ఒకరైన శ్రీ తిక్కవరపు అప్పయ్య అధ్యక్షతన "మార్క్స్ భవన్" లో సమావేశమయ్యారు. పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ యం సంగయ్య రాజకీయ పరిస్థితి పైన ప్రధాని ప్రకటించిన ఆర్థిక కార్యక్రమంపైన వివరిస్తూ, పట్టణంలో వున్న రిక్షా కార్మికులంతా సంఘటితంగా వుండి తమ యూనియన్ను బలపర్చుకోవాల్సిన ఆవశ్యకతను గురించి వివరించారు.

ఈ దిగువవారితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శ్రీ యం. సంగయ్య, ఉపాధ్యక్షులుగా శ్రీ పి. ముత్తయ్య, శ్రీ కుక్కల వెంకయ్య, కార్యదర్శిగా శ్రీ నూకబోయిన మల్లయ్య సహాయ కార్యదర్శిగా శ్రీ మంద వెంకటేశ్వర్లు కోశాధికారిగా శ్రీ తిప్పర్తి సత్యం ఆర్గనైజరుగా శ్రీ బి బాబాతోపాటుగా 19 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు

పట్టణ ముఠా కార్మిక సంఘం

ఖమ్మం పట్టణానికిచెందిన కలపడిపో, నాపరాళ్ళు, బెంగుళూరు పెంకు, బొగ్గుముఠా, కిరాణ లారీల దిగుమతి - ఎగుమతికి చెందిన ముఠా కార్మికులంతా ఇటీవల "మార్క్స్ భవన్" లో శ్రీ గుంపు భిక్షం అధ్యక్షతన ప్రత్యేక సదస్సు జరుపుకొని శ్రీ యం నాగయ్య అధ్యక్షులుగాను, ఉపాధ్యక్షులుగా శ్రీ చింతపల్లి రాములు, శ్రీ కొడిరెక్కల భిక్షం, కార్యదర్శిగా శ్రీ టి యల్లయ్య సహాయ కార్యదర్శిగా శ్రీ పిడమర్తి రాములు, కోశాధికారిగా, శ్రీ యలకమిదారుతో పాటుగా 20 మందితో నూతన కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు ఈ సంఘాన్ని ఎ ఐ టి. యు సికి అనుబంధించాలని తీర్మానించారు.

(వి వి)

కొవ్వాడ కాల్వకు రిజర్వాయర్

పోలవరం తాలూకా రైతుసంఘ కార్యకర్తల మహాసభ తీర్మానం

కొయ్యలగూడెం, అక్టోబరు 27

పోలవరం తాలూకా కొయ్యలగూడెంలో 460 మంది తాలూకా రైతు సంఘ కార్యకర్తలు వివిధ గ్రామాలనుండి ఈ నెల మూడవ వారంలో సమావేశమై ఏజెన్సీ రైతుల సమస్యలను - వ్యావసాయిక భూములకు కావలసిన నీటి వనరులను, వెంటనే ప్రారంభించాల్సిన కార్యక్రమాలను గూర్చి చర్చించారు. శ్రీ సంకు పెద్దిరాజు సమావేశాన్ని నిర్వహించారు ప్రదేశ్ రైతు నాయకులు శ్రీ సంకు అప్పారావు ఏజన్సీ రైతులను గిరిజనులను పీడిస్తూవున్న సమస్యలను వివరించి నూతన ఆర్థిక కార్యక్రమ నిర్వహణలో గిరిజనులు సంపూర్ణంగా నిమగ్నులు కావాలన్నారు.

ఇరవై ఏడు గ్రామాలకు చెందిన ఇరవై అయిదువేల ఎకరాల భూమికి నీటివసతులు గ్యారంటీగా ఎప్పుడి ఎండలు ఎండే ఉపాధి అవకాశాలు కల్పిస్తూవున్న కొవ్వాడ కాలువకు రిజర్వాయర్, కడెమ్మ పంపింగ్ పథకం వెంటనే చేబట్టి అమలు జరపాలని నీటి ఉపయోగాన్ని గురించి అదిలోనే మంత్రులు కీర్తిశేషులైన అల్లూరి, సంజీవయ్యలు శంకుస్థాపన జరిపించారని, ప్రధాని ఆర్థిక కార్యక్రమాన్ని అనుసరించి పంచాయతీరాజ్ రజతోత్సవ కానుకగా గిరిజన ప్రజలకు ఈ పథకాలను బహూకరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ మహాసభ తీర్మానించింది.

పోలవరం తాలూకాలో గల ఏరూ వాగులూ వర్షాకాలంలో పొంగి రోడ్లపైకి పొర్లి గండ్లుపెట్టి ప్రతిసంవత్సరం ప్రయాణ సౌకర్యాలను విచ్ఛిన్నంచేసి ప్రజానీకానికి ఇబ్బంది కలుగజేస్తూవుంది గాన ప్రభుత్వం ఈ విషయంపై వెంటనే చర్య తీసుకోవాలని, ఏలూరు గూడెం, నిడదవోలు వెళ్ళాల్సిన బస్సులు నిరాటకంగా పోవడానికై అవసరమయినచోట్ల వంతెనలు నిర్మించాలని తీర్మానించింది.

(వి. వి.)

పెండ్లి కానుక

నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేట తాలూకా తాడిమేడు గ్రామం అనపల్లి వెంకట సుబ్బయ్య కుమారుడు అనపల్లి సుందరరాజా చంద్రమ్మల వివాహ సందర్భంగా కమ్యూనిస్టుపార్టీకి కానుకగా రు 10/- లు ఇవ్వడం జరిగింది వివాహం ఈ నెల 15 వ తేదీ ఉదయం జరిగింది.

పాలకొల్లులో నాటిక పోటీలు

పాలకొల్లు, అక్టోబరు 25

స్థానిక శ్రీరామపేట ఫ్రెండ్స్ యూనియన్ అధ్వర్యంలో యిటీవల యిక్కడ నాటిక పోటీలు జరిగాయి.

ఈ సందర్భంగా జరిగిన సభకు శ్రీ బొండాడ వెంకట్రాజు గుప్త అధ్యక్షత వహించారు. యూనియన్ తరఫున శ్రీ ఆది కృష్ణనాగేశ్వరరావు స్వాగతం పలికారు

ప్రముఖ సినీ-నాటక రచయిత శ్రీ ఆదివిష్ణును, శ్రీ బి వి. రాధామణి గుప్త నూతన వస్త్రాలు బహూకరించి సన్మానించారు.

అ తరువాత "అంతా యింతే", "ఆశాజీవి". "తెర వెనుక", "ఆత్మలు - అంతరాలు" నాటికలు ప్రదర్శించారు

రెండో రోజున "విజం నిద్రపోదు", "పెండింగ్ ఫైలు", "కరుణించిన విధి", "త్రివేణి" నాటికలు ప్రదర్శింపబడ్డాయి

మూడో రోజున "చీకటి తెరలు", "దేవుడున్నాడు", "లోగుట్టు" "ఆగండి-ఆలోచించండి" నాటికలు ప్రదర్శించారు.

బహుమతి ప్రదానోత్సవానికి శాసన సభ్యులు శ్రీ చేగొండి హరిరామజోగయ్య అధ్యక్షత వహించారు సినీ నటులు శ్రీ రవికాంత బహుమతులు పంచిపెట్టారు.

ఉత్తమ నాటిక 'తెరవెనుక' ద్వితీయ నాటిక 'పెండింగ్ ఫైలు' ఉత్తమ దర్శకత్వం 'తెరవెనుక', ఉత్తమ రచన, ఉత్తమనటి, ఉత్తమ హాస్యనటులకు బహుమతులు లభించాయి.

పలు ప్రాజెక్టుల పూర్తికి డిమాండ్

చింతలపూడి, అక్టోబరు 27

భారత సోవియట్-సాంస్కృతికసంఘం, శాంతి సంఘీభావ సంఘాల విస్తృత సమావేశం శ్రీ ముల్లంగి రామకృష్ణా రెడ్డి అధ్యక్షతన జరిగింది. చింతలపూడితాలూకా ప్రజలను పీడిస్తున్న సమస్యలను పరిష్కారమార్గాలను విపులంగా చర్చించారు.

సమితి అధ్యక్షులు శ్రీ మందలపు సత్యనారాయణ, జిల్లారైతు నాయకులు శ్రీ కారుమూడి సత్యనారాయణ, ఇస్కస్ ఉపాధ్యక్షులు శ్రీ గారపాటి సత్యనారాయణ ధర్మాజిగూడెం సర్పంచి శ్రీ గారపాటి వెంకటేశ్వరరావు. పట్టణ కమ్యూనిస్టు నాయకులు శ్రీ కంచెన కాశీవిశ్వనాథరావు, గద్దా నరశింహమూర్తి ఇంకా ఇతర అహ్వానితులు తమ తమ రాజకీయపార్టీల ప్రమేయం లేకుండా తాలూకా ప్రజల జీవన పరిస్థితిని, వ్యవసాయం, చెరువు మరమ్మతు, తాలూకా అభివృద్ధి మండలి ఏర్పాటు, ఆర్. టి. సి. బస్సుల వగైరా సమస్యలను చర్చించారు

నూతన ఆర్థిక కార్యక్రమం అమలు జరిగేందుకు ప్రజా సమీకరణ- అధికారుల సహకారం, కార్యక్రమంలో ప్రజలు దీక్షతో పాల్గొనేందుకై తగిన ఉత్సాహ ప్రోత్సాహాలను కల్పించడానికి నియమితులైన మంత్రి శ్రీ మండలి నవంబరు 4 తేదీన చింతలపూడి వచ్చినపుడు కాంగ్రెస్-కమ్యూనిస్టు తదితర సంఘాలు ఆయనకు కలిసి, తాలూకాకు అత్యావసరమైన ప్రాజెక్టులను వారి దృష్టికి ప్రభుత్వ దృష్టికి తెచ్చి వాటిని అనతికాలంలో పూర్తి చేయించుకోవాలనే ఆకాంక్షను తెలుపుతూ తీర్మానించారు. (వి వి)

విజయవంతంగా కరీంనగర్ జిల్లా ఫాసిస్టు వ్యతిరేక మహాసభ

2 వేలమందితో ప్రదర్శన, 5 వేలమందితో బహిరంగసభ

హైదరాబాదు, అక్టోబరు 28

కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీల అధ్వర్యాన కరీంనగర్ జిల్లా ఫాసిస్టు వ్యతిరేక మహాసభ ఈనెల 26 వ తేదీన ఇక్కడ విజయవంతంగా జరిగింది

మహాసభ ముగింపు అనంతరం 20 అంశాల ఆర్థిక కార్యక్రమానికి తోడ్పాటుగా 2 వేల మందితో ప్రదర్శన, 5 వేల మందితో బహిరంగసభ జరిగింది.

ఫాసిస్టు వ్యతిరేక మహాసభ సందర్భంగా జిల్లా పరిషత్ హాలులో శ్రీ యం. హన్మంతరావు అధ్యక్షతన భారత్-సోవియట్ మైత్రీ సంఘ సమావేశం జరిగింది

ఈ కార్యక్రమాలలో వ్యవసాయ మంత్రి శ్రీ జె చొక్కారావు ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ రాజమల్లు కమ్యూనిస్టు నాయకులు డాక్టర్ రాజబహదూర్ గౌడ్, శ్రీ బద్దం ఎల్లారెడ్డి సి హెచ్ రాజేశ్వరరావు ప్రభృతులు పాల్గొన్నారు

మహాసభ అనంతరం జరిగిన బహిరంగ సభకు ఉదయం చాలాసేపు వర్షం కురిసినప్పటికి చుట్టు పక్కల గ్రామాల నుండి వ్యవసాయ కార్మికులు, రైతులు వచ్చి పాల్గొన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు వూరేగింపు మున్సిపల్ ట్రావెలర్స్ బంగళా నుండి బయలుదేరి జగిత్యాల రోడ్డు మీదుగా జిల్లా పరిషత్ హాలు ప్రక్కనున్న ఆవరణకు చేరుకున్నది. వూరేగింపులో కాంగ్రెసు. కమ్యూనిస్టుపార్టీల జెండాలతోను ఫాసిస్టు వ్యతిరేక నినాదాల ప్లేకార్డులతో ప్రదర్శనలో రెండు పార్టీల అనుయాయులు పాల్గొన్నారు,

ఫాసిస్టు వ్యతిరేక మహాసభకు జిల్లా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ సి. ప్రభాకర్ శ్రీ బద్దం ఎల్లారెడ్డి, జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ యం. సత్యనారాయణరావులు ప్రెసిడియంగా వ్యవహరించారు

మహాసభ ఆహ్వానసంఘం అధ్యక్షులు శ్రీ యం గోపాలరావు స్వాగతోపన్యాసంలో ఫాసిస్టు శక్తుల కుట్రలను వివరించారు

మహాసభను మంత్రి శ్రీ చొక్కారావు ప్రారంభిస్తూ భూసంస్కరణలు అమలు జరిపి మిగులు భూములను పేదలకు ప్రభుత్వం పంచి పెడుతుందని చెప్పారు.

మిగులు భూములను హరిజనులు, గిరిజనులకేగాక ఆర్థికంగా వెనుకబడిన వారికి కూడ యివ్వడం జరుగుతుందన్నారు

డాక్టర్ రాజ్ బహదూర్ గౌడ్ మాట్లాడుతూ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా సకల ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా పోరాడాలని పిలుపిచ్చారు

పార్లమెంట్ సభ్యులు యం. సత్యనారాయణ తమ ప్రసంగంలో ఆర్థికకార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు

ప్రదేశ్ రైతు సంఘ కార్యదర్శి శ్రీ సి. హెచ్. రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను నిరంకుశ అధికారుల దయా దాక్షిణ్యాలపై వదిలిపెట్టక అమలుపరిచేందుకు ప్రజలు చొరవ తీసుకోవాలని అన్నారు

తాలూకా రైతు సంఘ కన్వీనర్ శ్రీ దేశిని మల్లయ్య మాట్లాడుతూ భూస్వాములు ఆక్రమించుకున్న బంజరు భూములను పేదలకు పంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

పట్టణ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ సిద్ధాం వందన సమర్పణతో సభ ముగిసింది. హైదరాబాద్ ప్రజానాట్యమండలి కళాకారులు గేయాలు పాడారు.

ఇస్కస్ ఏర్పాటు

ఉదయం జరిగిన భారత - సోవియట్ మైత్రీసంఘ సమావేశానంతరం శ్రీ గన్నేరువరం మధుసూధనరావు కన్వీనరుగా, శ్రీ యం హన్మంతరావు అధ్యక్షులుగా, శ్రీ జగన్మోహనరావు ఉపాధ్యక్షులుగా, శ్రీ చారీ, శ్రీ వి కొండలరావు, శ్రీ యడ్ల మల్లయ్య శ్రీ దయానంద్, ఆశీర్వాదం తదితరులతో జిల్లాకమిటీని ఏర్పాటు చేశారు.

సమావేశంలో భారత్ - సోవియట్ మైత్రీ ప్రాధాన్యతను వివరిస్తూ శ్రీ గన్నేరువరం మధుసూధనరావు ప్రసంగించారు.

మంత్రి శ్రీ రాజమల్లు మాట్లాడుతూ కాంగ్రెసువారు - కమ్యూనిస్టులతో కలుస్తున్నారని చెప్పే మాటలు ఫాసిస్టులు చెప్పే మాటలని అన్నారు సామ్రాజ్యవాదులు భారతదేశాన్ని తమ చెప్పుచేతల్లో వుంచుకునేందుకు ప్రయత్నిస్తారని విమర్శించారు సోవియట్ యూనియన్ బలమైన దేశంగా రూపొందినందున సామ్రాజ్యవాదుల ఆటలు యింకెంతమాత్రం సాగవని శ్రీ చొక్కారావు అన్నారు.

ఇస్కస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీమతి డాక్టర్ పద్మావతిశాస్త్రి మాట్లాడుతూ మైత్రీ సంఘం ఆశయాలను ప్రజలలోకి తీసుకుపోవాలన్నారు.

పార్లమెంట్ సభ్యులు శ్రీ యం సత్యనారాయణ సోవియట్ సహాయమే లేనట్లయితే కాశ్మీర్ దక్కేది కాదన్నారు.

డాక్టర్ రాజబహదూర్ గౌడ్ సోవియట్ సహాయం యొక్క ప్రాధాన్యతను వివరించారు.

కమలాపురం చేనేత సహకారసంఘ వార్షికోత్సవం

హుజూరాబాదు, అక్టోబరు 25

హుజూరాబాద్ పంచాయతి సమితి అధ్యక్షులు శ్రీ కేతిరి సాయిరెడ్డి కమలాపురం చేనేత సహకార సంఘం 16 వ వార్షిక సభలో ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ, చేనేత సహకార సంఘంలో తగిన నాయకత్వము గ్రామాల్లో నుండి రావాలని వారు ప్రజల వానియతిని సంపూర్ణంగా పొందాలని సూచించారు. గ్రామాల్లో ఏర్పడిన కలుషిత వాతావరణాన్ని మార్చడానికి యువకులు ముందుకు రావాలని అన్నారు

సంఘం అధ్యక్షులు శ్రీ చేరాల సత్యనారాయణ సభకు అధ్యక్షత వహించినారు సభలో శ్రీ పి ఉపేందర్‌రావు, శ్రీ మార్గం వెంకటరాజు ప్రసంగించారు కార్యదర్శి శ్రీ ఉపేందర్ నివేదికను సమర్పించినారు

ఉదయం సమితి అధ్యక్షులు శ్రీ సాయిరెడ్డి పతాకావిష్కరణ గావించినారు

సభలో ఇందిరాగాంధి ప్రకటించిన 20 ఆర్థిక సూత్రముల కార్యక్రమాన్ని బలపరుస్తూ యింకా అనేక తీర్మానాలను ఆమోదించినారు.

శ్రీ ఆదెపు ఉపేందర్ కృతజ్ఞతలతో సభ ముగిసినది

హుజూరాబాదులో మహాత్మాగాంధి సూపర్ బజార్ కార్యవర్గ ఎంపిక

కరీంనగర్ జిల్లాకలెక్టర్ శ్రీ యం వి. నటరాజన్ హుజూరాబాదులో మహాత్మా గాంధి సూపర్ బజార్‌కు యీ క్రిందివారిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేసినారు

అధ్యక్షులు శ్రీ పి రామారావు తహశీల్దారు హుజూరాబాదు ఉపాధ్యక్షులు శ్రీ ఎ కె. విశ్వనాధరెడ్డి రూరల్ బ్యాంకు అధ్యక్షులు ముఖ్యసభ్యులు.

మరో 13 మందిని డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు.

అతివృష్టివల్ల నల్గొండజిల్లాలో 'పంటలకు అపార నష్టం

నల్గొండ, అక్టోబరు 2

నల్గొండ జిల్లాలో గత రెండు నెలలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ఫలితంగా అనేకవేల ఎకరాలలో వాణిజ్య పంటలైన వేరుశెనగ, మిర్చి, పత్తి, ఆముదపు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి

వాణిజ్య పంటలకు జీవపట్టి ఎర్రబారి పంట పూర్తిగా దెబ్బతిన్నది.

ప్రధాన ఆహార పంట అయిన వరి కంకిపోసే దిగుబడి సగంకూడా వుండకపోయే పరిస్థితి ఏర్పడింది జిల్లాలోని నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతమిర్యాలగూడెం, హుజూర్‌నగర్ తాలూకాలు దేవరకొండ తాలూకాలోని దెండి పెండ్లిపాకల, భీమనపల్లి ప్రాజెక్టుల క్రింద సాగయిన లక్షలాది ఎకరాల వరి పంటకు పొట్టముంపులో వడ్లు పురుగు తగిలింది

ఈ విషయమై ప్రభుత్వం వెంటనే కదిలి తగు సహాయచర్యలు తీసుకోవాలని జిల్లా రైతుసంఘం అధ్యక్షులు శ్రీ పల్లా పర్వతరెడ్డి, జిల్లా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శాసన సభ్యులు శ్రీ బి. రామశర్మ ఒక ప్రకటనలో కోరారు.

వాణిజ్య పంటలకు నష్టం కలిగినందున శిస్తు, వాణిజ్య పంటల సెస్సుల రెమిషన్ యివ్వాలని వారు కోరారు.

వరి పంటలకు పట్టిన తెగుళ్ళను నివారించేందుకుగాను, అవసరమైన క్రిమి సంహారక మందులు, స్ప్రేయర్లు సబ్సిడీపై రైతాంగానికి సమకూర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పంటలకుసంబంధించిన నష్టాలవివరాలను రైతు సంఘం కార్యకర్తలు తక్షణమే అధికార్ల దృష్టికి తీసుకురావాలని కోరారు.

లైబ్రరీ సైన్స్ ట్రెయినింగ్ కోర్సు

హైదరాబాదు అక్టోబరు 25

నవంబరు 14 నుంచి హైదరాబాదులో లైబ్రరీ సైన్స్ ట్రెయినింగ్ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించడానికి నిర్ణయించారు

లైబ్రరీ సైన్స్ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ కోర్సును నిర్వహిస్తారు.

సాయంత్రం 6 నుంచి 8 గంటలవరకు తరగతులు జరుగుతాయి

అడ్మిషన్లకు అఖరు గడువు నవంబరు 6 వ తేదీ

అబిడ్ రోడ్డులోని గవర్నమెంట్ బాయ్స్ హైస్కూలు (చవర్‌హాట్ నెం. 1) లో ప్రవేశ పత్రాలు పొందవచ్చునని ఒక ప్రకటనలో తెలిపారు.

పోరంబోకు భూముల పంపిణీకి చర్యలు

రెవెన్యూ మంత్రికి వ్యవసాయ కార్మిక సంఘం విజ్ఞప్తి

హైదరాబాదు, అక్టోబరు 28

పోరంబోకు భూముల పంపిణీకి సంబంధించి పంచాయతీరాజ్ చట్టాన్ని సవరిస్తూ ఆర్డినెన్సు తీసుకు రావాలని, అలాగా భూముల కేటాయింపు కొనసాగించేందుకు రెవిన్యూబోర్డు ఉత్తర్వులు ఉపసంహరించేయాలని ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధివర్గం రెవెన్యూ మంత్రి శ్రీ నరసారెడ్డిని కోరింది

ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు శ్రీ జి యలమందారెడ్డి ప్రధాన కార్యదర్శి శ్రీ కొండ్రు సుబ్బారావు కార్యదర్శులు శ్రీ భూపతి వెంకటనర్సయ్య, శ్రీ కొండపల్లి గోపాలరావులు మొన్న రెవెన్యూ మంత్రిని కలుసుకుని యీ మెమొరాండం సమర్పించారు

ప్రతినిధివర్గం యీ సమస్యపై సమర్పించిన మెమొరాండాన్ని స్వీకరిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ మంత్రి హామీ నిచ్చారు.

న్యాయశాస్త్రసంబంధమైన అడ్డంకులు తొలగించేవరకు గ్రామ పంచాయతీల క్రింద గల పోరంబోకు భూముల పంపిణీని నిలుపు చేయాలని ఇటీవల జిల్లాకలెక్టర్లను రెవిన్యూ బోర్డు ఆదేశించింది

రెవిన్యూ బోర్డు ఉత్తర్వు ఫలితంగా భూమిలేని పేదలకు పోరంబోకు కేటాయింపు కార్యక్రమం నిలిచిపోతుందని ప్రతినిధివర్గం రెవిన్యూ మంత్రికి తెలియచేసింది.

నిజామాబాద్ జిల్లా వార్తలు

నిజామాబాదు, అక్టోబరు 25

నిజామాబాద్ జిల్లాలో అనేకచోట్ల వరిపైరుకు తెగుళ్ళు సోకాయి పైరుపై అగ్గి మిసిల్ తెగుళ్ళ నివారణ మందు చల్లవలసిందిగా జిల్లా వ్యవసాయ అధికారులు రైతులకు విజ్ఞప్తి చేశారు.

ఈ విషయమై దగ్గరలో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి సలహా పొందవచ్చునని రైతులకు సూచించారు

ఆర్. టి. సి. బస్సు రూటు ప్రారంభం

రాష్ట్ర చేనేత పరిశ్రమ మంత్రి శ్రీ కె వి. కేశవులు ఇటీవల ఎల్లారెడ్డి తాలూకాలో శివనగర్ - రుద్రంగియాల మధ్య ఆర్. టి. సి బస్సు రూటుకు ప్రారంభోత్సవం చేశారు.

యువజన సభ

ఇటీవల నిజామాబాదులోని శిల్క్‌గార్డెన్ హోటలులో జరిగిన యువజనుల సభలో డి ఆర్ ఓ శ్రీ హరినారాయణ ప్రసంగిస్తూ యువజనులు గ్రామీణ ప్రాంత ఉద్ధరణ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు అనంతరం వివిధ గ్రామాలకు చెందిన యువజనులు ప్రసంగించారు.

500 ఎకరాలకు పట్టాలు

నిజామాబాదుజిల్లా బోధన తాలూకాలోని పేదలకు 500 ఎకరాలకు పట్టా లిచ్చే సందర్భంగా 2000 మందితో పెద్ద సభ జరిగింది

జిల్లా రెవిన్యూ అధికారి శ్రీ జె హరినారాయణరావు అధ్వర్యాన 17 వ తేదీన జరిగిన ఈ సభకు 53 గ్రామాల నుండి ప్రజలు హాజరయ్యారు. శాసన సభ్యుడు శ్రీ ఎం. శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ మాధవరావుదేశపాండే, సమితి అధ్యక్షులు శ్రీ రేణుకాదాసరావు ప్రసంగించారు. 20 అంశాల కార్యక్రమాన్ని శ్రీహరి నారాయణరావు వివరించారు పట్టాలు పొందిన ప్రభుత్వ భూములను అమ్మినవారిని, కొన్నవారిని తీవ్రంగా శిక్షిస్తామన్నారు డిసెంబరు తరువాత మిగులు భూములపంపిణీ జరుగుతుందనీ, లెక్కలు రికార్డులు తారుమారయితే రెవెన్యూ సిబ్బందిని కఠినంగా శిక్షిస్తామని చెప్పారు

లేఖలు

ఉపాధ్యాయేతర సిబ్బంది వేతనాలు

మహాశయా!

ప్రభుత్వేతర కళాశాలల యొక్క ఉపాధ్యాయేతర సిబ్బందికి ఇంతవరకు ప్రభుత్వోద్యోగులతోపాటు, సమానముగా జీతములు యిచ్చుచు ఉద్యోగులకు జీత భత్యములు పెంచినప్పుడు పైచెప్పిన ఉపాధ్యాయేతర సిబ్బందికి కూడ పెంచుచు ప్రభుత్వము వీరిని ప్రభుత్వోద్యోగులతోపాటు పరిగణించుచు వచ్చిరి. కాని యిటీవల ప్రకటింపబడిన వేతనాల సవరణలో ప్రభుత్వోద్యోగులకు ఉపాధ్యాయులందరికి నూతన వేతనములను వర్తింపజేయుచు ఉపాధ్యాయేతర సిబ్బందిని మాత్రమే ఎందునకు వదలినారో వూహించుటకు కూడా వీలుగా కున్నది వీరిని ఆ పరిధి నుండి ప్రభుత్వము తొలగించుట అన్యాయమని నేను చాలా విచారించుచున్నాను ఇంతవరకు వీరి యెడల ప్రభుత్వ మవలంబించుచున్న విధానమునకు యిది విరుద్ధము ఉపాధ్యాయేతర సిబ్బంది యొక్క సర్వీసు పరిస్థితులు భరింపరానివిగా నున్నవి

శ్రీమతి ఇందిరాగాంధి దేశమును ఆదర్శవంతమైన జాతిగా తీర్చిదిద్దుటకు ప్రయత్నమును కొనసాగించుచున్నది. అట్టి పరిస్థితిలో విద్యాసంస్థలలోని ఉపాధ్యాయేతర సిబ్బంది యొక్క సర్వీసు పరిస్థితులను మెరుగుపరచవలసియున్నది ఉపాధ్యాయులతోపాటు వీరికి వేతన సౌకర్యములు పెన్షను మొదలగు ఇతరసౌకర్యములు కలిగించుట న్యాయము. కళాశాలలలోని ఉపాధ్యాయులకు జీతములను సవరించుట ఎంత అవసరమో అదే సంస్థలలో పరిపాలనా భారమును సమర్థవంతముగా వహించుచున్న యీ ఉపాధ్యాయేతర సిబ్బందికి కూడ వర్తింపజేయుట అంతే అవసరము వారి సమస్యలను ప్రభుత్వమువారు సానుభూతితో పరిశీలించి తగు సహాయము చేయగలరని ఆశించుచున్నాను.

తోట సర్వేశ్వరరావు,
ప్రెసిడెంట్
ఆంధ్రాయూనివర్సిటీ అనుబంధకళాశాలల
ఉపాధ్యాయేతర సంఘము
(మచిలీపట్నం)

ప్రముఖ వృద్ధ క్రీడాకారులకు పింఛన్ యివ్వాలి

ఆర్యా!

గవర్నమెంటువారు ప్రముఖులైన వృద్ధ క్రీడాకారులకు నెలకు ఒక్కొక్కరికి 500/- చొప్పున యిచ్చుటకు ఆర్డర్లు యిచ్చినారు. అరుకోట్ల మంది ఆంధ్రులలో యీ జాబితాలోని వారిసంఖ్య 30 మందిమాత్రమే. దీనిలో చదరంగం, కాలిబంతిఆట టెన్నిసు, బాడ్మింటనులలో ప్రముఖులు గలరు వీరందరు కొన్ని దశాబ్దములు అనేక త్యాగములు చేసి, రాష్ట్రకీర్తి ఇనుమడింపచేయుటకు అవిరళకృషి చేసి, ఆబాలగోపాలమును క్రీడలలో ఓనమాలనేర్పి, ఉత్తేజపరచిఆదర్శప్రాయులై అనేక సన్మానములు పొందారు. వీరందరు డెబ్బదవపడిలోని వృద్ధులు ఎండుటాకులవలె రాలిపోతున్నారు.

1973లో వీరికి 3/4 వంతున్ను, 1974లో ¼ వంతున్నూ మాత్రమే యిచ్చారు. 1975 లో యిప్పటి వరకూ యివ్వలేదు. ఇతర దేశములలో యిప్పటి క్రీడాగ్రేసరులకు లక్షలు యిచ్చి జాతి వీరులుగా చేయుచున్నారు. యువతరమునకు ఆదర్శప్రాయులైన వీరికి మంజూరు చేసిన ప్రకారం బకాయిసొమ్ములో ఈ సంవత్సరము మంజూరు చేయుటకు ప్రభుత్వ ధర్మము కళాకారులకు మంజూరుచేసినట్లు వీరికి నెలకు రు. 00/. 1975నుంచి యిచ్చుట సమంజసము. కళాకారులకు క్రీడాకారులకు ఆదర్శము ఒక్కటే గదా. మన ముఖ్య మంత్రి గారు వెంటనే కల్పించుకొని ఆట గాండ్రకు న్యాయం చేకూర్చవలసినదిగా వేడుచున్నాను

లక్కా లక్ష్మీనారాయణ, బి ఎ బిఇడి(రిటైర్డు)
గుడివాడ.

ఇండ్ల స్థలాలకు పట్టాల పంపిణీ

దరశి, అక్టోబరు 25

ప్రకాశంజిల్లా దరశి తాలూకా తహసిల్దారు శ్రీ అల్లాపుద్దీన్ ఇటీవల బృందావనం గ్రామం అంబాడీలకు 84 యిండ్లకు రామాపురం గ్రామ పేదలకు 17 మందికి బంజరు భూములకు పట్టాలు పంపిణీచేశారు. ఈ గ్రామాలలో యిండ్ల స్థలాల, బంజరు సమస్య గత 7, 8 సంవత్సరాలుగా పెండింగులో వున్నది.



స్టేషన్లను
పరిశుభ్రంగా వుంచేందుకు
మాకు తోడ్పడండి

మీరు రైల్వే స్టేషనులో ఆగేది కొద్ది క్షణాలే కావచ్చు —లేక కొన్ని గంటలే కావచ్చు. అయినా ప్లాటు ఫారాలు, విశ్రాంతి గదులు, స్నానాగారాలు వగైరాలతో విరాజిల్లే స్టేషన్ ఆవరణ యావత్తూ తీర్చిదిద్దినట్లు, పరిశుభ్రంగా వుండాలని వాంఛిస్తారు. మీ కోరిక నెరవేర్చడానికి మా శాయశక్తులా యత్నిస్తాము మీరు సైతం మాకనేకవిధాల తోడ్పడగలరు. చెత్తా, చెదారాన్ని విశ్రాంతి గదుల్లో, ప్లాటుఫారంపై వదలక చెత్తకుండీలలో వేయవచ్చు. స్టేషన్ ఆవరణ అపరిశుభ్రంగా వుంటే ఆపనికై నియుక్తులయిన రైల్వే స్వీపర్ల సేవకై అడగండి.

మన స్టేషన్లను పరిశుభ్రంగా వుంచడానికి మీతోడ్పాటు మాకు సహకరిస్తుంది.

ఆగ్నేయ రైల్వే

33 మంది బాలురు ఆస్పత్రిలో చేరిక

తంజావూర్, అక్టోబరు 28

ఇక్కడికి 20 కిలోమీటర్ల దూరంలోగల ఒరతనాడ్‌లో ఒక హాస్టల్‌లోని 33 మంది బాలురు విషాహారం సేవించారన్న అనుమానంపై నేడిక్కడ ఆస్పత్రిలో చేర్చబడ్డారు.

మధ్యాహ్న భోజనం తీసుకున్న అనంతరం ఈ బాలురకు వాంతులు ప్రారంభమయ్యాయని హాస్టల్‌లోని మిగతా బాలురు చెప్పారు.

భూగర్భంలో చైనాచే అణ్వస్త్ర ప్రయోగం

టోక్యో, అక్టోబరు 27

చైనా నేడు భూగర్భంలో రెండవ అణ్వస్త్ర పరీక్షను విజయవంతంగా కొనసాగించినట్లు అధికార వార్తాసంస్థ సిన్హువా ధృవీకరించింది.

చైనా కొన్ని పరిమితులలో రక్షణ ప్రయోజనాలకోసం అవసరమైన అణుపరీక్షలు జరుపుకొందని, అణ్వస్త్రాలు అగ్రరాజ్యాల గుత్తసొత్తు కాకుండా చూడటం చివరకు అణ్వస్త్రాలను నిషేధించే లక్ష్యంతోను అణ్వస్త్ర పరీక్షలు జరుపుతోందని టోక్యోలో మానిటర్ చేయబడిన ప్రసారంలో సిన్హువా తెలిపింది.

అయితే ఏ పరిమితి అణ్వస్త్రాన్ని ప్రయోగించిందీ దాని వివరాలను ఆ సంస్థ బయట పెట్టలేదు

నమస్కారం! నాపేరు కనకదుర్గ!
మా అమ్మపేరు అలివేలు మంగ
నాయిన పేరు వెంకటేశ్వర్లు
తాతపేరు వెంకట సుబ్బయ్య!
అన్నట్లు...
నేను మా బావ కలిసి
అదే... ఆ... తేనె చంద్రుణ్ణి
చూడాలని మీ వూరు వస్తే...
అదేంటబ్బా..
మీరు మమ్మల్ని
అలా విరగబడి
చూస్తున్నారు?
చూడండి...
కె. వెంకటరామరెడ్డి సమర్పించు రవిరాజ్ కంబైన్స్
సంతానం - సౌభాగ్యం
నిర్మాత: కేశన జయరామ్ దర్శకత్వం: డి.ఎస్.ప్రకాశరావు
తారకరామ
THARAKARAMA

పాపులర్ షూ మార్టు
ది.16-8-75 నుండి ది.30-11-75 వరకు
మా బ్రాంచిలలో జత కొని ఉచిత
లాటరీ బహుమతి కూపను
పొందండి
మొదటి బహుమతి రు.10,000.
2వ " 2 సువేగా మోటారు సైకిళ్లు
మొత్తం బహుమతులు 138
SUVARNA

రేపే విడుదల!
కిరణ్ కుమార్
రాధా సలూజా,
రంజీత్ నటించిన
మ్యూజికల్ హిట్!
విజయవాడ...శ్రీకనకదుర్గ
గుంటూరు...రంగమహల్
నెల్లూరు...వెంకటేశ్వర
వైజాగ్... ? ? ? ?
గాల్ గులాబీ నైన్ షరాబీ


అపూర్వ సమ్మేళనం!
నవంబర్ 7 విడుదల!
ఉదయం ఆటతో
అమితాబ్ నటించిన చిత్రాలలోకెల్లా అగ్రశ్రేణి చిత్రం!
షోలే
దర్శకత్వం: రమేష్ సిప్పీ
రచన: సలీం జావేద్ సంగీతం: R.D.బర్మన్
రాజశ్రీ పిక్చర్స్ (P) Ltd రిలీజ్
DEVI


అందరి ఆశీస్సులతో!
50 వ రోజు
లక్ష్మణరేఖ [మరాఠీ]కి
వినోదపు పన్ను మినహాయించారు!
* అవార్డు గెలుచుకున్న చిత్రం!
* ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌కి ఎన్నికైంది!
* పంజాబీ, బెంగాలీ, గుజరాత్‌లలో
విజయఢంకా మ్రోగిస్తోంది!
ఏ.వి.కె. ప్రొడక్షన్స్...
లక్ష్మణరేఖ
తారకరామ
నవభారత్
శ్రీతారకరామ
నిర్మాతలు:
పి.యం.షణ్ముగం, ఏ.వి.కృష్ణారావు
దర్శకత్వం: ఎన్.గోపాలకృష్ణ B.Sc
నిర్వహణ: యం.వెంకటరత్నం
THARAKARAMA
కోస్తా జిల్లాలకు హక్కుదార్లు:
భాస్కర మోటార ట్రేడింగ్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్ కాకినాడ

ఇటు స్త్రీలకు
4 వ వారం
అటు పురుషులకు
అన్ని వర్గాల వారికి
నచ్చిన చిత్రం!.....
రవికళా మందిర్
గాజుల కిష్టయ్య
ఈస్ట్‌మన్ కలర్
స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ఆదుర్తి సుబ్బారావు
పాటలు: ఆత్రేయ సంగీతం: కె.వి.మహదేవన్
నిర్మాతలు: ఆదుర్తి భాస్కర్, ఎమ్.ఎస్.ప్రసాద్
శ్రీ ఫిలింస్
WEEKAY

దాసరి నారాయణ రావు
5 వ వారం
భారతంలో ఒక అమ్మాయి
నిర్మాతలు: యమ్మా మురారిరెడ్డి, ముత్యాల నాగేశ్వరరావు,
[illegible]

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ప్రచురణకర్త అండ్ పబ్లిషర్ సి. వెంకటేశ్వరరావు ఎడిటర్ సి. రాఘవాచారి ముద్రణ విశాలాంధ్ర అచ్చు యంత్రం. విజయవాడ. 120/4 C. NO. 1138/75